ఆంధ్రపత్రిక


సచిత్ర వార పత్రిక



4 అణాలు

23-5-'56

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



చిలకలపూడి కీరపండరీక్షేత్రంలో పాండురంగ విఠల్ దేవాలయ గోపుర దృశ్యం.

ఫొటో: నేమాని సూర్యారావు—రాజమండ్రి.



సాంచీ బుద్ధ ప్రతిమ

(సాంచీ స్తూప ప్రాఙ్గణం [illegible] ఈ ప్రతిమ క్రీ. శ. 5 వ శతాబ్దం నాటిది.)

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 50
సంచిక 37
23-5-56

దుర్ముఖ వైశాఖ శుద్ధ చతుర్దశి బుధవారం

విషయానుక్రమణిక

★


ముఖచిత్రం: మహీవారి "గారి మాహాత్మ్యం"లో సూర్యకళ.

రాబోయే సంచిక

బుద్ధ జయంతి సంచిక

వైశాఖపూర్ణిమ (మే 24)తో ప్రారంభమై బుద్ధ పరినిర్వాణ పంచవింశ శతాబ్ద్యుత్సవాలు భారత దేశమంతటా భారీ యెత్తున జరుగనున్నాయి. ఈ సందర్భంలో మే, 30 వ తేదీ ఆంధ్ర వారపత్రిక బుద్ధజయంతి సంచికగా వెలువడుతున్నది. బౌద్ధ మతానికి సంబంధించిన వ్యాసాలు, కథలు, బౌద్ధ శిల్పకళావైభవాన్ని చాటే అనేక మనోహరచిత్రాలు ఈ సంచికలో ప్రత్యేకాకర్షణలుగా ఉంటాయి.

మీ ప్రతి నేడే రిజర్వు చేసుకోండి.



న్యూఢిల్లీ లేఖ

"భారత ప్రజలమైన మేము" అని ప్రారంభమవుతుంది భారత రాజ్యాంగం. పౌరులందరికీ సమాన ప్రతిపత్తి, సమానావకాశాలు లభిస్తాయని రాజ్యాంగం గ్యారంటీ ఇస్తున్నది. "భారత దేశంలో న్యాయ చట్టాన్ని అనుసరించి ప్రతివానికీ సమాన ప్రతిపత్తిని, సమాన న్యాయరక్షణను కలిగించడానికి ప్రభుత్వం నిరాకరించదు," అని రాజ్యాంగంలోని 14 వ నిబంధన చెబుతున్నది. మత, జాతి, కుల, లింగ, జన్మస్థల భేదాలను సాకు చేసుకుని ప్రభుత్వం ఏ పౌరునియెడల భేదభావం కనబరచదని 15 వ నిబంధన చెబుతున్నది.

గత నవంబరులో ఢిల్లీలో వ్యాపించిన కామెర్ల అంటువ్యాధిమూలంగా అధికార ప్రకటనప్రకారం 83 గురు దుర్మరణం పొందడం, ఈ అంటువ్యాధికి అంతిమబాధ్యత నిర్ణయించడానికి ఏర్పడిన దర్యాప్తుసంఘ నివేదికను అమలుచేయడం సందర్భంలో పై విధంగా రాజ్యాంగంనుండి కొన్ని నిబంధనలు ఉట్టంకించవలసి వచ్చింది.

కామెర్ల దర్యాప్తు సంఘనివేదికలో ఇలా ఉంది:—

(1) రాసాయనిక పరిశోధనవలన తేలిన అంశాలను పరిగణించక పోవడంలో శ్రీ కాట్‌వాలా తన బాధ్యతను విస్మరించారు. వ్యాధి నివారణచర్యలను, జలశుద్ధి చర్యలను ఆయన జరపలేదు. పైగా బాధ్యతను ఇతరుల పైకి తోసివేయడానికి ఆయన మళ్ళీ మళ్ళీ ప్రయత్నించారు.

(2) నవంబరు 18 నాటికే జలమంతా అపరిశుద్ధంగా తయారైందని తెలిసికూడా, శ్రీ మెహతా ఆ రోజు ఉదయం ఢిల్లీరాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టరుతో ముఖాముఖి సంప్రదింపులు జరపలేదు.

(3) జలం అపరిశుద్ధం కాకుండా నివారించే చర్యల విషయంలో, ఇంజనీరింగ్ అధికారులు ఎంతసేపూ జలం సమృద్ధంగా ఉన్నదా లేదా అనేదే ఆలోచించారు. కాని జలం మంచిదా కాదా అని ఆలోచించలేదు. జలం సమృద్ధిగా ఉంచే శుద్ధత దానంతటదే వస్తుందని వీరి అభిప్రాయం. జలసమృద్ధి కొరవడినంతమేరా జలశుద్ధత కూడా లోపించింది. అందుచేత వారు ఉన్న నీటిని బాగుచేసే ప్రయత్నాలమీద ఆధారపడి ఊరుకున్నారు. జలం అపరిశుద్ధమైన దన్న ప్రమాద పరిస్థితిని పైఅధికారులకు స్పష్టంగా తెలియజేసినట్లయితే ఇంకా గట్టి నివారణ చర్యలు తీసుకోవడానికి వీలయ్యేది.

మురికినీరు కలిసినట్లు రాసాయనిక పరిశోధన ఫలితంగా నవంబరు 11 ఉదయానికి వెల్లడయిన విషయాలను వడపోత యంత్రానికి సంబంధించిన అధికారులు పట్టించుకోకుండా వదిలేశారని కూడా దర్యాప్తు సంఘం అభిప్రాయ పడుతున్నది.

(4) ఇక ఢిల్లీ రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టరు సంగతి సరఫరా అయ్యే జలంలో వ్యాధికారక క్రిములున్నాయా లేదో పరీక్ష చేయించవలసిన బాధ్యత వీరిదే. ఈయన జలం అపరిశుద్ధం అయిన సంగతి నవంబరు 16 వ తనకు తెలియగానే అశుభ్రజలం సరఫరా కాకుండా ఆపించిన సంగతి నిజమే అయినా, రాసాయనిక పరిశోధన ఫలితాలను పరిశీలించే భారం వహించక వదిలిపెట్టి ఎన్నిరోజులనుండి అశుభ్రం అయినదో ఇంజనీరింగ్ అధికారులనుండి తెలుసుకుని మాత్రం ఊరుకున్నారని దర్యాప్తు సంఘం ఆరోపిస్తున్నది."

శ్రీకృష్ణ
(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

ఢిల్లీ రాష్ట్ర ఆరోగ్యశాఖాధికారి డా॥ యదుబీర్ సింగ్ కామెర్లవ్యాధికి దేవుడిదే బాధ్యత అని మొదట్లో చెప్పారు. దేవుడి దయవల్లనే దర్యాప్తు సంఘంవారు ఈయనను మర్యాదగా వదిలిపెట్టారు.

విధి నిర్వహణలో లోటుపాట్లచేత వ్యాధి వ్యాప్తికి బాధ్యులైన అధికారులను శిక్షించకుండా ఊరుకోవాలని ప్రభుత్వ అభిమతం కాదని డా॥ యదుబీర్ సింగ్ మార్చి 26 వ స్థానిక విధానసభలో చెప్పారు. మంచినీటి సరఫరా, మురికినీటి పారుదల సంయుక్తసంఘ అధ్యక్షుడైన చీఫ్ కమీషనరు కొందరు అధికారులపై ఆరోపణలు చేశారనీ, పైసంఘం తిరిగి సమావేశమైనప్పుడు ఆ అధికారులపై ఏ చర్యలు తీసుకోవాల్సిందీ చర్చిస్తారనీ దోషులను శిక్షించడం తప్పక జరుగుతుందనీ ఆయన హామీ ఇచ్చారు.

దోషులను శిక్షించిన విధాన మిది:—

ఢిల్లీ నీటి సరఫరా, మురికినీటి పారుదల సంయుక్త సంఘం సమావేశమై సంఘం తాలూకు ఇంజనీర్ - సెక్రటరీ శ్రీ ఆర్. ఎస్. మెహతాను "హెచ్చరించ" వలెనని నిర్ణయించింది. వజీరాబాద్ వాటర్ వర్క్సు వద్ద జలం నవంబరు 10 వ తేదీన అపరిశుద్ధం అయి ఢిల్లీలో కామెర్ల వ్యాప్తికి, అనేకుల మృతికి కారణమైనప్పుడు శ్రీ మెహతా ఆరోగ్యశాఖాధికార్లకు ఆవిషయం తెలియ పరచలేదని ఆయనపై ఆరోపణ.

వజీరాబాద్ వాటర్ వర్క్సు సూపరింటెండెంట్ శ్రీ డి. బి. కాట్‌వాలాపై ఏ చర్యా తీసుకోబడలేదు.

ఢిల్లీ చీఫ్ కమీషనరు శ్రీ ఎ. డి. పండిట్ అధ్యక్షతను సమావేశమైన పై సంఘం శ్రీ మెహతా, కాట్వాలా గార్ల సంజాయిషీలను చర్చించింది.

శ్రీ మెహతా జలసమృద్ధి కొరవడుతున్నందున దాన్ని తిరిగి భర్తీచేయడానికి కాయకష్టనా కృషిచేశారు. కనుక ఆయనపై తీవ్రచర్య ఏమీ తీసుకోలేదట. జల సమృద్ధిని ఎక్కువచేయడమే అసలు ప్రధాన సమస్య గనుక దానిపైనే తాను శక్తివంచన లేకుండా చర్యలు తీసుకున్నానని శ్రీ మెహతా సంజాయిషీ ఇచ్చారు. సైన్యంనుంచి సామగ్రిని, కేంద్ర పబ్లిక్ వర్క్సు శాఖనుండి కార్మికులను తెప్పించి నీటిని తీసుకువచ్చే కాలువలను లోతు చేయించడానికి అమితకృషి చేశానని శ్రీ మెహతా చెప్పుతున్నారు.

నవంబరు 17 వ తేదీకల్లా నీటిని భర్తీ చేయగలిగానని ఆయన చెప్పారు. ఈ సంజాయిషీని పై సంఘం ఆమోదించింది.

మూడు నెలల సెలవు మీద వెళ్ళిన

న్యూ ఢిల్లీ లేఖ

శ్రీ మెహతా వెంటనే కాగానే వచ్చి పనిలో చేరుతారట.

ఆయన ఆరోగ్యం చెడిపోయిందని కేంద్ర ఆరోగ్య మంత్రిణి ఆందోళన పడుతున్నది.

1946 సెప్టెంబరు 2 న భారత ప్రధాని పదవి స్వీకారం చేసినప్పుడు న్యూఢిల్లీ యార్క్ రోడ్ నం. 17 వ ఇంటిలో ఉంటేవారు. ఈ ఇంటిలో ఇప్పుడు ఇటాలియన్ రాయబారవర్గం ఉంటున్నది. అసలీభవనం ఢిల్లీలో పెద్ద అడ్వొకేటుగా పేరు పొందిన శ్రీ. శ్రీ. రాయ్ బహదూర్ హరీష్ చంద్రగారిది. ఆయనకు మగ సంతు లేనందున ఒక పిల్లవాణ్ణి పెంచుకున్నారు. చనిపోయే ముందు దత్తునికి పెళ్ళిచేశారు. అతడు కూడా ఇటీవలకామెర్ల వ్యాధికి బలి అయినాడు!

హరీష్ చంద్రకు సంబంధించినంతవరకూ ఆయన వంశం అంతరించినట్టే. ఇద్దరు వితంతువులు మాత్రమే మిగిలారు. వీరిలో ఒకరు బాల వితంతువు. వీరి ఆక్రందనల మూలంగానే పాపం శ్రీ మెహతా ఆరోగ్యం చెడిపోయి, నరాలు దెబ్బతిని ఉంటాయి. నిజానికి కామెర్ల దర్యాప్తు సంఘం కూడా శ్రీ మెహతాగారిదేమీ తప్పులేదని బుజువు చెయ్యడానికి తంటాలు పడింది.

ఎందుకని? ఆర్. ఎస్. మెహతా డా॥ జీవరాజ్ మెహతాగారి కులానికి చెందినవాడనా? లేకపోతే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మానవ ప్రాణం చవకైపోయిందనా?

ఇటువంటివి ఇంతకు ముందు జరగలేదని కాదు, జరిగాయి. కుంభమేళంలో స్త్రీ పురుషుల నేకులు నలిగి నలిగి చనిపోయారు. ఒక ప్రశ్న ఏమిటంటే, బ్రిటిషు వాళ్ళే ఈ దేశాన్నింకా పరిపాలిస్తూ ఉంటే, కామెర్ల మూలాన ఇది గురి నరకూ ఎందుకు, ముగ్గురే చనిపోయి ఉంటే, మన నాయకులు ఎంతి ఆర్భాటం చేసేవారు?

వచ్చిన బాధ ఏమంటే, ఢిల్లీలో ప్రజాభిప్రాయం దృఢమైనది, నిశితమైనది లేదు. నిజంగా చురుకైన ప్రజాస్వామ్యమే ఉంటే కామెర్ల వ్యాధిబాధితులైన పౌరులు పురపాలక సంఘంమీద నష్టపరిహారం దావా వేసేవారే.

ఢిల్లీ ప్రజాస్వామ్యాన్ని గూర్చి మాజీ ఢిల్లీ ముఖ్య మంత్రి అదే పనిగా నినాదాలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యంఅంటే కొందరికి పెద్ద ఉద్యోగాలు లభించడం అని అర్థం కాదు. ప్రజా స్వామ్యం మానవుల సౌభాగ్యానికి, సౌకర్యాలకు మార్గప్రాయమైనది. కామెర్లవ్యాధి మూలంగా పలువురి జీవితాల్లో విషాదమేఘాలు క్రమ్ముకున్నాయి. ఇంత జరిగినా మార్చి 28 న దర్యాప్తు సంఘం నివేదికను చర్చించ వచ్చేసరికి ఢిల్లీ విధాన సభలో 'కోరం' లేదు. వ్యాధి వ్యాప్తికి బాధ్యులైన వారిని శిక్షిస్తామని ప్రభుత్వం చేసిన వాగ్దానం అమలు జరిగి తీరాలని పార్లమెంటులో ఢిల్లీ ప్రతినిధు లెవరూ ఇంతవరకూ ఒత్తిడిచేసిన పాపాన పోలేదు.

* * *

ఎన్నికలు జరిపే నిర్ణయాన్ని శాసన సభకే వదిలివేస్తే, అసలు ఎన్నికలనేవే ఉండవు. రాజ్యాంగసభ తనకాల పరిమితిని ఒకఏడాదిదాకా పొడిగించుకున్నది.

ఎన్నికలకు ఇంకా ఒక ఏడాది వ్యవధి ఉండగానే, పార్లమెంటు సభ్యుల్లో ఒక వర్గంవారు శ్రీ చంద్రదత్ పాండే నాయకత్వాన, ఎన్నికలు వాయిదా వేయాలనే నినాదం లేవదీశారు. "మహారాష్ట్రలో కాంగ్రెసు పరిస్థితి ఏమీ బాగాలేదు. ఉత్తర ప్రదేశ్ లో ఉప ఎన్నికలలో కాంగ్రెసు పొందిన ఓటమి నిరుత్సాహజనకంగా ఉన్నది. పశ్చిమ బెంగాల్ లోనూ అలాగే ఉంది. పంజాబ్ లో హిందువులలో కాంగ్రెస్ వ్యతిరేకత ఎక్కువైంది" ఇదీ ఈ వర్గం వారు చేసే ఆందోళనలోని సారాంశం.

కాంగ్రెస్ సంస్థ నానాటికీ అధోముఖంగా పయనిస్తోంది. దీన్ని నివారించ సమర్థులైన వారు సుఖం మరిగారు; పదవీ వ్యామోహితులైనారు. 1954 లో కంటె 1955 లోను, 1955 లో కంటె 1956 లోనూ కాంగ్రెసు ప్రతిష్ఠ బాగా దెబ్బ తిన్నది కనుక సంస్థను యావత్తూ శుభ్రంగా కడిగివేసి పునరుజ్జీవింపజేసే సమర్థుణ్ని ఎవరినైనా కాంగ్రెసు నియమించిందా అని ప్రశ్న. నియమిస్తే, అప్పుడొకవేళ ఎన్నికలను వాయిదా వేయడం వలన, కాంగ్రెసును పటిష్ఠం చేసేందుకు కావలసిన వ్యవధి దొరుకుతుంది. అటువంటి సమర్థుణ్ని ఎవర్నీ కాంగ్రెసు నియమించలేదన్న సంగతి అందరికీ తెలిసినదే.

ఇంకో విషయం : ఎన్నికలలో కాంగ్రెసుతో పోటీచేసే పార్టీల బలాబలాలెలా ఉన్నాయి? మాస్కో విధాన పరిణామాల వల్లా, భారతప్రధాని ఆర్థిక విధానాలవల్లా కమ్యూనిస్టుల చేతులు కట్టివేసినట్లయింది. సోషలిస్టులు తమలో తాము కుమ్ములాడుకుంటున్నారు. హిందూ మహాసభ ఎన్నడూ బలమైన ప్రత్యర్థిగా లెక్కకు రాలేదు. కాంగ్రెసు మళ్లీ ఇంత మెజారిటీతోనూ అధికారంలోకి వస్తుందని కాంగ్రెసువాదులకు తెలుసు. అయితే మరి వారి భయం ఏమిటి ఇంతకీ ? దీనికి సమాధానం, ఇప్పుడున్న శాసనసభ్యులలో మూడోవంతు సభ్యులు వచ్చే ఎన్నికలలో అభ్యర్థిత్వం కోల్పోతారని లక్నో నుంచి వెలువడిన ఒక వార్త. దీంతో ప్రతివారూ "ఉత్తమపురుష ఏక వచనం"లో ఆలోచించడం మొదలెట్టారు. భారత ప్రధాని మాత్రం "ఇదేం కుదర"దన్నారు.

దీని తరవాత జరిగినది చాలా దారుణంగా ఉన్నది. రాష్ట్రపునర్వ్యవస్థీకరణ బిల్లులను పార్లమెంటు ఆమోదించడానికి, ఎన్నికలనూ ముడిపెట్టబడింది. ఈ బిల్లులను ఉభ

(8-వ పేజీ చూడండి)

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్‌వాలెస్

అరుణవలయం

అనువాదం: “ప్రద్యుమ్న”

11 హంతకుడు సిబ్లీ

మరునాడు రాత్రి పదూడు నిమిషాలు తక్కువ పదింటికి స్టేన్స్ స్క్వేర్ లోకి ఒక కారు నిశ్శబ్దంగా ప్రవేశించి క్లార్జస్ వీధి మొగలో ఆగింది. కొన్ని నిమిషాల అనంతరం థాలియా డ్రమండ్ అవతలి కొసనుండి స్క్వేర్ లోకి వచ్చింది. పొడుగాటి నల్లని గౌను ధరించింది. నెత్తిమీద చిన్న టోపీ పెట్టుకుని ఒక గుడ్డతో దాన్ని గడ్డానికి బిగించి కట్టుకుంది.

కారును చూడగానే జంకూ గొంకూ లేకుండా తలుపు తెరిచి లోపల కూర్చుంది. అంధకారం కన్ను పొడుచుకున్నా కానరానంత దట్టంగా ఉంది. కాని ఆ అంధకారంలోనే డ్రైవరు ఆకృతిని అస్పష్టంగా ఆమె చూడగలిగింది. అతడు తల తిప్పలేదు కారునుకూడా పోనివ్వలేదు. ఇంజను చప్పుడుమాత్రం మెల్లిగా వినిపిస్తోంది.

“నువ్వు దొంగతనం చేసినందుకుగాను మేరిల్‌బోన్ పోలీసుకోర్టులో నిన్న నీ మీద విచారణ జరిగింది. నిన్న మధ్యాహ్నం పేపరులో నువ్వొక అడ్వర్టయిజ్‌మెంట్ వేశావు. ఇంకో ఉద్యోగం చూసుకుని, మళ్లీ మామూలుగా దొంగతనాలు సాగించాలని నీ ఉద్దేశం..,”

థాలియా జంకలేదు. నిశ్చలమైన కంఠస్వరంతో “స్థిరంగా ఉన్నాను. నా గత చరిత్రను నాకు తెలపడానికా నన్నిక్కడికి పిలిపించావు? నీ ఉత్తరం చూడగానే నన్ను నీ కార్యక్రమంలో ఉపయోగించుకోడానికే ఆహ్వానించావనుకున్నాను. అయితే నేను నిన్నొక ప్రశ్న అడగాలి,” అన్నది.

“ఇష్టమైతే జవాబిస్తాను,” అని కఠిన కంఠం వినిపించింది.

“అవును, ఇష్టమైతేనే ఇయ్యి. నేను నీ ఉత్తరంసంగతి పోలీసులకు తెలియజేశాననుకో. ఇన్‌స్పెక్టర్ పార్‌ను, డిటెక్టివ్ యేల్‌ను చాటుగా వెంటబెట్టుకుని వచ్చాననుకో—”

“ఈ పాటికి నీ శవం రోడ్డుమీద పడి ఉండేది. మిస్ డ్రమండ్! నీకు తేలికగా డబ్బు లభ్యమయ్యే మార్గం చూపిస్తాను. నీకు మంచి ఉద్యోగంకూడా చూపిస్తాను. నీకు ఖాళీగా ఉన్నప్పుడు కాలక్షేపానికి దొంగతనాలు చేసినా నేనేమీ పట్టించుకోను. కానీ నీ ముఖ్యమైనవిధి నేను చెప్పినట్లు చెయ్యడం. అర్థమైందా?”

ఆమె తలఊపింది. చీకట్లో తను తల ఊపడం కనిపించదని గ్రహించి, “ఆ” అన్నది.

“నువ్వు చేసిన ప్రతిదానికీ నీకు డబ్బిస్తాను. నీకు ఏ సహాయం కావలసినా నేను దగ్గర్లో ఉండి అందుకుంటాను. కాని నన్ను మోసగించజూచావంటే తగినశిక్ష విధిస్తాను. ఏం?”

“అలాగే.”

“సరే. నీకు చాలా తేలికపని ఇస్తాను. రేపు బ్రబజాన్ బ్యాంక్‌కి వెళ్లు. బ్రబజాన్‌కు సెక్రటరీ కావాలట,” అన్నాడు అజ్ఞాతవ్యక్తి.

“నన్ను ఉద్యోగానికి తీసుకుంటాడా? పేరు మార్చుకోమంటావా?” అని థాలియా అడిగింది.

“అక్కర్లేదు, నీ పేరుతోనే వెళ్లు. నన్ను చెప్పనియ్యి, అడ్డంరాకు. ఇదుగో, రెండు వందల పౌన్లు ఖర్చుకు ఇస్తున్నాను,” అని వెనక్కి తిరిగిచూడకుండానే భుజం మీదుగా రెండు నోట్లు ఆమె కందించాడు.

అందుకునేటప్పుడు ఆమె చెయ్యి అతని భుజానికి అనుకోకుండా తగిలింది. అతని కోటుకింద ఏదో చాల గట్టిగా తగిలింది.

“తుపాకి దెబ్బ తగలకుండా ఇనపకవచం తొడుక్కున్నాడన్నమాట” అని థాలియా తనలో అనుకుంది. “అయితే బ్రబజాన్‌తో నా పూర్వచరిత్రగురించి ఏం చెప్పను?” అని పైకి అన్నది.

“ఏమీ చెప్పనక్కరలేదు. ఏంచెయ్యాలో నేను సమయం వచ్చినప్పుడల్లా చెబుతూ ఉంటాను. ఆ ప్రకారం చేస్తూ ఉండు,” అని అజ్ఞాతవ్యక్తి ఆజ్ఞాపించాడు.

కొన్ని నిమిషాల తరువాత థాలియా డ్రమండ్ ఒక టాక్సీలో మూలగా కూర్చుని లెక్సింగ్‌టన్ వీధికి బయలుదేరింది. ఆమె టాక్సీ వెనక మరొక టాక్సీ వస్తోంది. ముందు టాక్సీ వేగం తగ్గించినప్పుడల్లా వెనక టాక్సీకూడా వేగం తగ్గిస్తోంది. ఆమె తన బసముందు కారుదిగి, మెట్లెక్కి వీధి తలుపు తాళం తీసింది. ఆ సమయంలో ఆమెకు డజను అడుగుల దూరంలోనే ఇన్‌స్పెక్టరు పార్ ఉన్నాడు. అతడు తన్ను అనుసరిస్తున్నాడని ఆమెకు తెలుసునో, తెలియదో గాని తెలిసిన జాడ ఆమె ఏమీ వ్యక్తం చేయలేదు.

పార్ కొన్ని నిమిషాలు అలాగే వేచి ఉన్నాడు. రోడ్డు అవతలి భాగాన నీడలో నిలిచి థాలియా ఇంటిని కొంతసేపు పరిశీలించాడు. మేడమీది కిటికీలోనుంచి ఆమె గదిలో వెలిగించిన దీపంకాంతి కనబడింది. అప్పుడిక వెనక్కి తిరిగి తను వచ్చిన టాక్సీలోనే ఎక్కబోతున్నాడు. ఇంతలో అతని పక్కన ఎవరో నడిచి వెడుతున్న అలికిడి అయింది. పార్ అతన్ని చూసీ చూడగానే “ఫ్లెన్!” అని పిలిచాడు. ఆ వ్యక్తి గిర్రున వెనక్కి తిరిగాడు. ఇన్‌స్పెక్టరును చూడగానే అతడు ముఖం వెలవేశాడు.

“ఓ-మిస్టర్ పార్! ఇంత రాత్రప్పుడు

ఇక్కడే పొదు—" అని కంగారుపడుతూ అడిగాడు.

"ఫ్లమ్! నీతో కొద్దిగా మాట్లాడాలి. కొంచెం ఇలా నడుద్దామా?"

"నేనేం చేశాను మిస్టర్ పార్! మళ్ళీ నా మీదకేదన్నా కేసు తెచ్చిపెడదామను కుంటున్నారా?" అని ఫ్లమ్ ‍ఖార్కెట్ దగ్గరగా అన్నాడు.

"అబ్బే! అదేం లేదు. పైగా నువ్విప్పుడు బుద్ధిగా ఉంటున్నావుగా? అవ్వాళ జైలు లోంచి వచ్చిన రోజున ప్రమాణం చేశావే బుద్ధిగా ఉంటానని," అన్నాడు పార్.

"అవును, మరేనండి బుద్ధిగానే ఉంటు న్నానండి పనిచేసి నా డబ్బు నేను సంపా దించుకుంటున్నాను. పెళ్ళికూడా చేసుకో బోతున్నాను."

"నిజంగా? ఏమిటీ, చెప్పవేం?" అని పార్ ఆశ్చర్యపడినట్లు నటించాడు. "ఎవర్ని మిలీనా, బెలానా?"

"మిలీనండి," అని ఫ్లమ్, ఇన్‌స్పెక్టరు కింత జ్ఞాపకశక్తి ఉన్నందుకు తిట్టుకుంటూ జవాబిచ్చాడు. "మిలీ ఇప్పుడు బుద్ధిగానే ఉంటోందండి. ఉద్యోగం కూడా చేస్తోంది."

"ప్రబజాన్ బ్యాంక్‌లోగదూ?" అని అడిగి మళ్ళీ, "బుద్ధిగా ఉంటోందా? నిజంగా?" అని పార్ కొంటెగా ప్రశ్నిం చాడు.

"మిలీ చాలా మంచి మనిషండి. దప్పినా పూచీపుల్లయినా ముట్టుకోదండి. ఆమె మంచిది కాదని మాత్రం అనుకోకండి. చాలా మంచిది అసలు మేమిద్దరం ఇప్పుడు చాలా గౌరవంగా బతుకుతున్నామండి."

పార్ గంభీరముఖం చిన్న నవ్వుతో వికసించింది.

"కొత్త కొత్త విషయాలు చాలా వింటు న్నానే ఇవ్వాళ! ఊ, ఇప్పుడు మిలీ ఎక్క డుంటోంది?"

"నతి అవతల ఇళ్ళలో ఎక్కడో ఉంటోంది. ఎందుకూ? మళ్ళీ పాతిగొడవ అంతా తవ్వితీద్దామనా?" అన్నాడు ఫ్లమ్.

"ఛా. అదేం కాదోయ్. ఊరికే ఆమెతో ఒకసారి మాట్లాడాలని ఉంది. బహుశా—" అని మళ్ళీ సంకోచించి "దానికేం తొందర లేదులే. కాని ఇవ్వాళ నువ్వు అదృష్ట వశాత్తు కనిపించావోయ్" అన్నాడు పార్.

అవునన్నట్లు తలవూపాడు కాని ఆ అభి ప్రాయంతో ఫ్లమ్ ఏకీభవించలేదు.

"ఉహూ. సంగతి అదన్నమాట" అని పార్ తనలో అనుకున్నాడు. కాని తన సందేహాలు తనలోనే దాచుకున్నాడు. ఒక అరగంట తర్వాత క్లబ్‌లో డెరిక్ యేల్‌ను కలుసుకున్నప్పుడు కూడా అతడు



"తిలకధారణం"
(చిత్రకారుడు: అ. పైడిరాజు. ఈ చిత్రానికి పంజాబ్ ప్రభుత్వం బహుమతి ఇచ్చింది)

తన అనుమానాలేమీ వ్యక్తం చెయ్యలేదు. అరుణాచలయాన్ని గూర్చి ఇద్దరూ దీర్ఘంగా మాట్లాడుకున్నారు. కాని థాలియా డ్రమండ్ ఆ రాత్రి అజ్ఞాతవ్యక్తిని కలుసుకుని మాట్లాడిన సంగతిని పార్ డెరిక్ యేల్‌తో కూడా చెప్పకుండా దాచాడు.

మర్నాటి ఉదయం ఇన్‌స్పెక్టరూ, డిటెక్టివ్ కలిసి కొంతదూరంలో ఉన్న గ్రామానికి వెళ్ళారు. హంతకుడనే నేరం మీద జైల్లో బంధితుడైవున్న ఆంబ్రోజ్ సిల్లీని కలి శారు. తన తండ్రిని హత్యచేసిన వ్యక్తిని చూడాలనే కుతూహలంతో జాక్ వియత్ మోర్ కూడా వారితో వెళ్ళాడు. కాని ముక్తాయితో ఇన్స్పెక్టరూ, డిటెక్టివ్ మాట్లాడేటప్పుడు మాత్రం అతడు వారికో చోట దూరంగా కూర్చున్నాడు.

సగం స్కాటిష్‌జాతికి, సగం స్వీడిష్ జాతికి చెందిన ఆంబ్రోజ్ సిల్లీ జావితుడు. గడ్డం మాసిఉంది. చదువుకోం, వ్రాయనేం రాదు. ఇదివరకు ఒకసారి పోలీసులచేతిలో పడిఉన్నాడు. అతని వ్రేలిముద్రలనుండి పార్ ఇదంతా గ్రహించగలిగాడు.

మొదట్లో ముక్తాయి నేరం ఒప్పుకోలేదు. డెరిక్ యేల్ చాలా కౌశల్యంతో అనేక ప్రశ్నలు వేసి నిజం చెప్పించాడు.

"అవును. నేనే చేశాను," అని చివరకు ఒప్పుకున్నాడు.

[illegible]

అపరాధ వలయం

ఉత్సాహంగా ఉన్నాడు. ముద్దాయి చెప్పేది అతను షార్ట్‌హాండ్‌లో వ్రాసుకుంటున్నాడు.

"నన్ను మాఫాగా పట్టుకున్నారండి. నేను తాగి ఉన్నాను గనుక పట్టుకోగలిగారు, లేకపోతేనా? ఎలాగూ ఒకటి ఒప్పుకున్నాను గనుక, ఇంకోటి కూడా చెప్పేస్తాను. ఉరితీస్తే ఒకసారే కదా తీస్తారు. హారీ హాబ్స్ అనే నాతోటి నావికుడు ఒకడుండేవాడు. వాణ్ణి చంపేశాను. చంపి ఓడలోంచి నీళ్ళలోకి తోసేశాను. మా ఇద్దరికీ ఒక ఆడదాని విషయంలో దెబ్బలాట వచ్చిందిలెండి. ఆతరవాత, ఇదంతా ఎలా జరిగిందో చెబుతా వినండి. ఒక నెలరోజుల కిందట నా ఓడ తప్పిపోయింది. వాపింగ్‌లో సెయిలర్స్ హోమ్‌లో నేను ఉండిపోవలసి వచ్చింది. అక్కడ తాగి తందనాలాడానని తరిమేశారు. ఏడురోజులు ఖైదులో పెట్టారు కూడా. ఓ నెలరోజులైనా ఖైదు చేసి ఉంటే బాగుండేది. ఖైదు నుంచి విడుదల అయిన తరవాత ఒకరాత్రి తూర్పు లండన్‌లో తిరుగాడుతున్నాను. జేబుల్లో చిల్లిగవ్వలేదు. తాగుడులేక నాలిక పీక్కుపోతోంది. దీనికితోడు పంటినొప్పి ఒకటి—"

పార్ డెరిక్ మేల్ కేసి చూశాడు. మేల్ అస్పష్టంగా నవ్వాడు.

"రోడ్డు పక్కగా నడుస్తూ, సిగరెట్టు పీకలేమన్నా దొరుకుతాయేమోనని చూస్తూ పోతున్నాను. కాస్త తిండి, పడుకోటానికి చోటు దొరికితే చాలుకదా భగవంతుడా అనుకుంటూ పోతున్నాను. మెల్లిగా వానచినుకులు పడటం ప్రారంభించాయి. ఈ రాత్రికూడా ఆరుబయటే గడపాలి కాబోలని భయపడ్డాను. ఇంతలో నా చెవిలో ఎవరో "లోపలికెక్కు" అని ఊదినట్లయింది. చుట్టూ చూశాను. రోడ్డు పక్కన ఒక కారు నిలిచి ఉంది. కారులో మనిషి మళ్ళీ "లోపలికెక్కు, నిన్నే పిలిచేది" అన్నాడు. ఆ వ్యక్తి నా పేరుపెట్టి పిలిచాడు. నాకు ఆశ్చర్యం కలిగింది. కొంత దూరం కారు అలాగే నడిచింది. కారులోని అజ్ఞాతవ్యక్తి బాగా లైటువెలిగే వీధులన్నీ తప్పించుకుని చీకటిగొందుల్లోనే పట్టుకుపోతున్నట్లు గ్రహించాను.

"తరవాత కారు ఆపాడు. నన్ను గురించి అంతా చెప్పటం మొదలెట్టాడు. నా చరిత్ర అంతా వాడికి ఎలాగో తెలిసిపోయింది. హారీ హాబ్స్ హత్యగురించికూడా తెలుసు. నేను ఆ హత్యకేసులో విచారణ చేయబడి విడుదల అయ్యాను. తరవాత అజ్ఞాతవ్యక్తి 'నీకు వంద పౌన్లు ఇస్తాను, కావాలా?" అని అడిగాడు. కావాలన్నాను. అప్పుడతను పక్కనొక ఊళ్ళో ఒక వృద్ధుడున్నాడనీ, అతడు తనకు చాలా అపకారం చేశాడనీ, అతణ్ణి హత్య చేయాలనీ చెప్పాడు. నేనసలు కొంతకాలందాకా ఇలాంటివాటిలో దిగదలుచుకోలేదు. కాని కారులో మనిషి నన్ను పూర్తిగా వాడలగొట్టేశాడు. నన్ను హారీహాబ్స్ కేసులో ఉరితీయించగలనని బెదిరించాడు. అంతకంటె ఈ హత్య చెయ్యడమే క్షేమమని, పారిపోవడానికి ఒక సైకిలు కూడా ఇస్తానని చెప్పి ఒప్పించాడు. ఒప్పుకోక తప్పలేదు.

ఆ తరవాత ఒక వారం రోజులకు నన్ను మళ్ళీ సైన్ స్క్వేర్‌లో కలుసుకున్నాడు. ఈసారి వివరాలన్నీ తెలియజేశాడు. నేను చీకటి పడగానే బియర్డ్‌మోర్ ఎస్టేటుకు వెళ్ళిపోయి, అడవిలో దాక్కున్నాను. ప్రతి ఉదయం బియర్డ్‌మోర్ కొంతదూరం నడిచే అలవాటున్నదనీ, ఆ రాత్రికి నేను అడవిలోనే సుభ్రంగా పడుకోవచ్చనీ అతడు చెప్పాడు. నేనలాగే పడుకున్నాను. కాని అలా ఒక గంటసేపు ఉన్నానో లేదో ఎవరో వస్తున్న అలికిడైంది. అడవి కాపలాదారనుకుంటాను. వాడి ఆకారంమాత్రం క్షణంసేపు కనిపించింది.

"ఆమర్నాడుదయం వృద్ధుడైన జేమ్స్ బియర్డ్‌మోర్ అలా షికారుగా అడవిలోకి రావడం, నేను పేల్చెయ్యడం జరిగిపోయినది. అప్పుడు నేను బాగా తాగివున్నాను. అందుచేత జ్ఞాపకంలేదు ఏం జరిగిందో. అయితే సైకిలెక్కి పారిపోయేందుకు కావలసిన తెలివి మాత్రం వంటిమీద ఉంది. అసలు నేను తప్పించుకునేవాణ్ణేగాని ఈ దెబ్బ తాగుడు మూలంగా పట్టుబడిపోయాను."

హంతకుని వాఙ్మూలం అంతా వ్రాసుకున్న తరవాత, మళ్ళీ చదివి వినిపించి "అంతేనా?" అని పార్ అడిగాడు.

"అంతేనండి" అన్నాడు నావికుడు.

"నిన్ను హత్యకు పురికొల్పినవాడెవరో తెలియదా?"

"అబ్బే. తెలియదు," అని హంతకుడు హుషారుగా అన్నాడు. "కాని ఒకటి చెబుతా వినండి. ఆ మనిషి ఏదో చిత్రమైన మాట, 'నే చెప్పేదీ వినవిద' చాలసార్లు ఉపయోగించాడు. నాకు అంతబాగా చదువురాదుగాని, కొందరు కొందరు ఊత పదాలు వాడటం నే ఎరుగుదును. అలాంటిదే ఏదో ఇతగాడు కూడా వాడాడు."

"ఏమిటది?" పార్ ప్రశ్నించాడు.

"నేను జ్ఞాపకం చేసుకుని చెబుతానండి," అని హంతకుడు ఆలోచించుకోసాగాడు. వాణ్ణి జైలుగదిలో ఒంటరిగా వదిలేసి మిగతా వారు బయటికి వచ్చేశారు.

నాలుగు గంటల తరవాత జైలరు ఖైదీకి ఆహారం తీసుకువెళ్లాడు. ఆంబ్రోజ్ సిబ్లీ తన పక్కమీద పడుకున్నాడు. జైలరు వాణ్ణి భుజంమీద తట్టి లేపాడు. ఎంతసేపు తట్టినా వాడు లేవలేదు:

హంతకుడు చచ్చిపడి ఉన్నాడు.

పక్కన రేకుగ్లాసులో సగం దాకా నీళ్లున్నాయి. మిగతా నీళ్లు దాహంతీర్చుకోడానికి సిబ్లీ తాగాడు. ఆ నీళ్ళలో యాభైమందిని చంపడానికి సరిపడినంత హైడ్రోసయనిక్ ఆసిడ్ కలపబడి ఉంది.

ఇన్‌స్పెక్టర్ పార్ విషాన్ని గూర్చి అంతగా పట్టించుకోలేదు. విషజలంలో తేలుతున్న ఒక కాగితం ముక్క అతన్ని ఆకర్షించింది. ఆ కాగితం ఎర్రనిది; వలయాకృతిగా ఉన్నది. (ఇంకా ఉంది)

న్యూఢిల్లీ లేఖ

(5-వ పేజీ తరువాయి)

యసభల జాయింట్ సెలెక్ట్ కమిటీ పరిశీలనకు నివేదించారు.

మే 14 వ తేదీకల్లా నివేదిక తయారు కావాలని ఆదేశించారు. జాయింట్ సెలెక్ట్ కమిటీ తన కివ్వబడిన పని ముట్టుకోడానికే నిరాకరించినదట. ఈ సంగతి ఇంతవరకూ ఎవ్వరూ ఖండించలేదు గనుక నిజమయ్యే ఉండాలి. ఇలా జరగడం పార్లమెంటు సంస్థల చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ కమిటీ తన కింకా వ్యవధి కావాలని, ఏదన్నా చల్లని పట్నానికి తమను పంపిస్తే పనిచేస్తామని తెలియజేసింది. ఈ చర్యవలన బిల్లులు శాసనం కావడం కనీసం రెండు నెలలైనా వాయిదా పడేట్టు సెలెక్ట్ కమిటీ చేసింది. అందుచేత రాష్ట్ర పునర్నిర్మాణం మహాత్మా గాంధీ జన్మదినమైన అక్టోబరు 2 వ గాక, కనీసం ఒక నెల తర్వాత ప్రారంభం కావచ్చును.

భారత ప్రధాని మాత్రం పట్టిన పట్టు విడవలేదని కొన్ని సూచనలవలన తెలుస్తోంది. మొదట అనుకున్న ప్రకారం ఎన్నికలు జరిగిపోవలసిందేనని ఆయన అభిమతం. మనం ఒకటనుకుంటే శాసనసభ్యులు మరొకటి చేస్తారు. కిందటి ఎన్నికలకు ముందు హిందూ కోడ్ బిల్లు శాసనం కావాలని ప్రధాన మంత్రి భావించారు. ఆ బిల్లులోని కొన్ని భాగాలు మాత్రం వచ్చే ఎన్నికల నాటికి శాసనం అవుతాయని మనం తృప్తిపొందవచ్చు. ★

సిద్ధార్థాన్వేషణం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

"నా చిన్నారి! నా చిట్టీ! లేనాయనా! లే! కాసిని పాలు తాగుదువు గాని లే! అయ్యో! ఇంత పొద్దెక్కినా ఇంకా లేవలేదేమిటి? బాబూ! లే! నా కన్నతండ్రీ!"

అంటూ గోతమి తన చిన్నారి కన్నతండ్రిని ఉయ్యాలలోనుంచి లేవదీసింది. ఆ పసివాడు రాత్రి అంతా నిద్రపోలేదు! ఒకటే ఏడుపు! తెల్లతెల్లవారేదాకా పోరు పెడుతూనే ఉన్నాడు. ఆ పసివాడెందుకు పోరు పెడుతున్నాడో ఆమెకు తెలియలేదు. ఆకలివేసి ఏడుస్తున్నాడేమోనని కొంత బలవంతంగా పాలుపోసింది. దానితో పిల్లవాడి ఏడుపు మరింత రెచ్చిపోయింది. అసలే అజీర్ణ రుగ్మతతో తీసుకుంటూన్న ఆ పసివానికి రాత్రి నాలుగైదుమార్లు పాలుపొయ్యడంవల్ల ఆ రుగ్మత మరింత ఎక్కువై పోయింది. తెల్లవారేసరికి ఒళ్లంతా కాలిపోతున్నట్లుగా జ్వరం కాసింది.

ఆ ఇంటిలో గోతమితప్ప ఇంకెవరులేరు. ఆమె భర్త, మామగారు సార్థవాహ వ్యాపారులు. వారిద్దరు రాజగృహ నగరంలో ఉన్నారు. గోతమి అత్త, కుమార్తెకు పురుడు పొయ్యడానికని వైశాలీనగరం వెళ్లిపోయింది. ఇంట్లో ఒకరిద్దరు పరిచారకులుతప్ప ఇంకెవరులేరు. పెద్దవాళ్లెవరు అంత తొందరగా తిరిగివచ్చే ఆశ ఏమీ లేదు. అందువలన ఆ పసివాని సంరక్షణభారం అంతా గోతమిమీదే పడింది. ఆమె అసలే చిక్కి బక్కపలచగా ఉండడంవల్ల ఇరుగుపొరుగు శ్రావస్తీ నగరవాసు లందరు ఆమెను కృశగోతమి అని పిలిచేవారు. పిల్లవాడికి రాత్రిరాత్రే ముంచుకువచ్చిన జ్వరంవల్ల ఆమె మరింత బెంగపెట్టుకుని చిక్కి శల్యమైపోయింది.

పిమ్మట రెండు మూడు రోజులవరకు ఆ జ్వరం బాగా ఎక్కువైపోయింది. గోతమి కాయకష్టంలా తమ గృహవైద్యునిచేత ఎన్నెన్నో చికిత్సలు చేయించింది. అయినా జ్వర తీవ్రత అలాగే ఎక్కువైపోయింది. అంతేగాని ఏమీ గుణం కనబడలేదు. ఆ వైద్యంతోబాటే ఆమె బాలగ్రహ చికిత్స కూడా చేయించింది. ఎందరెందరో దేవతలకు మొక్కుకొన్నది. రోజుకు నాలుగైదుసార్లు దిష్టితీసి చతుష్పథాలలో భూతబలు లర్పించింది. అయినా అయిదవనాటిరాత్రికి ఆరుగ్మత బాగా ముదిరిపోయింది. ఆ పసివాడింక జీవించడం దుర్లభమనే భయం కూడా బయలుదేరింది. గృహవైద్యుడారాత్రి అంతా నిద్రాహారాలు లేకుండా గోతమి గృహంలోనే కనిపెట్టుకుని కూర్చున్నాడు.

ఒక వ్యక్తిని అత్యంతాప్యాయతతో ప్రేమించేవారికి ఆ వ్యక్తి అనుక్షణము తమ పట్టు విడిపించుకొని దూరదూరంగా వెళ్ళిపోతున్నట్లే భాసించడం సహజం.

గోతమి కిప్పుడు సరిగా అలాగే అనిపించింది. ఆమె కది లేక లేక కలిగిన సంతానం. అందులోను ఆ కలిగినసంతానం మగశిశువనే వార్త వినబడేసరికి శ్రేష్ఠి కుటుంబం అంతా ఉబ్బి తబ్బిబ్బైపోయింది. అంతవరకు గోతమి అంటే ఎంతో ఈసడింపుగా చూచే అత్తగారు కూడా ఆ క్షణంనించీ గోతమి అడుగులకు మడుగులొగ్గడం మొదలు పెట్టింది.

ఆమె కాపరానికి వచ్చిన ఏడెనిమిది ఏళ్ళదాకా సంతానం కలిగే సూచన లేమీ కనిపించలేదు. దానితో మామగారికీ అత్తగారికీ ఇక అంతటితో తమవంశం అంతరించిపోగలదనే భయం పట్టుకుని వేధించడం మొదలు పెట్టింది. వారి కొక కుమారుడు తప్ప వేరే సంతానమేమీ లేకపోవడంవల్ల ఆ భయం మరింత తీవ్రస్వరూపం ధరించింది. వారిద్దరు తమ కుమారుని కిక సంతు కలగదని నిరాశ చేసుకుని తిరిగీ వివాహం చెయ్యాలని కూడా సంకల్పించారు.

అయితే గోతమి కాపరానికి వచ్చిన ఉత్తరక్షణంనించీ శ్రేష్ఠి కుటుంబం పట్టినదంతా బంగారమై మారుమోగింది. కాని ఆమెకు సంతానం కలగకపోవడం మూలాన ఆ ఆనందం అంతా క్రమక్రమంగా మరుమరీచిక గా మారిపోయింది. క్రమక్రమంగా శ్రేష్ఠి కుమారుని ద్వితీయ కళత్ర ప్రయత్నాలన్నీ ఫలోన్ముఖమైనాయి. వృద్ధశ్రేష్ఠి దంపతులిద్దరు కుమారునికి ద్వితీయ వివాహ ప్రధానోత్సవం జరపవలెనని సంకల్పించారు.

అయితే గోతమి మ్రొక్కుకొన్న గృహదేవతల అనుగ్రహంవల్ల ఆ సమయంలోనే ఆమెకు గర్భసూచనలు కనిపించాయి. దానితో తాత్కాలికంగా గోతమికి వచ్చిన ఆ ఆపత్తు కాస్తా గడిచిపోయింది.

కుమారుడు కలిగిన నాడు గోతమి హృదయం ఒక్కసారిగా ఎగిరి గంతేసింది. ఆమె ఆపసికందు నెంతో ఆప్యాయంగా పాలిచ్చి, కనురెప్ప వాల్చకుండా వానివైపు చూచి—"నాయనా! నాకన్నతండ్రీ! నీమూలంగా నే మావారికి నామీద మళ్ళీ ఇంత అనురాగం కలిగింది" అని కంట నీరు పెట్టుకొన్నది. అటుపిమ్మట ఎంతో మురిసిపోతూ పసివాణ్ణి భర్త చేతికందించింది.

ఆక్షణంనించీ ఆకుటుంబంలో వారెవరు ఆపసికందు నిక కింద దింపలేదు. అలాగలాగ కొంతకాలానికి వాడు తప్పటడుగు లిడ వెయ్యడం మొదలుపెట్టాడు. కాని ప్రతి రాత్రీ గోతమికి ఆ పసివాడికేదో జబ్బు చేసినట్లో, హఠాత్తుగా దెబ్బ తగిలినట్లో కలలు వచ్చేవి. ఒక్కొక్కమారు ఆపసిబిడ్డ మరణించినట్లే కలగని, లేచి వలవలా ఏడుస్తూ ఆమరునాడంతా అన్నం ముట్టడమే మానివేసేది!

ఇంట్లోవారంతా అతిగారాబంగా పెంచడంవల్లనైతేనేమి, శాస్త్రీయంగా [illegible]

★ సిద్ధార్థాన్వేషణం ★

పితృవియోగంవల్ల నయితేనేమి, తల్లి పోలిక కావడంవల్ల నయితేనేమి పుట్టినప్పటినుంచీ ఆపసివాడెప్పుడూ అర్భకంగా అతిపేదగానే ఉండేవాడు.

అత్తమామలు, భర్త ఇల్లు విడిచి వెళ్ళేటప్పుడు పసివాణ్ణెంతో భద్రంగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉండవలసిందనీ, తామొక సంవత్సరకాలంలో తిరిగి రాగలమనీ చెప్పి దూర దూర నగరాలకు ప్రయాణమై వెళ్ళిపోయారు. వారు ఇల్లు విడిచి వెళ్ళిన మరునాటినుంచీ పసివానికి రుగ్మత ప్రారంభమైనది. క్రమక్రమంగా అది ప్రాణాంతకంగా పరిణమించింది.

అయితే జ్వరం తగిలిన అయిదవ నాటి రాత్రి గడిచేసరికి పిల్లవానికి కొంచెం సుఖంగా ఉన్నదని అనిపించింది. ఆరవనాడంతా వ్యాధి కొంచెం తగ్గినట్లే కనిపించింది. అయితే ఆనాటిరాత్రి వ్యాధి మళ్ళీ తిరగబెట్టింది. సేవకులు వెంట వెంటనే వైద్యుని ఇంటికిపరుగులు పెట్టారు. వైద్యుడు వచ్చి ఏదో గట్టిచికిత్స చేశాడు. ఇక మరి భయంలేదని చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు. సేవకులుకూడా తెల్లవారగట్టే లేచి తమ కుటీరాలకు మరలిపోయారు. తరవాత పసిబిడ్డ సుఖంగా నిద్రపోతున్నట్లే కనిపించాడు.

తెల్లవారే సమయానికి పిల్లవానిధోరణి చూడడానికి గోతమి హృదయంలో ఏదో పెద్దగుబులు పుట్టుకొచ్చింది. ఆమె అంతకు పూర్వం ఎన్నడూ మరణించినవారి నెవరినీ చూడలేదు. వెంటనే ఆబిడ్డనెంతో భద్రంగా గుండెలకదుముకొని గృహవైద్యుని భవనానికి తీసుకు వెళ్ళిపోయింది.

౨

అప్పుడే అరుణోదయం అయింది. అది ముందు వేసంగి. శ్రావస్తి నగర పౌరులింకా తమ వీథిద్వారాలు తెరవలేదు. గ్రీష్మాధిక్యంవల్ల రాత్రిఅంతా నిద్రపట్టక, తెల్లవారే వేళ చిన్నకునుకు పట్టిన గృహవైద్యుడు గోతమి పిలుపు విని వీథి గుమ్మంలోనికి వచ్చాడు. గోతమి చీర చెరగు కొంచెం తొలగించి పిల్లవాని ముఖం చూపించింది. వైద్యుడొకసారి వాడి పరీక్ష చేసి "అమ్మా! విచారించకు తల్లీ! ఇక ఏమి చేసినా ఏమీ లాభం లేదు! ఇక ఈ క్షణంలో నో మరుక్షణాలలోనో ప్రాణవ్యుత్క్రమణం జరిగిపోతుంది. వెంటనే ఇంటికి తీసుకు పోవడం తప్ప నేను చెయ్యగలిగిందేమీ లేదు!" అన్నాడు.

ఆ పైన గోతమి మరి మాటాడలేదు. వెంటనే వెనుదిరిగి తన ఇంటి కేసి నడిచింది.

గృహవైద్యుని కామె ధోరణి ఎంతో విచిత్రంగా కనబడింది! అంతటి విషాదవార్త వినిపించినా ఆమె ఎక్కడా చెక్కుచెదరలేదు! అలాగే వైద్యుకేసి చూసి పక్కుమని ఒక్క నవ్వు నవ్వింది! గృహవైద్యుడామె కనిపించినంతవరకు అలాగే రెప్ప వాల్చకుండా ఆమె ధోరణి పరకాయించి చూశాడు.

కాని గోతమి అంతటితో ఇంటికి మరలిపోలేదు. మరి ఒక ఘన వైద్యుని దగ్గిరికి వెళ్ళి తన శిశువును రక్షించవలసిందని ఎంతో దీనంగా బతిమాలింది. ఆ వైద్యుడొకమారు శిశువు ముఖం పరికించి "ఇంకేముంది! అంతా అయిపోయింది తల్లీ! ఇంక ఇంటికి తీసుకుపో!" అన్నాడు.

ఆ మాట విని ఆమె గట్టిగా ఒక నవ్వు నవ్వి—"అయ్యో! నా చిట్టితండ్రిముఖం అలాగ కళకళలాడుతూంటే ప్రాణం పోయిందని అనడానికి మీకెలాగ నోరాడిందయ్యా!" అని ఆబిడ్డను తిరిగి భుజాన వేసుకొని తొందరగా మరి ఒక ఓషధీ వైద్యునిదగ్గిరికి వెళ్ళిపోయింది.

అతడు పండు ముదుసలి. ఓషధీవైద్యంలో శ్రావస్తీ నగరం అంతటా ప్రసిద్ధికెక్కినవాడు. అతన్ని చూడగానే గోతమికి తన తండ్రిముఖం జ్ఞాపకం వచ్చింది. జలజల ప్రవహించే కన్నీరు చీర చెరగుతో తుడుచుకొని అతని పాదాలపై పడి "ఎంతమంది ఘన వైద్యులకు చూపించినా నా బిడ్డ ప్రాణం పోయిందనే అంటున్నారు! కాని ఆ ముఖంలో ఎక్కడా జీవకళ తగ్గలేదే! నా చిట్టి తండ్రి నన్ను చూచి ఇంకా అలాగే చిరునవ్వులు చిలకరిస్తూనే ఉన్నాడే! వారికా మాట అనడానికెలా నోరాడిందో తెలియడంలేదు! ఇక నా బిడ్డను కాపాడగలవారు మీరొక్కరే!"

అని అనేక విధాల గా విలపించింది. ఆ వృద్ధుడు మొట్టమొదట కొంతసేపటివరకు అలాగే నిర్ఘాంతపడి నిలుచున్నాడు. అటుపిమ్మట అతని కామె మానసిక పరిస్థితి అంతా అవగాహన అయిపోయింది. ఆ శిశువు మరణించడంతోనే హఠాత్తుగా కలిగిన శోకంవల్ల ఆమె హృదయం వికలమైపోయిందనీ అందువల్లనే ఆమె ఆవిధంగా మాట్లాడుతున్నదనీ గ్రహించివేశాడు. కాని ఆమె దైన్యస్థితికా వృద్ధహృదయం నీరైపోయింది. ఆమె ఎన్నడూ అటువంటి కష్టం తెలిసి ఉండక పోవచ్చునని కనకనే తాత్కాలికంగా ఆమె కీవిధమైన ఉన్మత్త మానసిక స్థితి ఏర్పడి ఉంటుందనుకొన్నాడు. అయితే కారుణికుడిలా ఆమె నోదార్చవలెనని అభిప్రాయంతో మెల్లిదిగా ఇలా అన్నాడు.

"తల్లీ! నేనోషధీ వైద్యంలో పేరుపొందిన వాడనే! కాని ఏమిలాభం! అంతా అయిపోయింది! ఈ చరమదశలో నేనేమి చెయ్యగలను! అయితే ఇలాంటివారిని కూడా పునరుజ్జీవింప జెయ్యగలవారీలోకంలో ఒక్కరే ఉన్నారు! మహా కారుణికుడైన ఆ మహానీయుని చరణపద్మాలాశ్రయించు తల్లీ! ఈ లోకంలో ఆయన ఒక్కడే నీ కోరిక నెరవేర్చగల సర్వసమర్థుడు!"

ఇంతసేపటికి గోతమికి తన శిశువు మరణించిన విషయం యథార్థమే అని తెలిసింది. కాని అటువంటి శిశువును కూడా బ్రతికింపగల సర్వసమర్థు డానగరంలో ఉన్నారనేమాట వినబడేసరి కామె హృదయంలో తిరిగి ఒక మహాజ్యోతి వెలిగింది!

"ఎవరా కారుణికమూర్తి?" అని ఎంతో ఆత్రంగా ప్రశ్నించింది. ఆ ప్రశ్న వెలువడగానే గోతమి చెక్కిళ్ళపై వేడికన్నీటి బిందువులు సంతతధారగా ప్రవహించాయి.

"గౌతమ బుద్ధులు!"

"ఆ మహానీయులు మన నగరానికి వేంచేశారా?"

"నీకింకా తెలియనే తెలియదా?"

"తెలియను! ఎక్కడ విజయం చేశారో?"

"అనాథపిండకుని జేతవనంలో!"

"నిజంగానేనా? బాబూ! ఎప్పుడు?"

"నిన్ననే!"

ఆ మాట వింటూనే గోతమి తన మృత శిశువు నెంతో ఆప్యాయంగా గుండెల కదుముకొని తొందర తొందరగా జేతవనం వైపు నడిచి వెళ్ళిపోయింది.

తన చిన్నతనంలో గోతమి ఒకప్పుడా కరుణామూర్తిని సందర్శించింది. ఇటీవల తిరిగి శ్రావస్తినగరాని కామహానీయుడు విచ్చేయగలడని నగరపౌరులెంతో ఉత్కంఠతో సంభాషించుకొంటున్నారు. ఆయన సమ్యక్సంబుద్ధుడు! అపారకరుణామూర్తి! ఎంత మందిదుఃఖార్తు లా కరుణామయుని కటాక్షపాతంతో తమ దుఃఖసాగరా లవలీలగా ఈదుకుపోలేదు! ఒక్క చిన్న శిశువు పునరుజ్జీవింప జెయ్యడానికా మహామహుని కరుణాకటాక్షలేశం చాలదా? అని ఈ విధమైన భావపరంపర లెన్నెన్నో గోతమి హృదయకుహరంలో పరవళ్లు తొక్కాయి.

అపిమ్మట ఆమె తన దగ్గర శిశువున్న విషయం కూడా ఎవరికీ తెలియనీయకుండా జేతవన మహావిహారంలో ప్రవేశించింది. తొందర తొందరగా ద్వారాలన్నీ దాటి వెళ్ళిపోయింది. ఆ సమయంలో ఆమె హృదయ

యంలో గౌతమబుద్ధ సందర్శనం ఒక్కటే ఏకైకలక్ష్యం!

తొందర తొందరగా సమ్యక్సం బుద్ధుని సమీపాని కెంతో ఉద్విగ్న హృదయంతో నడిచి వెళ్లిపోతున్న ఆ దీన మూర్తి ఎవ్వరా అని కొందరు భిక్షుకీభిక్షుకులొక్క క్షణ కాలం ఆమెవైపు చూచారు. ఉత్తరక్షణంలోనే తిరిగీ తమతమ ధ్యాననిష్ఠలలో మునిగిపోయారు.

జేతవన మహావిహారంలో వటవృక్షచ్ఛాయలింకా తమ పశ్చిమదిశా యాత్రలలాగే సాగిస్తున్నాయి. అప్పుడప్పుడే ఉదయిస్తున్న సూర్యకాంతులు కాషాయవస్త్రాలు ధరించిన శ్రమణక బృందంలా మెరిసిపోతున్నాయి.

బుద్ధదేవుని గృహద్వారంలో నిలబడిన ఆనందు డాదీనురాలి ముఖభంగిమ పరిశీలించి చూచాడు. ఆ చూపులో ఆనందునికేమి అవగాహన అయిందో! అతడామెను లోపలికి పోవద్దని వారించలేదు. లోపలికి పోవచ్చుననీ అనుమతీ ఇవ్వలేదు! అతని నేత్రాల నుంచి కవోష్ణ బాష్పధారలు నిరంతరధారగా ప్రవహించాయి. అంతే! ఒక్క అంగలో గోతమి అపార సమ్యక్సంబుద్ధ శాక్యసింహుని పాదాలమ్రోల వాలిపోయింది.

3

గోతమి బుద్ధదేవునికి పాదాభివందనం ఆచరించిన పిమ్మట క్షణకాలంపాటూ తేజోమూర్తి ముఖంవైపు చూచింది. ఆ క్షణంలో ఆమెకు తనకన్నతల్లి ఒడిలో మేనువాల్చినట్లే అనిపించింది. నిశ్చల కృపాసాగరాలవలె తళతళలాడే అతని నేత్రాలు చూడగానే ఆమెకు తన గోడంతా ఒక్కమారుగా వెళ్లబోసుకోవలెనని అనిపించింది. శ్రావస్తీ నగర పౌరులలో ఆ మహనీయుని దివ్యశక్తులను గూర్చిన వింతవింత గాథలెన్నో వ్యాపించాయి. అంతటి మహనీయునికి తన చిన్నిశువును బ్రతికించడం ఒక లెక్క కాదనీ ఇక తనశిశువు తిరిగి జీవించడం తథ్యమేననీ ఆమె నిశ్చయించింది. ఆ శిశువువల్లనే తనభర్తకు, అత్తమామలకు తనపై గౌరవం ఏర్పడినదనీ, ఆ పసివాడు జీవించకపోతే భర్త, అత్తమామలు తనను విడిచిపెట్టివెయ్యగలరనీ, వాని చిరునవ్వులమీగనే తన ప్రాణం నిలుపుకొంటున్నాననీ ఆ పసిపాప లేనిదే తానిక జీవించజాలననీ వెంటనే ఆపసికందును బ్రతికించవలసిందనీ ఆ దయామూర్తికనేకవిధాలుగా విన్నవించవలెనని అనుకొన్నది. గద్గదికతో వణికిపోతూ బుద్ధదేవుని కేవేవో కొన్నివిషయాలెంతో జాలిగా విన్నవించింది. అంతలో ఆమె హృదయాంతరాళ దుఃఖం అంతా ఒక్కమారుగా ఉప్పెనలా పొంగింది! వెంటనే ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ తిరిగీ అతని పాదాలపై వాలిపోయింది! ఆపైన కొంతసేపటివరకు ఆమెకు స్పృహ తప్పిపోయింది. ఆ చైతన్యరహిత స్థితిలో ఎంతసేపున్నదో ఆమెకు తెలియలేదు. తిరిగీ తెలివివచ్చేసరికి గౌతమబుద్ధుడు చిన్ని చిరునవ్వుతో నిరంతర కరుణాధార వర్షిస్తూ కనురెప్పపాటు లేకుండా ఆమెవైపు తిలకిస్తున్నాడు. ఆ చూపులతో గోతమి హృదయం బాగా సేదదేరింది. ఆమె మృతశిశువు ముఖంవైపు పాకమారుచూచి, చెదిరిన ముంగురులు సరిదిద్ది శిశువును నెమ్మదిగా గౌతమదేవుని పాదాలకు దగ్గరగా పడుకోబెట్టింది. తిరిగీ అతిదీనంగా తన చిన్నిశిశువును బ్రతికించవలసిందని ప్రాధేయపడింది.

నీరవ గభీరసాగరంవలె నిశ్చలమైన సమ్యక్సంబుద్ధుని హృదయంకూడా ఆ దీన మాతృప్రార్థన లాలకించేసరికి మెల్లమెల్లగా కల్లోలితమై కలిగిపోయింది!

“గోతమీ! నీ శిశువు తిరిగీ జీవించగలడు! దానికి నీవేమీ అధైర్యపడ నక్కరలేదు. అయితే గుప్పెడు సిద్ధార్థా లెక్కడనైనా సంపాదించగలవా?” అని గౌతమబుద్ధుడు నిశ్చలంగా ఆమెవైపు చూచాడు.

గోతమి ఈ ప్రశ్న వినగానే నిర్ఘాంతపోయింది. గుప్పెడు తెల్లావాలతో తన శిశువు తిరిగీ జీవించగలడంటే ఆమెకంతగా నమ్మకం కలగలేదు!

“కృపామూర్తీ! గుప్పెడు తెల్లావాలకేమి భాగ్యం! అవసరమైతే వేయిగుప్పెళ్లైనా తీసుకురాగలను!”

“ఒక గుప్పెడు చాలునులే! గోతమీ! అయితే అవి ఇరుగుపొరుగు వారినడిగే సంపాదించాలి! తెలిసిందా!”

“పోనీ అలాగే! ఇరుగు పొరుగువారినడిగే తీసుకువస్తాను!” అని ఆమె బయలుదేరబోయింది.

“అయితే ఒకమాట! ఆ ఇరుగుపొరుగువారి ఇళ్లలో ఇదివరకెన్నడూ సంతాననష్టం కలిగి ఉండకూడదు! ఆ తెల్లావాలు అటువంటివారినే అడిగి సంపాదించాలి! ఇది చాలా ముఖ్యవిషయం. తెలిసిందా?”

“అలాగే! ఈ మహానగరంలో ఆ మాత్రం అదృష్టవంతులే దొరకకపోతారా! తిరిగీ ఒక అరగడియలోనే మీ దర్శనానికి వచ్చి వేస్తాను.”

అని చెప్పి ఆ శిశువు నక్కడే విడిచిపెట్టి గోతమి తొందరగా ఆ మహావిహారందాటి నగరంలోకి వెళ్లిపోయింది. నడుస్తున్నదన్నమాటేగాని ఆమెకు ఒంటిమీదస్పృహ లేదు. త్వరలోనే తన శిశువు జీవించగలడనీ తిరిగీ చిరునవ్వులతో కలకలలాడే తన చిట్టిచంద్రముఖం తిలకించవచ్చుననీ ఆ ముఖంపై తనివితీరా ముద్దులవర్షం కురిపించవచ్చుననీ ఆమె ఎంతైనా సంబరపడింది. అనంతరం భర్తకేగాక, అత్తమామలకుకూడా తనపై గౌరవం ఇంకా ఇనుమడించగలదని ఆమె లోలోపల ఎంతైనా మురిసిపోయింది. మొత్తంమీద శ్రావస్తీనగర రాజవీధులలో నడుస్తున్నంతసేపు ఆమె హృదయం ఆ చిన్ని శిశువును గురించిన పగటికలలతోనే పరవళ్ళుతొక్కింది.

అప్పటికి రెండు యామాలకాలం గడచిపోయింది. ఎండవేడిమి భరించలేక శ్రావస్తీ నగరంలో గృహాలన్నీ కళ్ళు మూసుకొన్నట్లుగా కనిపించాయి

ఆమె ఒకటిరెండు ఇళ్లతలుపులు తట్టి తన ప్రార్థన తెలియజేసింది. వారు తమ గృహాలలో ఇటీవలనే సంతానష్టం జరిగిందని తెలియజేసి మళ్లీ మర్యాదగా తలుపులు వేసుకొన్నారు. కొందరామె వాలకంచూచి మతిభ్రమణం జరిగిందేమోనని మరి సమాధానా లివ్వడమే మానివేశారు. అలాగ ఆ మండుటెండలో ఏడెనిమిది ఇళ్ళలోనికివెళ్ళినా ఎక్కడా ఆమెకా గుప్పెడు తెల్లావాలు

ఆయన ప్రాణం విలువ

ఒక లోభి ఒక రోజున నది ఒడ్డుకు షికారు వెళ్లి, కాలు జారి ప్రవాహంలో పడ్డాడు. ఒక జాలరి వెంటనే నీటిలోకి దూకి, అతి ప్రయాసమీద గట్టు చేర్చాడు. తన ప్రాణం కాపాడినందుకు సంతోషించి, జాలరికో పావలా బహూకరించాడా ధనికుడు.

చుట్టుజేరిన జనం ముక్కున వేలేసుకుని ‘హారా!’. అన్నారు. మళ్లా నీళ్ళలోకి తోసెయ్యాలని కొందరు సలహాయిచ్చారు.

గుంపులో ఓ పెద్దమనిషి వారిని వారించాడు. “అయినా కాపోయినా, ఆయన ప్రాణం విలువెంతో మనకన్న ఆయనకే బాగా తెలుస్తుందిగదా” అన్నాడాయన.

పోతోంది! మరొక ఇంటికి వెళ్ళేసరికి అప్పుడే ఒక మృత శిశువును శ్మశానవాటికకు తీసుకు పోతున్నారు. ఆ శిశువు తల్లి కరుణాక్రందనం ఆలకించేసరికి గోతమి నిలువునా వణికిపోయింది.

ఆ విధంగా ఆ మండుటెండలలో ఆమె ఎన్నెన్నో ఇళ్ళకు వెళ్ళింది. తిరిగీ వెంటనే తిరుగుపడిపోయి తిరిగివచ్చింది.

క్రమంగా మూడు యామాలకాలం గడిచిపోయింది. అప్పటికామె సుమారొక నూరు గృహాలైనా తిరిగింది. ఏ యింటికి వెళ్ళినా జీవించియున్న సంతానంకంటె చనిపోయిన సంతానమే ఎక్కువగా ఉన్నట్లు కనబడింది.

ఆటుపిమ్మట ఆమె మరొక రాజవీథికి వెళ్ళి సుమారింకొక నూరు ఇళ్ళు యిలాగాలించింది. క్రమ క్రమంగా ఆమెకా సిద్ధార్థాన్వేషణం ఫలించగలదనే ఆశ పూర్తిగా సన్నగిల్లిపోయింది. చిట్టచివర మరొక వీథికికూడా వెళ్ళిచూచింది. ఎక్కడవిన్నా సంతానమృతిని గురించిన కరుణగాథలే! పిమ్మట ఆ గాథలువిన్న ఆమెహృదయంలోని విషాదం కొంతవరకు ఉపశమించినట్టయింది. అయినా ఆమె తన శిశువు జీవితం విషయం ఆశ విడిచిపెటలేదు!

అయితే సిద్ధార్థాన్వేషణం విరమించి వెంటనే జేత వనవిహారానికి వచ్చివేసింది.

౪

ఆమె దీనవృత్తాంతం విని అక్కడి భిక్షుకులు అన్నపానాలతోను, ఓదార్పుమాటలతోను ఎంతో ఆప్యాయంగా ఆదరించారు. ఆవిధంగా ఒక గడియసేపు విశ్రమించిన తరవాత తిరిగీ ఆమె బుద్ధదేవుని చరణ సన్నిధికి వెళ్ళిపోయింది.

ఆమె ఆ దివ్యమూర్తి సందర్శించేసరికప్పుడే సూర్యాస్తమయం అయింది. బౌద్ధభిక్షుకులందరు విహారంలో ధ్యాననిష్ఠులై ప్రశాంత మౌనం అవలంబించారు. మరి కొందరు ధీరగంభీర స్వరాలతో బౌద్ధధర్మగాథలు పారాయణం చేస్తున్నారు.

బుద్ధదేవుని సందర్శించగానే గోతమికి తిరిగీ పూర్వ విచారం అంతా స్మరణకు వచ్చింది. మెల్లిగా తన సిద్ధార్థాన్వేషణ గాథ అంతా అతనికి విన్నవించింది.

సమ్యక్సంబుద్ధుడొక చిరునవ్వు నవ్వి,

"అమ్మా! ప్రపంచమే బహుళ దుఃఖమయం! కన్న సంతానంకోసం నీలా విలపించే తల్లులెందరున్నారో నీవే కనుగొన్నావు గదా! మెల్లిగా ఇంటికి వెళ్ళి నీ మనస్సు సమాధాన పరచుకో!" అన్నాడు.

కాని గోతమి కంతమాత్రంచేత సంతృప్తి కలగలేదు! "కొంచెం దయచేసి నా కన్నతండ్రి ఈ మండుటెండలో ఎక్కడికి వెళ్ళిపోయాడో చెప్పండి!" అని అడిగింది. ఆమె చెంపలమీద కన్నీరేకధారగా ప్రవహించింది. ఆమె అతని పాదాలపై వాలిపోయింది.

సమ్యక్సంబుద్ధుడు మెల్లిగా ఆమెతో- "తల్లీ! జీవులు తమ కర్మగతిని బట్టి ఆయా లోకాలకు వెళ్ళిపోతారు. ఆ విషయాలన్నీ నీకెరుక పరచాలనే అనుకుంటున్నాను. తిరిగి ఇంకొకమారిక్కడికి రా!" అన్నాడు.

ఆ మరునాడు గోతమి గౌతముని దగ్గరకు వెళ్ళింది. అలాగే ప్రతిదినం ఆ కరుణానిధి సన్నిధికి వెడుతూండేది. క్రమ క్రమంగా ఆమె మాతృహృదయం సంతాన మృతికి కన్నీరు మున్నీరుగా విలపించే తల్లుల హృదయాల శోకభారాలతో తల్లడిల్లిపోయింది. ఆమె తన ఉపచారవాక్సుధామృత ధారలతో వారివందరినీ ఓదార్చి ఆ ఓదార్పులో కొంత కొంత మనశ్శాంతి పొందింది.

మరికొంత కాలానికామెకు ప్రపంచంలోని ప్రతి ప్రాణీ తన సంతానమే అన్న భావన కలిగించింది. ప్రతి ప్రాణిలోను ఆమెకు తన కుమారుని చిరునవ్వులే స్ఫురించాయి.

ఆకాశంలో కలహంసలతో విహరించే పక్షుల బారులలోను, సంజెవేళ వికసించే నవ్వు తారల తీరులలోను, భిక్షు భిక్షుకీగణంలోను, సమస్త ప్రాణి లోకంలోను, సమస్త వస్తుసముదాయంలోను ఆమెకు తన కుమారుని చిరునవ్వులే స్ఫురించాయి. అపారమైన ఆమె మాతృ హృదయం అనంతాకాశం వలె విశాలమై ప్రపంచం అంతటా చల్లని వెన్నెలవెలుగులు విరజిమ్మింది! విశాల క్షీర సాగరమై అడుగడుగునా అమృతవర్షం వర్షించింది.

క్రమక్రమంగా ఆమె బౌద్ధధర్మం స్వీకరించి బౌద్ధభిక్షుకీరూపంతో జీవరాశికంతటికీ ఒక మహోమాతృమూర్తిగా అవతరించింది.

గోతమి ఆ త్తమాతులేక గోతమి తనుగృహానికి మరలిరాదని నిశ్చయించి కుమారుని తిరిగి ద్వితీయవివాహం చేశారు. తనపూర్వాశ్రమ విషయాలలో కేవలం తటస్థవృత్తి వహించినా ఒకనాటి సంజెవేళ ఆమెకావిషయం కొంచెం కర్ణాకర్ణిగా తెలిసింది. కాని ఆమె ఆవిషయం ఉత్తరక్షణంలో విస్మరించివేసింది!

అంతలోనే క్రమక్రమంగా ఆమెకెదురుగా స్ఫురించే విశాల సౌంధ్య ఓలాకాశంలో అనంత తారకాకుమారుల ఖేలన కల్లోలం చెలరేగింది. అక్షణంలో ఆమె తన ప్రత్యేక వ్యక్తిత్వాస్తిత్వమే విస్మరించి అనంత నిర్వాణానంద సాగరంలో ఓలలాడింది! ★

"కుమారుడు రోజు లనిండి-చి, కనుకన్నది లేదనుకో. ఎల్లుండి తెల్లవారేసరికి ఐదు వేల రూపాయలు ఎలాగో అలా సంపాదించకపోతినా, ఇల్లు వేలం అయిపోతుంది."

"అయ్యో పాపం. అలాగా. వెంటనే నాదగ్గరికి రాకపోయావా?"

"నువ్వు ఆదుకుంటావా? నిజంగా..."

"అబ్బే. డబ్బు సంగతి కాదు. బాగా నిద్రపట్టడానికి నాదగ్గర అద్భుతమైన మందుంది..."



(గత అధ్యాయం తరువాయి)

దుర్గ మనస్సులో మళ్ళీ మరొక సంతోష తరంగం అంతఎత్తున లేచింది. రాణూ వాళ్ళయింట్లో పెళ్ళి దగ్గరపడింది. పెళ్లి నాటిరాత్రి గదిలో తెల్లవార్లూ మేలుకుని కూర్చుని పాటలు వినాలన్న సంబరం అది.

ఆ సంతోషంలో మైదానం ఈ చివరి నుంచి ఆ చివరివరకు పరిగెత్తుదామనిపించింది దుర్గకు. చేతులు రెండూ ఓసారి బార చాచి, గుండ్రంగా తిరుగుతూ కొంతదూరం పరుగెత్తింది. ఎగిరిపోదామని ఉంది తనకు... శరీర మేముంది. తేలికేగా, చేతులు బారలు చాచి గాలిని వెనక్కి తోసుకుంటూ ఎగిరిపో గలిగితే ఎంత బావుండును!

ఏదోవొకటి చప్పుడు చెయ్యాలనే ఉద్దేశ్యంతో, ఎండిన ఆకులమీద ఎత్తెత్తి అడుగులు వేసి, టపటపలాడిస్తూ వెళ్లటం మొదలెట్టింది. ఆకులు పొడిపొడి అయి మట్టిలో కలసిపోతున్నాయి. ఎండిపున్న నేలమీద వానచినుకులు పడితే వచ్చేవాసన కొంత - చేదువాసన కొంత, మిళితమైన క్రొత్త వాసనలతో నిండిపోయిందా మైదానం.

ఎదురుగా అల్లంతదూరంలో 'సోనా డాంగా'కి వెళ్ళే గతుకులరోడ్డుంది. ఓ రెండెడ్లబండి కిరకిరలాడుతూ పోతోందా దారినే. క్రొత్త వెదురుబద్దల వంపులతో గూడుకట్టి, దానిమీద పాతబొంత వేసి, ఎర్ర అంచు గుడ్డ ఒకటి పైనకప్పి ఆ బండిగూడు అందంగా తయారు చేశారు. అందులో ఎవరో వొక అమ్మాయి దిగాలుపడికూర్చుని, పసిదానిలా ఏడుస్తూ వెడుతోంది. ఏ పాలి కాపు కూతురో పుట్టింటినుంచి బహుశా అత్తవారింటికి వెడుతూ ఉండివుంటుంది.

దుర్గ గ్రుడ్లప్పగించి చూడటం మొదలెట్టింది బండికేసి...

పెళ్లియాక అమ్మనీ, నాన్ననీ అక్కాతమ్ములని విడిచిపెట్టి ఎంతదూరం వెళ్లిపోవాల్సి వస్తుందో! అక్కడినుంచి మళ్ళీ ఎప్పుడుపడితే అప్పుడు వాళ్లు రానిస్తారా? తాను యింతవరకెప్పుడూ ఈ సంగతే ఆలోచించలేదు. ఈ తోట, ఈ పూపొదల్నీ, తమ దోర ఆవుని, మెల్లాలోని పనసచెట్టు క్రింది చోటుని — ఇన్నాళ్లనుంచి తాను ఏవి అంటే ప్రాణం ఇస్తోందో వీటినన్నిటినీ, ఈ ఎండుటాకుల వాసనల్ని - ఈ రేవులోవాటి నన్నిటినీ శాశ్వతంగా వదలుకుని వెళ్లిపోవాల్సిందేనా! శాశ్వతంగా, ఆ గూడుబండిలో ఉన్న అమ్మాయి బహుశా ఇలా వెళ్ళిపోవాల్సివచ్చి నందుకే ఏడుస్తూ ఉండిఉంటుంది!

****

అనువాదం:

మద్దిపట్ల సూరి

****

ఆ గతుకులరోడ్డు దాటి, ఓ చవిటిపర్ర కూడా దాటితే ఏరు వస్తుంది.

అవతలి ఒడ్డున ఉన్నవాళ్లు ఏం చేపలు పడుతున్నారో! జెల్లలేమో! వాళ్లు ఈ ఒడ్డుకువస్తే ఓ అర్ధణా జెల్లలు కొనుక్కుని ఇంటికి తీసుకెళ్లాలి. అవి అంటే అపూకమిత యిష్టం.

ఇంటికి వచ్చాక సాయంత్రం దుర్గ చాలాసేపు తన బొమ్మలపెట్టె సర్దుకుంటూ కూర్చుంది. బుషలో చమురుపోసుకుంటూ వాళ్ళమ్మ చాలా కిరసనాయిల్ క్రింద ఒలకపోసింది. ఆ వాసన గుప్పున కొడుతోంది. గాలికూడా కొంచెం వేడిగా ఉన్నట్లుంది. బొమ్మలవీ సర్దుకోవటం ఇంచుమించు పూర్తి అయింది. ఇంతలో అపూ వచ్చి "నువ్వు నా బొమ్మలపెట్టెలో బుల్లి అద్దం కొస్తా లాక్కున్నావా అక్కా?" అని అడిగాడు.

"ఊ - ఆ అద్దం నాది. బల్లక్రింద పడి ఉంటే మొట్టమొదట చూసింది నేను కాదూ? ఫో, నా అద్దం నా పెట్టెలోనే దాచుకుంటా. అదీ కాకపోయినా మగపిల్లలకి అద్దం ఎందుకేమిటి?"

"పోనే, నీదా అద్దం పాపం! ఆ వీధిలో పిన్నిగారింట్లోంచి అమ్మ తీసుకొస్తే, ముందు అమ్మని నేనే కాదూ అడిగి తీసుకుంది! ఆఁ - ఇచ్చెయ్ అక్కా!"

అని వాడు అక్క బొమ్మలపెట్టెదగ్గరకు వచ్చి చతికిలపడి కూర్చుని, అందులో అద్దం వెతకటం మొదలెట్టాడు.

దుర్గ తమ్ముణ్ణి చెంపమీద ఒక్కటేసి, "అల్లరి వెధవ్వి ఎక్కడో! - నేను పెట్టె అంతా చక్కగా సర్దిపెట్టుకుంటే నువ్వు వచ్చి మళ్ళీ అవన్నీ లాగిపారేస్తున్నావా? ఫో, నా పెట్టెలో చెయ్యిపెట్టావంటే ఊరుకోను నేను. ఏమనుకున్నావో; అద్దం నేనివ్వను ఫో" అన్నది.

కాని ఆమాట అనేలోపుగానే అపూ దుర్గ వీపుమీద వచ్చిపడి, జుట్టుపట్టుకు లాగి, గిల్లి, రక్కి, ఉక్కిరిబిక్కిరి చేశాడు. తర్వాత ఇహ గొంతుపెట్టి "నువ్వెందుకు కొట్టాలి నన్ను? నాకు చురుకు తగలేదనుకున్నావా? నాది నాకిచ్చెయ్. అమ్మతో చెప్తా లేకపోతే-అమ్మవారిదగ్గర బరిణెలో లత్తుక దొంగతనంగా ఎత్తుకొచ్చావని—" అన్నాడు.

లత్తుక దొంగతనంమాట ఎత్తేసరికి దుర్గ రెచ్చిపోయింది. తమ్ముణ్ణి చెవిమెలిపెట్టి లాగి, ధన్‌ధన్‌మని గుద్దుతూ— "లత్తుక ఎత్తుకువచ్చానా? నేను ఎత్తుకువచ్చానా? దరిద్రపు కోతివెధవా! నువ్వుమాత్రం అమ్మవారిదగ్గర బరిణెలో డబ్బులెత్తుకవచ్చి దాచుకోలా? చెప్పనా అమ్మతో?" అన్నది.

దెబ్బల చప్పుడు, ఏడుపు విని సర్వజయ పరుగెత్తుకువచ్చింది.

దుర్గ అప్పటికి అపూని చెవి మెలిపెట్టి

జరిగిన కథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరం పెట్టాడు. దుర్గ పుట్టిన చాలవేళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్క నిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీ వింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. ఒకరోజున అపూను బళ్లోవేశారు. చదువుచెప్పడంకంటె, బడిలోనే ఒకపక్కనఉన్న చిల్లర కొట్టుపని చూసుకోవడం, కొట్టుకు వచ్చేపోయేవారితో కబుర్లుచెప్పడమే పంతులుగారికి అలవాటైంది. కొట్లోకివచ్చే గ్రామస్థుల కబుర్లు వింటూ అపూ ఏవో ఆలోచనల్లో తేలిపోతూ ఉండేవాడు. పంతులు ఎప్పుడైనా పాఠంచెప్పినా ఆ మాటలు వాడికి అర్థంఅయ్యేవికావు. అర్థంకాని ఆ శబ్దసముదాయం వెనక వాడికి ఏవో చిత్రవిచిత్రమైన రమణీయలోకాలు, దేశకాలబాధితంకాని ప్రపంచాలు కనిపించేవి. పెద్దవాడైన తరవాత దారికనుక్కుని అక్కడికి వెళ్ళాలని వాడు నిశ్చయించుకున్నాడు. ఆఊరికి కొత్తగా పట్నంనించి నీరేన్ అనే విద్యాధికుడు, ధనాఢ్యుడు వచ్చాడు. అతన్ని చూసి అతడే తనకు భర్తకావాలని దుర్గ కోరుకుంది. తనకోరిక గొంతెమ్మకోరిక అని ఆ పిల్లకు తెలియదు.

★ పథేర్ పాంచాలీ ★

లాగి కిందపారేసింది. చెవి వదిలిపెట్టనేలేదు. అపూకూడా దుర్గ జుట్టుపట్టుకుని ఉన్నాడు, తల పైకి ఎత్తటానికి వీల్లేక గట్టిగా అలాగే పట్టుకునిఉన్నాడింకా.

అపూకెక్కువతగిలాయి దెబ్బలు! వాడు ఏడుస్తూ "చూడు అమ్మా! నా పెట్టెలోంచి అద్దం లాక్కుని తన పెట్టెలో దాచుకుంది. ఇవ్వదుట! పైగా చెంపలు వాచేట్టు కొట్టి—"

దుర్గ ఆ మాటకు అడ్డంవచ్చి, "కాదు అమ్మా! నా బొమ్మలపెట్టె అంతా సర్దిపెట్టుకుంటే, వీడొచ్చిఅవన్నీ—"

సర్వజయవచ్చి కూతుర్ని వీపుమీద ఛట్ ఛట్ రెండు దెబ్బలు వేసి, "దుష్టనాతిదానా! మాట మాట్లాడితే వాడిమీదెందుకు చెయి చేసుకుంటావ్! వాడూ నువ్వూ ఒకటా? ఎంత తేడావుందో తెలుసా? అద్దం!— ఏంచేసుకుంటావ్, నీ బొందమీదేసి కొట్టుకుంటావా? చీటికిమాటికి చిన్నవాణ్ణిచేసి కొట్టబోతావా! ఎందుకొచ్చింది చావు! బొమ్మలపెట్టె!—ఉండు—"

అంటూ మాట పూర్తిచెయ్యకుండానే కూతురు సర్దుకున్న బొమ్మలపెట్టె విసిరి పుచ్చుకుని మెల్లాలోకి గిరవాటేసింది.

"గజేకారికి పనీ పాటూ లేదు. తినటం, ఇంటింటికీ తిరపాదిలా తిరగటం! ఇంటికి వస్తే ఇక బొమ్మలపెట్టె! బొమ్మలపెట్టె! అవన్నీ తీసుకెళ్లి అడవిలో పారేసాను ఇప్పుడే. ఉండు, నీ ఆటలన్నీ ఈ దెబ్బతో—"

దుర్గకి నోటివెంట మాటరాలేదు. బొమ్మల పెట్టె అంటే పంచప్రాణాలూ ఆ పిల్లకి! రోజులోపల పదిసార్లయినా అందులో వాటిని తీస్తూ ఉంటుంది. సర్దుతూ ఉంటుంది. బొమ్మలు, సినారేకు బిళ్ళలు, అద్దకపు గుడ్డలు, లక్క, ఎంతో కష్టపడి సంపాయించిన గానుగకాయలు, చుట్టూ రేకుమడిచిన అద్దం - అన్నీ చీకట్లో మెల్లాలో ఎక్కడపడిపోయి పడ్డాయో! తన బొమ్మలపెట్టెను అమ్మ ఇంత నిర్దాక్షిణ్యంగా విసిరిపుచ్చుకు పారేస్తుందని కల్లోకూడా అనుకోలేదు తాను. ఎంత కష్టపడి యిన్ని చోట్లనుంచి తెచ్చుకుంటే అమిరాయి అవన్నీ!


ఏంమాట్లాడటానికీ ధైర్యం చాలక గ్రుడ్లప్పగించి అలాగే చూస్తూ ఊరుకుంది.

అంత శాస్తిచెయ్యటం అపూక్కూడా కష్టంగానే తోచింది. వాడింక ఏమీ మాట్లాడకుండా, మెదలకుండా పోయి పడుకున్నాడు.

రాత్రి చాలా ప్రొద్దుపోయింది. క్రింద నేల కిర్సనాయిల్ కంపు కొడుతోంది. ప్రక్కనున్న వెదురుచెట్లలోంచి వచ్చిన దోమల సంగీతం ఎక్కువగా ఉంది గదిలో. దుర్గ కూర్చుని కూర్చుని పోయి పడుకుంది.

తలుపులూడిపోయిన కిటికీలోంచి ఫాల్గుణ మాసపు వెన్నెల పక్కమీద పడుతోంది. ప్రక్కన పాడుబడ్డ నివేశనంలోంచి వేప పూతివాసన గుప్పున కొడుతోంది. లేచి వెళ్ళి పారేసిన బొమ్మలపెట్టె, అందులో సామానులు ఏరుకుని తెచ్చుకుందామా అనిపించింది ఒకసారి దుర్గకు. తెల్లవారాక అన్నీ అక్కడ ఉంటాయా మళ్ళీ. ఎంత కష్టపడి సంపాయించుకున్నవి! కాని ధైర్యం చాలేదు. తెచ్చుకోటానికని వెడితే అమ్మ మళ్ళీ కొడితే!

చాలాసేపు గడిచిపోయింది. చటుక్కున ఎవరో తనఒంటిమీద చెయ్యివేసినట్టయింది. అపూ భయభయంతో 'అక్కా' అని పిలిచాడు. దుర్గ ఇంకా ఏం మాట్లాడకముందే అపూ దిండులో తలదూర్చుకుని వెక్కి వెక్కి కుళ్ళటం మొదలెట్టాడు. "ఇంక నేను ఎప్పుడూ చెయ్యను. నామీద కోపం



దాగుడుమూతలు

ఫోటో : వి. గోపాలకృష్ణన్—మద్రాసు

పెట్టుకోకు అక్కా! నీ కాళ్ళమీద పడ తాను" అంటూంటే ఎక్కిళ్లొచ్చి, గొంతు పూడుకుపోయింది వాడికి.

దుర్గ మొదట్లో విస్తుపోయింది. తర్వాత లేచికూర్చుని తమ్ముడి ఏడుపు మాన్పించ టానికి ప్రయత్నించింది–"ఏడవకు, ఊరుకో. అమ్మకి కనుక వినపడిందంటే మళ్ళీ వచ్చి తిడుతుంది. సరే, నేనేం కోపం పెట్టుకోనులే. ఊరుకో, ఛా, ఊరుకోరా–"

అపూ ఏడుపు విని అమ్మ లేచివచ్చి మళ్ళీ తననే కొడుతుందేమో అని భయం వేయసాగిందా పిల్లకి.

చివరి కతిప్రయత్నంమీద ఎలాగయితే నేం, తమ్ముడి ఏడుపు మాన్పించింది. తర్వాత పడుకుని వాడికి ఇహ ఆకథలూ ఈ కథలూ–ముఖ్యంగా రాణూదీదీ పెళ్ళికబుర్లు చెప్పటం మొదలెట్టింది. ఆమాటలన్నీ అయాక అపూ అక్క ఒంటిమీద చెయ్యి వేసి, రహస్యంగా "నీకోమాట చెప్పనా అక్కా! నీకూ మాష్టారికీ పెళ్లవుతుంది–" అని చెప్పాడు.

దుర్గకు సిగ్గేసింది. సిగుతోపాటు కుతూహలమూ కలిగింది. కాని తమ్ముడిదగ్గిర ఈ సంగతులేవీ నా చెప్పటానికి సంకోచం తల యెత్తటంతో గమ్మున ఊరుకుంది.

"సాయంత్రం పిన్ని రాణూవాళ్ల అమ్మతో చెప్పింది. మాష్టారికి ఇష్టమేట అక్కా!" అన్నాడు అపూ మళ్లీ.

కుతూహలాన్ని అణచుకుని ఊరుకుని ఉండటం కష్టమైంది. "అఁ చెప్పిందిలే; పోదూ! నీ మాటలు మరీను!," అన్నది తానేమీ పట్టించుకోవటం లేదన్నట్లు.

అపూ చివాల్న లేచి కూర్చుని, "నిజం చెపుతున్నాను అక్కా! నీ మీద ఒట్టూ ఇంకా: నేను అక్కడే నుంచుని ఉన్నా. నన్ను చూడటంవల్లనే ఈ మాట వచ్చిందసలు. మాష్టరుగారినాన్న ఎక్కడున్నారో అక్కడికి నాన్న చేత ఉత్తరం రాయిస్తారుట—" అన్నాడు.

"అమ్మ ఎరుగునా?"

"నేనువచ్చి అమ్మను అడుగుదామనుకున్నాను—కాని మరిచిపోయాను. అడగనా అక్కా? అమ్మ వినలేదనుకుంటా. రేపు అమ్మను పిలిచి చెపుతానన్నది పిన్ని..."


తర్వాత మళ్ళీ—"నువ్వు ఎన్ని రైళ్లు ఎక్కుతావో చూడు మరి! మాష్టారుండే ఊరు ఇక్కడికి చాలాదూరం. రైలుమీద వెళ్లాల్సిందే—" అన్నాడు.

దుర్గ మెదలకుండా ఊరుకుంది.

దుర్గ రైలుబొమ్మ చూసింది. అపూ పుస్తకాల్లో ఒక దాంట్లో ఉంది. పొడుగ్గా ఉంటుంది. చాలా చక్రాలుంటాయి. ముందర వైపున ఇంజను ఉంటుంది. అందులో నిప్పు వేస్తారు. పొగ వస్తుంది. రైలు బండంటే అంతా ఇనుముతో చేసిందే. చక్రాలుకూడా ఇనపవే — ఎడ్ల బండికిలాగా కొయ్యచక్రాలు కావు. రైలు రోడ్డు ప్రక్కన ఎక్కడా పూరిళ్లు ఉండవు. ఉండటానికి వీలేదు, తగలడిపోతాయి. రైలు నడుస్తూంటే దాని గొట్టంలోంచి నిప్పురవ్వలు లేస్తూ ఉంటాయిగా మరి! దుర్గ తమ్ముడ్ని చేత్తో గువ్వుతూ "నిన్ను కూడా నాతో తీసుకువెళతానులేరా!" అన్నది. తర్వాత ఇద్దరూ మెదలకుండా నిద్రపోవటానికి ప్రయత్నించారు. నిద్ర పోదామనుకుంటూంటే దుర్గకి ఒక సంగతి మాటిమాటికీ గుర్తుకు రాసాగింది—పక్షి దేముడు సుదర్శనుడు తన ప్రార్థన ఆలకించాడు. ఇవాళేగా సుదర్శనుని సన్నిధిని తాను—భగవంతునికి చాలా దయ. అమ్మ చెప్పినది నిజమే.

"రాణూదీకి ఎంచక్కని చీర కొన్నారనుకున్నావ్? ఇవాళ వాళ్ల బాబాయ్ రాణూ పెళ్ళికని రాణాఘాట్ నుంచి కొనుక్కుని వచ్చాడు. 'బాలూచర్' పట్టుచీరట అది!" అన్నాడు అపూ.

"దానిమీద అత్తయ్య ఓ పద్యం పాడేది, గుర్తుందిరా?" అన్నది దుర్గ నవ్వు ముఖంతో...



అపూ ఈ సంగతి ఇంకా ఎవ్వరికీ— ఆఖరికి వాళ్ల అక్కకికూడా చెప్పలేదు. ఆ రోజున మధ్యాహ్నం వాళ్లనాన్న పుస్తకాల పెట్టెని ఎవరూ లేకుండా చూసి, చాటుగా తెరిచి చూశాడు. అందులో ఓ పుస్తకంలో ఈ అద్భుతవిషయం కంట పడింది.

మెల్లాలో వెదురుచెట్ల నీడలు అప్పటికి తూర్పుపడమరలుగా – వ్యాపించి లేవు. మధ్యాహ్నమప్పుడు నిర్జనంగా ఉండేసోనాడాంగా మైదానంలోని ఆ తరతరాలనాటి రావిచెట్టునీడమాదిరిగా – సరిగ్గా ఆ చెట్ల క్రిందవరకు మాత్రమే నీడలు కుదించుకున్నాయి.

ఆరోజున మధ్యాహ్నం వాళ్లనాన్న ఇంట్లో లేకపోవటం కనిపెట్టి, గదితలుపులు బిడాయించి చాటుగా ఆ పుస్తకాలపెట్టె తెరిచాడు. అతి ఆత్రంగా ఆ పుస్తకాలు ఈ పుస్తకాలూ తీసి, వేటిలో మంచి మంచి బొమ్మలున్నాయో వేటిలో మంచి కథలున్నాయో చూడటం మొదలెట్టాడు. ఓ పుస్తకంఅట్ట తీసిచూస్తే 'సర్వదర్శన సంగ్రహం' అని రాసివుంది దానిపేరు. అంటే అర్థం ఏమిటో, ఆ పుస్తకంలో యేం విషయాలుంటాయో వాడికేమీ అంతుపట్టలేదు. పుస్తకం తెరవగానే కాగితాల్ని కొట్టే పురుగులు నిశ్శబ్దంగా బైండుమీదికి ప్రాకివచ్చి, అక్కడ ఇహ ఒక్కక్షణం అయినా ఆగకుండా పారిపోయాయి. అపూ ఆ పుస్తకాన్ని ముక్కుదగ్గిర పెట్టుకొని వాసనచూశాడు. భలే పాతవాసన! మటి రంగుకి తిరిగిన ఆ పాతకాగితాల ఇలాంటి వాసనంటే వాడికి మహాయిష్టం. ఆ వాసనలు తండ్రిమాటే గుర్తుకు తెస్తాయి. అలాంటి వాసన లెప్పుడు వేసినా ఎంచేతో మరి తన తండ్రి సంగతి గుర్తొస్తుంది వాడికి.

ఆ– మరి పాత క్యాలికో బైండు అక్కడక్కడ చిరిగి పైకిలేచివుంది. ఈ పాత పుస్తకం అంటేనే వాడికి ఎక్కడలేని వ్యామోహమూను. అందుకనే ఆ పుస్తకాన్ని తలగడాక్రింద దాచి, మిగిలిన పుస్తకాలు మళ్ళీ పెట్టెలో పెట్టి మూత వేసేశాడు.

రోజూ చాటుగా చదువుతూ, ఓనాడందులో ఓ అద్భుతమైనవిషయాన్ని చదివాడు, హఠాత్తుగా వింటే ఎవరైనా ఆశ్చర్యపడక మానరు. కాని అప్పుస్తకంలో స్పష్టంగా రాసి ఉన్నదది, తాను స్వయంగా చదివాడు. పాదరసంలోని గుణాల్ని గురించి శాస్త్రా ఆరచయిత 'రాబందు గ్రుడ్డుని పాదరసంతో నింపి, దాన్ని కొన్నాళ్లు ఎండలో ఉంచాలి. తర్వాత ఆ గ్రుడ్డుతీసి నోటితో

టుకుని, కొండాలనుకుంటే ఆకాశానికి ఆకాశంలో ఎగిరిపోయే శక్తి వస్తుంది' అని రాశాడు.

అప్పూ తన కళ్ళను తాను నమ్మలేకపోయాడు; మళ్ళీ మళ్ళీ చదివిచూచాడు. తర్వాత ఆ పుస్తకాన్ని తన మూతఊడిపోయిన పెట్టెలో దాచి, బయటకివెళ్ళి ఆ సంగతే ఆలోచించుకుంటూ ఆశ్చర్యపోసాగాడు.

"రాబందుల గూళ్లు ఎక్కడ కట్టుకుంటాయో తెలుసా అక్కా?" అని అడిగాడు దుర్గని.

వాళ్ల అక్క చెప్పలేకపోయింది. ఆ వీధిలో ఉన్న పిల్లల్ని సతూ, నీలూ, కినూ, పటల్-అందర్నీ అడిగాడు. "ఇక్కడెక్కడా కాదు, ఉత్తరపువైపు మైదానంలో బాగా ఎత్తుగావున్న చెట్లకొమ్మల చివర కట్టుకుంటాయి". అన్నారెవరో. "ఈ మిట్టమధ్యాహ్నంవేళ ఎక్కడికిరా తిరగటానికి బయలుదేరుతున్నావ్!" అని కేక వేసింది వాళ్ల అమ్మ. అప్పూ ఇంట్లోకివచ్చి పడుకున్నట్లు నటించి, పుస్తకంతీసి మళ్ళీ ఆ విషయాన్ని ఇంకోసారి చదివాడు. ఆశ్చర్యం! ఇంత తేలికైన ఎగిరే ఉపాయం ఎవరికీ తెలియకుండా ఉంటుందా? బహుశా ఈ పుస్తకం ఇంకెవరింట్లోనూ ఉండి ఉండదు. నాన్నదగ్గిర మాత్రమే ఉండి ఉంటుంది. ఈ విషయాన్నికూడా బహుశా ఎవరూ చదివి ఉండరు. ఇన్నాళ్లకి తన ఒక్కడికంటే పడివుంటుంది.

పుస్తకంలో తలపెట్టి మళ్ళీ మరోసారి వాసనచూశాడు. అదే పాతవాసన ఈ పుస్తకంలో రాసివున్న విషయం నిజమూ కాదా అన్న విషయంలో వాడికేమాత్రం అపనమ్మకం అన్నమాట లేదు.

పాదరసంకోసం బెంగ అక్కరేదు-పాదరసం అంటే ఎలా ఉంటుందో తెలుసు తనకి. అద్దాలకు వెనకవైపున పూసిఉంటుంది. పగిలిపోయిన అద్దం ఒకటి ఉండాలి ఇంట్లో. అది ఎక్కడుందో వెతికితే సరి! కాని రాబందుగుడ్డే ఎక్కడ దొరుకుతుందా అని!

మధ్యాహ్నం భోజనాలవీ అయాక అక్క ఒకొక్కరోజున — "ఇలా రారా, అప్పూ! నీకు భలే తమాషా చూపిస్తా" అని పిలుస్తూ ఉంటుంది. తర్వాత గుప్పెడు అన్నం ఆకులో పెట్టుకుని, దొడ్డిగుమ్మం దగ్గర వెదుళ్లతోపు దగ్గిరకువచ్చి-"భోలా! దా, దా. జూ జూ జూ!" అని పిలిచి గుర్రతమ్ముడికేసి నవ్వుముఖంతో — ఏదో రహస్యనగరద్వారం తెరుచుకోబోతున్నట్లు చూస్తూ ఊరుకుంటుంది. హఠాత్తుగా ఎక్కడినుంచో కుక్క పరుగెత్తుకువచ్చేసరికి, దుర్గ చెయ్యి ఎత్తి "అదుగో వస్తోంది చూశావా? ఎక్కడి నుంచి వస్తుందో తెలుసా!" అంటూ ఆనందంతో హిహిహీ అంటూ నవ్వుతుంది.

రోజురోజూ ఇలా కుక్కకు అన్నం వెయ్యటం దుర్గకు ఎంత సంతోషమో చెప్పలేం! నువ్వు పిలిచి చూడు, చుట్టుప్రక్క లెక్కడా ఉండనే ఉండదు. అంతా గప్‌చుప్‌గా ఉంటుంది. ఆ అన్నం క్రిందపెట్టి దుర్గ కళ్ళుమూసుకుంటుంది. ఆశా-కుతూహలాలతో ఆ అమ్మాయి గుండెలు గుబగుబలాడుతాయి - 'ఇవాళ భోలా రాదేమో ఒకవేళ. ఎక్కడినుంచి వస్తుందో చూస్తా అయినా. ఇవాళ పిలుపు వినబడి ఉంటుందా?'-అనుకుంటుంది.

హఠాత్తుగా వెదురుపొదల్లోంచి ఏ గుబురులోనుంచో చప్పుడు విన్పిస్తుంది.

రెప్పపాటులో ఆ అడవితీగెలూ మొక్కలూ త్రెంపుకుంటూ, త్రొక్కుకుంటూ రోజుకుంటూ ఆఘమేఘాలమీద పరుగెత్తుకు వస్తుంది భోలా.

దుర్గకి చటుక్కున ఒళ్లు ఝల్లుమనేది. కౌతుకాశ్చర్యాలతో ఆ అమ్మాయి కళ్లూ, ముఖం కళకళలాడిపోయేవి. 'సరీగ్గా వింటుందల్లే ఉందే. ఎక్కడనుంచి వస్తుందో! సరే, రేపు ఇంకా మెల్లిగా పిలిచి చూస్తాను. అది కూడా వింటుందేమో అయినా'-అనుకునేది తనలో తాను.

ఈ ఆనందానుభూతికోసం రోజూ తల్లి చేత తిట్లు తినవలసివచ్చినా, తాను తినే అన్నంలోనే కొంత మిగిల్చి కుక్కకో పెట్టేది.

అక్కకి-కుక్కనలా పిలవటం ... ఆనంద మేమిటో అప్పూ కంతుపట్టలే... అక్కకిలాగా అలాంటి ఆడపిల్లలాట... తనకి బాగుండవు. ఆ కుక్క అబకొద్దీ ... గబా ఆ అన్నం తినటంకేసి కూడా చూ... వాడు కాడు. రాబందుగుడ్డు సంగతే ఆ... చిస్తూ ఉండేవాడు.

చివరికి అంతు చిక్కింది. మం... హారూ పనస చెట్లక్రింద గొడ్లను విడి... గొల్లపిల్లలు ఎవరి యిళ్లకైనా ఓ పాగా... పాయ అడిగి తెచ్చుకోటానికి బయలుదే... తూంటారు. అప్పూ వాళ్లలో తమ వీ... కుర్రాడి దగ్గిరకు వెళ్లి "మీరు ఎన్నో... పొలాల వెంట, పొలిమేరల వెంట తిరుగుత... ఉంటారుకదా! రాబందుల గూళ్లు ఎక్క... డైనా కన్పించాయ్? నాకో రాబందుగు... తెచ్చిపెట్టావంటే అర్ధణా ఇస్తాను నేన... అని అడిగాడు.

నాలుగు రోజులు పోయాక ఆ గొ... కుర్రాడు వాళ్ల యింటికి వచ్చి అప్పూ... బయటకి పిలిచి, బొడ్డునున్న సంచిలోం... రెండు చిన్న చిన్న నల్లటిగుడ్లు తీ... 'ఇవిగో తెచ్చాను చూడు' అని చూపి... చాడు. అప్పూ ఆనందం పట్టలేక "ప... చూడనియ్" అంటూ వాటికి చెయ్యి... చాచాడు. తర్వాత ఉత్సాహం... ఉక్కిరిబిక్కిరవుతూ - "రాబందుగుడ్లే...

"…జంగా?" అని అడిగాడు. ఆ గొల్లవాడు అప్పుడని చాలా పెద్దప్రమాణాలు చూపాడు. 'ఇవి రాబందుగ్రుడ్లు అవునా కాదా అన్న సందేహమే అక్కర్లేదు. నేను ఏమయినాసరే అని తెగించి, ఓ పెద్ద చెట్టు చిటారుకొమ్మకెక్కి అక్కడినుంచి తీసుకొచ్చాను వీటిని. రెండణాలకు తక్కువ కయితే మాత్రం ఇవ్వను" అన్నాడు.

వాడడిగిన డబ్బుమాట వినేసరికి అప్పూ కళ్లు చీకట్లుక్రమ్మాయి. అర్ధణాడబ్బు లిస్తాను. ఇంకా కావాలంటే నాదగ్గిరున్న గవ్వలన్నీ ఇస్తాను. పెట్టెడు గవ్వలు, అన్నీ ఇచ్చేస్తాను. ఇంతంత పెద్దపెద్ద బంగారం చారలున్న గవ్వలు. చూస్తావా? చూపించనా?" అన్నాడు.

ఆ కుర్రాడు ప్రపంచజ్ఞానంలో అప్పూకంటె ఎక్కువ మెలకువ కలవాడని తోస్తుంది. డబ్బులు తప్ప, వాటికి బదులు ఇంకేమి ఇస్తానన్నా ఒప్పుకోలేదువాడు. చాలాసేపు బేరం చెయ్యగా చెయ్యగా అణావరకు మాత్రం దిగాడు. అప్పూ వాళ్ళ అక్కను అడిగి, మారాంచేసి ఇంకో అర్ధణా తీసుకుని, ఆ కుర్రాడికి పూర్తిగా అణా ఇచ్చేసి ఆ గ్రుడ్లు రెండూ తీసుకున్నాడు. అణా కాకుండా వాడింకా కొన్ని గవ్వలు కూడా పుచ్చుకున్నాడు. ఆ గవ్వలు వాడికి ప్రాణంతో సమానం, మరొకప్పుడయితే, అర్ధరాజ్యం ఇచ్చి రాజకుమార్తెను కట్టబెడతాం ఇవ్వమన్నా ఆ గవ్వలిచ్చేవాడు కాడు. కాని ఆకాశంలో ఎగిరే ఆనందం ముందు, గవ్వలతోటి ఆట ఆనందం ఏపాటిది!

ఆ గ్రుడ్లు చేతికి వచ్చేసరికి వాడి మనస్సు గాలి కొట్టిన బంతిలాగా ఉబ్బి పోయింది. దానితోపాటు ఓ సందేహంకూడా మనసులో ఏ మూలనుంచో బయలుదేరింది. అది ఇప్పటివరకూ తేలనేలేదు. ఆ గ్రుడ్లు చేతికి వచ్చేసరికి అది ఎక్కడినుంచి వచ్చిందో కలగా బయలుదేరింది. సాయంత్రం అవబోతూండగా ఒక్కడూ సాతానివాళ్ళ మొండి జామచెట్టుమీద కూర్చుని ఆలోచనలో పడ్డాడు—నిజంగా ఎగిరిపోవచ్చునన్నమాటేగా: కాని ఎగిరి ఎక్కడికి పోవటం! మామయ్యగారి ఊరికా? నాన్న వెళ్లిన చోటుకా? ఏటి అవతలిఒడ్డుకా? పైనా, గోరువంకల్లాగా మబ్బుల్లో నక్షత్రాలుండే చోటుకా?

ఆ రోజునో, మర్నాడో! చీకటిపడబోయే ముందు దుర్గ వత్తికోసమని పాతగుడ్డ ముక్కకై వెతుకుతోంది. వాటిసందున, వాటిసందున క్రుక్కిన పాతగుడ్డపేలికల కోసం చెయ్యిపెట్టి తడుముతూంటే, చెయి తగిలి వెనకాల ఏదో టప్‌మని పైనుంచి కింద పడింది. ఇల్లాంతా చీకటి, సరిగ్గా కన్పించటంలేదు. దుర్గ వాటిని బయటికి తీసుకువచ్చి, "అమ్మో! ఇవేంగ్రుడ్లో యిక్కడికెలావచ్చిపడ్డాయి? క్రిందపడి నుగ్గునుగ్గయినాయి. ఏదోపక్షి ఇంట్లోకి గ్రుడ్లు తెచ్చి పడేసింది చూశావా అమ్మా?" అన్నది.

తర్వాత జరిగిన రగడసంగతి యెత్తకుండా ఉండటమే మంచిది. అప్పూ ఆ రోజల్లా అన్నం తినలేదు...ఇహ ఆ ఏడుపులు, పెడబొబ్బలు-ఇల్లంతా ఓ కొలిక్కి తీసుకువచ్చాడు. వాళ్లమ్మ రేవులో కన్పించిన వారికల్లా ఊః చెప్పటం మొదలెట్టింది. "ఇలాంటిది ఎక్కడా ఎన్నడూ విని ఎరుగము-విన్నావా వదినా! రాబందుగ్రుడ్లతో మనుషులు ఎగిరిపోవచ్చుట. అదుగో ఆ గొల్లవాళ్లబ్బాయి ఉన్నాడే వాడొట్టి టక్కరి. వాడెక్కడినుంచో రెండు కాకిగ్రుడ్లు తీసుకువచ్చి రాబందుగుడ్లని చెప్పాట్ట. వాటి క్రింద నాలుగుకాసులు తీసుకున్నాట్ట మా నాగన్న దగ్గిర! మా వాడెంత వెర్రిబాగుల వాడో ఏంచెప్పను వదినా! వీడ్ని పెట్టుకుని ఏంచేతునమ్మా నేను."

కాని పాపం సర్వజయ ఎలా తెలుసుకోగలదు? అందరూ 'సర్వదర్శన సంగ్రహం' ఏమన్నా చదివినవాళ్లా, పాదరసం గుణగణాలు అకళించుకున్నవాళ్ళా?

అలా అయితే అందరూ ఆకాశంలో ఎగరగలిగేవాళ్ళేగా! (ఇంకా ఉంది)

అసలు సంగతి

"డాక్టరుగారూ! మావారికి నిద్రలో కలవరింతలు మహా ఎక్కువ అయిపోతున్నాయండీ."

"అలాగా. మందిస్తా పట్టుకెళ్ళండి. ఇట్టె తగ్గిపోతాయి"

"అబ్బెబ్బె. తగ్గడానికి ఇవ్వకండి.....అవేవో కాస్త స్పష్టంగా తెలిసేలా, కలవరించడానికి ఏదైనా మందుంటే చూడండి"

సెరిబ్రల్ సినేమియా

"స్ప్లిట్ స్క్రీన్ షాట్ అన్నాడండి. విచ్చు రూపాయట మసక వెన్నెట్లో రోడ్డుమీద మెరిసిందట. తల కుడికీ ఎడమకీ 'పాన్' చేశాడట. లాంగ్ షాట్‌లో స్తబ్ధంగా ఉన్న ప్రకృతి వణికే చేతుల్తో ముందుకు వంగాడట...". అన్నాడు శంకరం.

అభివర్ణన వింటున్న ఇంటాయన విశ్వనాథంగారు విరగబడి నవ్వాడు. "వణికే చేతుల్తో వంగడం ఏమిటోయ్" అన్నాడు.

"మీ రిలా హేళన చెయ్యడం భావ్యం కాదండి. జ్వరంతో ఉన్నాడు కాబట్టి, మీకు వైద్యం తెలుసు కాబట్టి మందేమన్నా ఇస్తారని మీకు మనవి చేశాను" అన్నాడు శంకరం తాపీగా.


"పాయింటే అనుకో కాని, నాకూ మనసు బాధగా ఉంది. అద్దె మన్నా ఇస్తాడేమోనని చాలా రోజుల్నించి చూస్తున్నాను."

"ఇప్పుడు అద్దె అడిగితే ఏం చెప్పనండి. అతనికి ఒంటిమీద స్పృహ లేదాయె. అలా కలవరిస్తున్నాడాయె.

"అది కూడా పాయింటే. అయినా మందివ్వడానికి, బోర్డు కట్టినా నేను వైద్యం చెయ్యటం లేదండి. అయినా కాపోయినా సెరిబ్రల్ సినేమియాకి మందులేదు. ఈ కేసులు నాకేం కొత్తకాదు. ఈ గదిలో అద్దెకున్న 'సినీమానియా'లలో ఇతను నాలుగోవాడు. రేపు జ్వరం తగ్గగానే గది కాళీచేసి వెళ్లమనండి. అద్దె కట్టక్కర్లేదు" అంటూ విశ్వనాథంగారు లోపలికి వెళ్లిపోయాడు.

"ఏమండోయ్ మాట." అన్నాడు శంకరం.

"ఏమండి?"



"ఇతను మీయింట్లో ఎన్నాళ్ళనించి అద్దెకుంటున్నాడు?"

"నాలుగునెలలు. రెండ్నెల్ల అద్దె బకాయి."

"మీకన్నీ పాయింటే అయితే ఇంకో పాయింటుకూడా వినండి. ఇతను నాకు మావయ్యకొడుకేమీ కాడు. ప్రాణమిత్రుడూ కాడు. ఒకరోజు పరిచయం అంతే." అన్నాడు శంకరం.

"అయితే ఏమంటారు?"

"ఏంలేదు. అంతే." అంటూ గదిలో గ్లాసుతీసుకుని కాఫీ తేవడానికి వెళ్ళిపోయాడు శంకరం.

"పాయింటేస్మే" అనుకున్నాడు ఇంటాయన విశ్వనాథంగారు సాలోచనగా.

* * *

శంకరం కాఫీపట్టుకు తిరిగివచ్చేసరికి, గదిలో ఆనందరావు లేడు.

ఇంటాయన ముసిముసినవ్వులు నవ్వుతూ నించున్నాడు.

ముళ్ళపూడి వెంకటరమణ

"ఇప్పుడే రెండునిముషాలైందండి వెళ్ళి" అన్నాడాయన.

"ఎలావెళ్లాడు జ్వరంతో" అన్నాడు శంకరం విస్తుపోయి.

"ఎలా వెళ్తాడు? డిస్టెంట్ లాంగ్ షాట్‌లో కాబోలు"

శంకరం మొహం ముడుచుకున్నాడు.

"అతనిగురించి మీరు నాతో పరాచికాలాడటం బాగుండలేదండి. జ్వరంతో తూలుతూవస్తుంటే చూచి, ఇక్కడ దిగబెట్టడానికి వచ్చాను అంతే." అన్నాడు శంకరం.

"జ్వరం ఎక్కడుందండి! అతన్ని పీడించేది. సినేరియాటిస్. అంటే సెరిబ్రల్ సినేమియాలో ఒకరకం జబ్బు. ఊహు సినేరియోలు రాసెయ్యాలని ఉబలాటం అన్నమాట. సాయంత్రమే పెద్ద 'చాన్సు' తప్పిపోయి షాక్ తిన్నాట్ట. అదీసంగతి. అందుకని, నేను కాస్త కాఫీపట్టించి, కాసిని ఆశలు తినిపించాను. ఝాంమని లేచి, మళ్లీ వేటకెళ్ళిపోయాడు".

"రాత్రిపూటా!"

"లేడికి లేచిందే పరుగు కోలుకుంటాడని నేను కాస్త ఆశపెట్టాను. నాకు తెలిసిన ఒక సినిమా ఆయనకి రికమెండేషన్ రాసిచ్చాను. ఆ ఉత్తరం పట్టుకు ఝాంమని వెళ్లాడు."

"మీరు చాలామంచివారండి" అన్నాడు శంకరం.

"పాయింటే...ఎటొచ్చి మనమందరం మర్చిపోతాం ఆ సంగతి. ఆంజనేయుడు వంటివాళ్లం" అన్నాడు ఇంటాయన.

ఆనందరావు హుషారుమీద ఎక్కి సరాసరి స్టూడియో గేటుదాకా మూడు మైళ్లూ నిరాఘాటంగా వెళ్ళిపోయాడు. అక్కడ ఠాప్‌మని ఆగిపోయాడు.

కబంధ హస్తంవంటిది అడ్డుపడింది. ఉత్తరక్షణంలో గూర్ఖావాడి కఠినవచనం కనబడింది. గర్జించింది.

"క్లోజప్ కట్" అనుకున్నాడు ఆనందరావు; క్షణంలో సగంలో ఆ సన్నివేశానికి సినేరియో ఊహిస్తూ.


తన హుషారు, ఆశలూ సర్వం కట్ అయిపోయాయి.

జేబులో ఉత్తరంతీసి చూపించి, తెలుగు భాషలో సంగతి అంతా చెప్పి, 'హై' అన్నాడు చివర.

ఆనందరావు భాషావైదుష్యానికి గూర్ఖా ముగ్ధుడు కాలేదు; సరిగదా వాడి భాషలో ఆజ్ఞవంటి పాడి ముక్కలు రెండన్నాడు. అంతలోనే కారొకటి ఎక్కణ్ణించో వచ్చింది. 'హార్న్' అంటూ పక్కకి నెట్టి గేటుతీసి సలాంకొట్టాడు. కారులోని తార ఆనందరావుని చూచీ చూడనట్టుగా చూసి, నవ్వీనవ్వనట్టుగా నవ్వుకుంది. కారు వెళ్ళిపోయింది. ఆనందరావు పేక మేడ కూలిపోయింది. అతను తొడుక్కున్న ఆశల చొక్కా పగిలి, చిరిగిపోయింది. తాను వ్రాయబోయే కథతో ఎవరో తియ్యబోయే చిత్రంలో ఆ తారే హీరోయిన్ కావాలని కోరుకుంటున్నాడు. పదిరోజులు ఆవిడ ఇంటి చుట్టూ తిరిగి, ఒకరోజు ఎలాగో దర్శనం సంపాదించి ఆముక్క ఆవిడతోనే చెప్పి వచ్చాడు.

నవ్వింది.

'చాలా అందంగా' అనుకున్నాడు ఆనందరావు. పూర్వాశ్రమంలో చదివిన సినిమాపత్రికల విజ్ఞానం జ్ఞాపకం వచ్చింది. కాఫీయా టీయా ఓవల్టీనా హార్లిక్సా అని అడుగుతుందని అనుకుంటూ, ఏం జవాబి



మైలాపూర్, కపాలేశ్వరస్వామికోవెలవద్ద కోనేరు

ఫొటో : పి. ఆర్. కె. ప్రసాద్—మద్రాసు.

★ సెరిబ్రల్ సినేమియా ★

ధ్యాసలో ఆలోచించుకుంటూ ఉండగా 'వస్తా పనుంది' అని లేచి వెళ్ళిపోయింది.

"మరే. కొదుమరీ. పాపం" అనుకున్నాడు ఆనందరావు.

ఇవాళ తనని చూచి పలకరించనేలేదు. పైగా! ఆవిడయెదుట పరాభవం జరిగిపోయింది. నాకొసకి బయల్దేరిన నక్క అనుకుంటుంది కాబోలు. కథ, సినేరియోలు, పాటలు రాయడంలో, తనకున్న ప్రతిభ, నటనలో డైరెక్షన్‌లో తన సామర్థ్యం గురించి తనకున్న ఆత్మవిశ్వాసం సంగతి ఆవిడకి పిసరంతకూడా తెలియదుగదా!

ఆనందరావుకి ఏడుపొచ్చింది. గుర్ఖావాడి మీద, గేటుమీద, కారుమీద, అందులో తారమీద, ప్రతిభకన్న డబ్బుకి ప్రాధాన్యమిచ్చే ఈ ప్రపంచంమీద భారీయెత్తున కోపం వచ్చింది. ఇందరి నిర్లక్ష్యానికి, నిర్దయకూ గురి అయిన ఆనందరావు అనే భావి 'ఫలానా' మీద జాలి కలిగింది. తక్షణం సినేరియో ఊహించాడు.

"క్రేన్ షాట్. స్టూడియో గేటు అవతల కళ్ళకు గంతలు కట్టుకున్న నటీనటులూ, డైరెక్టర్‌లూ, ప్రొడ్యూసర్‌లూ, పనికిరాని వాళ్లు, అడ్డమైన వాళ్ళూ తిరుగుతూ ఉంటారు. గేటు ఇవతల సిద్ధహస్తుడు, ప్రస్తుతానికి మసిపూసిన మాణిక్యం అయిన ఆనందం నిలబడివుంటాడు. గుర్ఖావాడు గెంటివేస్తూ వుంటాడు. ఆనందరావు తల వంచుకుని నెమ్మదిగా అడుగులు వేస్తూ పోతాడు. కట్...లాంగ్ షాట్‌లో ఆనందరావు...తలచుట్టూ విష్ణుచక్రం క్రమంగా ఫేడౌట్."

బ్రహ్మాండంగా ఉంటుం దనుకున్నాడు ఆనందరావు. అనుకుని, గిరున వెనక్కి తిరిగి గబగబ, సంగు చివరకి వెళ్ళి కాఫీహోటల్లో మూల కూర్చున్నాడు... నీరసంగా.

సర్వరు పలకరించాడు.

పరాభవాన్ని నెమరువేస్తున్న ఆనందం 'హు' అన్నాడు.

హు అంటే ఏమిటో సర్వేశ్వరరావుకి బోధపడలేదు. ఆ సంగతే చెప్పాడు.

'కాఫీ' అన్నాడు ఆనందం మేలుకుని. మళ్లా వెంటనే వాలిపోయాడు బల్లమీదికి మత్తుగా.

మత్తుగానే ఇంకా ఆలోచిస్తున్నాడు ఆనందరావు ....

...ఇవాళ స్టుడియో గేటుదగ్గర పరాభవంపొందిన ఆనందరావు ఒకానొకరోజున సుప్రసిద్ధ ఫలానా అవుతాడు. ఈనాడు తనని గుర్తించని తార ఆనాడు హీరోయిన్‌గా బుక్ అవుతుంది.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లు సుమా సార్" అంటుంది సెట్ మీదకొచ్చాక.

డైరెక్టరు ఆనందరావు మందహాసం చేస్తాడు.

"195 డాష్ సంవత్సరం, ఫలానా నెల ఇన్నో తేదీన ముసురుగా ఉన్నవేళ మీరు కారులో స్టుడియోకి వెళ్తావుండగా గేటులో మాసినబట్టలు వేసుకున్న ఒక ఆసామిని గూర్ఖా పోపో అని దబాయిస్తు

★ పెరిబ్రిల్ సినేమియా ★

న్నాడు. ఆనాటి అవమానితుణ్ణి మీరు చూసీ చూడనట్టు చూసి, నవ్వీ నవ్వనట్టు..."

"కాఫీ తాపడుసార్" అన్నాడు సర్వ రుడు.

ఆనందం అదిరిపడి మేలుకొని ఇకిలిం చాడు...

కాఫీ చల్లారుస్తున్నాడు ఆనందరావు...

...కాఫీ చల్లారుస్తున్నాడు సుప్రసిద్ధ సినీహీరో 'ఆనంద్'

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాడు పెద్ద ప్రొడ్యూసరు.

"కాలచక్రం....19ర డాన్ సంవత్స రంలో డాన్‌నెల ఫలానా తేదీన ఇన్నిగంట లకు సినేరియోదస్త్రం చేతబట్టుకొని, ఒక స్టుడియో గేటులో నిలిచి పరాభవంపొందిన ఆనందరావు...ఈనాడు...నాకొ..."

"మురుపో అప్పటి అంటరా" అంటూ లేచాడు ఆనందం పక్కకుర్చీలో కూర్చున్న ఎవడో.

ఆనందరావు మేలుకుంటున్నాడు-కొశా లని రచయితగా, దర్శకుడుగా, కెమెరా మన్‌గా, ఎవడుపడితే వాడుగా.

బయట వాన పడుతోంది. ముసురు పట్టింది. ఆనందరావు కాఫీ గడగడతాగేసి సిగరెట్టు ముట్టించాడు.

కొందలుచుకున్న హీరో ఎవరో, కాఫీ తాగి పోతూపోతూ ఆనందాన్ని చూసి సలాం కొట్టిపోయాడు.

"ప్రమాదో ధీమతామపి" అనుకున్నాడు ఆనందం. చఫ్ నోరుముయ్ అని వెంటనే అనుకున్నాడు. అతను తనకి పొరపాటున సలాం కొట్టలేదు. ఏ డైరెక్టరుతోనో, ప్రొడ్యూసరుతోనో చూసివుండాలి. తనంటే పడిచచ్చే వరహాలు లేడూ?

ఎందుకులేడు? బోలెడున్నాడు. లావుగా అరఙుగుల రెండుఅంగుళాల ఎత్తున...

అంత వరహాలూ, లోపలికొచ్చాడు కొప్పుటంటూ., దండంబాబూ అన్నాడు.

సినిమావాళ్ళంతా ఆనందం చెబితే వింటా రని వరహాలు నమ్మకం. వరహాలు దగ్గరున్న పుడు ఆనందానికి అదే నమ్మకం.

రావోయ్ వరహాలూ అన్నాడు ఆనందం. వరహాలు వచ్చాడు.

"షూటింగు కెళ్లారా బాబూ? ఇయ్యాల కైలు షూటింగంట" అన్నాడు.

"మరే వెళ్ళాలోయ్. ఇవాళ నా సినేరి యోని ఓ ప్రొడ్యూసరు చూస్తానన్నాడు. తీరకచేసుకు వస్తానన్నాను" అన్నాడు ఆనందరావు హుందాగా.

"మరింకేటి. ఎల్లారి నెగండి. నాకియ్యాల ఎలాగేనా రాడీయేసం ఇప్పించాల"

"నీ దగ్గిర డబ్బెంతుంది. చెప్పు ఆ గూర్ఖా వాడికి కొంత పారెయ్యాలి. పిల్లలవాడు చాలుగుసార్లడిగాడు" అన్నాడు ఆనందం గబుక్కున.

"ఏంలేదుబాబూ. మా సిట్టి ఇంకా పంప లేదు. లేడబ్బు లుంటే ఈడికి నడిసొచ్చా" అన్నాడు వరహాలు. ఆనందం నవ్వాడు.

ఇద్దరూ బయల్దేరారు. వచ్చే కార్లూ పోయే కార్లూ, మూసి పెద్దలూ చూడని పెద్దలూ, చూడలేని పెద్దలూను. ఆనందానికి ఒళ్లు చచ్చిపోయినట్టయింది, తను అలా రోడ్డున పడి నడిస్తున్నందుకు. రోజూ నడుస్తున్నా, ఏ రోజూ కారోజే ఒళ్లు చచ్చిపోయినట్ట వుతూ ఉంటుంది అతనికి.

"బాబూ" అన్నాడు వరహాలు.

"ఏం?"

"ఇయాల పొద్దుటేల మా యింటికాడ పిచ్చర్ కంపెని కెళ్లానండి. అంతవరకూ ఇత్తానిత్తానని ఇయ్యాల ఎగేసి, నేదన్నా రండి. ఆకి మాటనమ్మి, నేను మా సిట్టికి ఉత్తరం రాసేసినాను."

"ఈసినిమావాళ్లంతా ఇంతేనోయ్ మాట నిలకడలేదు ఒకడికీ.. నా సంగతి చూడూ.." అన్నాడు ఆనందరావు.

ఆనందరావుసంగతి అచ్చ తెలుగులో చెప్పా లంటే-లాటరీకొట్టడం. అతను కాంఫుల్ సినే రియోలు రాస్తాడు. ఎవర్నో అడుగుతాడు. వాడు చూస్తానంటాడు. చూడడు. చూసే అర్హత కలిగిన రోజున, 'ఎవరేనా కథ రాస్తాడు కాని, అలూచూలు లేకుండా సినే రియో రాయట మేమిటండీ' పొండి మీరు బొత్తిగా అన్యాయమండీ అంటాడు.

నిజానికి ఆనందరావు. కొత్తల్లో వేషాలు సంపాదించడానికి ప్రయత్నించాడు. అవి కలిసిరాక, అసిస్టెంటు డైరెక్టరు అవుదామని ఆశపడ్డాడు. రద్దీ ఎక్కువ. "టెక్నికల్ సైను బ్రైన్" చేశాడు. అంబ పలకలేదు. అదీ ఇదీ అన్నాడు. ఏదీ సాగిరాలేదు. చివ రకి 'సినిమాకథలు, రాయడానికి సిద్ధపడ్డాడు. నాలుగైదు రకాల హీరో పాత్రలు, వాటికి వ్యతిరేక లక్షణాలుండే హీరోయిన్ పాత్రలూ, విలన్ హాస్యగాళ్ళు, వాళ్ళ ప్రియురాళ్లి వేషాలు లిస్టు రాసుకున్నాడు. ఒక్క బిగినిదజను కథలు రాసుకుని సంచిలో వేసుకుని, సరికొత్త ఆశల చొక్కా ధరించి, గొప్పవాళ్ళ తొలి చరిత్రలను స్మరించి, సిగ్గు, లజ్జా విస్మరించి, జైత్రయాత్రకు బయల్దేరాడు.

కాదు, ఒద్దు, నాదగ్గర కొల్లలున్నాయి, కొత్తరకం కావాలి, ఆయన ఇంట్లో లేరు, వారికి తీరికలేదు, చేతికి డబ్బువస్తే, సినిమా తీస్తే చూస్తాం వంటి జవాబులు యెదు రయ్యాయి.

తీస్తే గీస్తే, చూస్తే వచ్చిన జవాబులు: ఈ కథ పాతదే,' ఇది నాకు తెలుసు, డైరె క్టరు బావమరదికి బాగులేదు. అయినా కొత్త పోయినా కథ ఒకడు రాయడమేమిటి, నలుగురం కలసి తయారుచేస్తాం. హీరో అభి ప్రాయం, హీరోయిన్ అభీష్టం చూస్తాం. నువ్వేం శరత్ బాబువా, షేక్స్పియర్‌వా, అయినావాళ్లికే దిక్కులేదు.."

నామాట విని సినేరియో తయారుచెయ్యి. అది చేతనయితే పోయి. ఏలైతే దకరకాల పాటలు రాయి. రెడీమేడ్ సినేరియోలైతే కంటికానుతాయి. నలుగురూ కలసి చంప డానికి నీదన్న కథ లేదు కొబట్టి ప్రాణా నికి పోయి.

...ఇదుగో ఇలా చూడు. నా మాట విని బాగుపడు. సాధ్యమైనంత నిరాశపడు. ఝూ మ్మని ఇంటికి నడు...

ఆనందరావు నిరాశ పడలేదు, ఇంటికి నడవలేదు. పొయింటేస్కో అనుకున్నాడు. పెద్దల అడుగు జాడలో బయల్దేరాడు. ప్రాబ్లెం, సొల్యూషన్ మూడు ముక్కలూ రాసేసి, క్షణంలో ఎవరికైనా తెలి సేలా మూడున్నర ముక్కల్లో కథ రాసు కున్నాడు. దీనికి సినేరియోలు వస్తాలకొక్క ఉత్పత్తిచేశాడు.

ఈ వ్యవసాయంచరణ సాగిస్తున్నంత కాలం అతనికి జరుగుబాటు ఎలా సాగింకో అతనికి తెలియదు. తరచుగా నే భోజనం వంటిది చేస్తూ ఉండేవాడు. ముప్పూటలా ఆకలు మాత్రం సుష్టుగా పీకమొయ్యా భోం చేసేవాడు. బస్సుకి డబ్బు లేనప్పుడెల్లా ఊహాలెక్క సవారీ చేసేవాడు. పరాభవం పొందినపుడల్లా వరహాలుని గనిరికొట్టి ఓదార్చుకునేవాడు...

"వరహాలూ అదీ కథ. మాకావుగా నా వ్యంగితి. పంచినిండా కాగితాలు; వాటి నిండా మనుషులు. రకరకాలవాళ్లు. దుర్మార్గులు, మంచివాళ్లు, అందగాళ్లు, అమాయకులు, చాణక్యులు, చంద్రగుప్తులు, నాగేశ్వరరావులు, రామారావులు, రంగారావులు రేలంగి వెంకట్రామయ్యలూ వాళ్ళమీద నా ఆశలూ, వాటిమీద సౌధాలూనూ..."

"మరి నామీద రాయలేదేటి? నేను లేనా అంగులో" అన్నాడు వరహాలు.

ఆనందరం పకపక నవ్వాడు. "సారీ నువ్వు లేవు వరహాలూ. నేను సృష్టించిన పాత్రలన్నీ హీరో హీరోయిన్ మొదలైన పెద్ద తిరహాలి. కథలు అమ్మ మాపినపుడు ఇవే ముఖ్యం అన్నమాట. నీవంటి చిన్న చిన్న పాత్రలు తిరవాత ఎక్కిస్తాం అన్నమాట" అన్నాడు.

"నేను పెద్ద ఏసాలు ఎయ్యాలేనంటావా. అసలు అట్టాంటియి మనకి దొరకవా" అన్నాడు వరహాలు బిక్క మొహం పెట్టి.

"ఛ ఛ అలా బెంగెట్టుకుని అంతలో నే అలా అయిపోతే ఎలా? నే చెప్పలే...... ముందర చిన్న చిన్న వేషాలు వేస్తారు ఎవరయినా సరే. ఎంత పెద్ద యాక్టరేనా సరే నన్న మాట. ముందర చిన్న ఎక్స్‌ట్రా వేషాలు కట్టాల్సిందే. నీవంటివాళ్లన్నా రనుకో..."

"ఉంటే ఏటవుద్ది?"

"మాడు వరహాలూ నువ్వు ముందర బాగా మాట్లాడ్డం నేర్చుకోవాలి. ఏటవుద్ది అనకూడదు. ఏమవుతుంది అనాలి. అలా అంటేనే సినిమాలో ఛాన్సు."

"బాబయ్యా నువ్వు మరీని. సినిమాలో అయితే మాత్రం రౌడీలు ఏటవుద్ది అనకుండా పెద్ద బాస మాట్లాడితే ఏటవుద్ది? రసాభాసంఅవుద్ది—'సెగన్... ఈడు అసలు రౌడీయే కాదు. ఏసం ఏశాడు ఏసం, అంటారు" అన్నాడు వరహాలు.

"నమస్కారమండీ" అన్నాడు ఆనందరావు దూసుకుపోయిన కారును చూసి మందహాసం చేస్తూ.

"ఏటది?" అన్నాడు వరహాలు.

"ఎవరో నాకు తెలిసిన డైరెక్టరులే" అంటూ, ఆగి, కొత్త దర్జాగా సిగరెట్టు తీసి ముట్టించాడు ఆనందం. వరహాలు దిగాలుగా నిలబడ్డాడు.

"మాడు వరహాలూ. అలా దిగాలుగా ఉండకు. నువ్వు అమాంతం ఎలా గొప్పవాడి వవుతావో చెప్పనా?"

"చెప్పండి. మరి"

"నువ్వు ఎక్స్‌ట్రా వేషం వేశావనుకో ఓ సినిమాలో. హీరో ఏదున్నా గంభీరంగా పెద్ద డైలాగు చెబుతూ ఉన్నప్పుడు, నీవంటి వాళ్ళంతా గుంపుగా చుట్టూ ఉంటారు. హీరో యాక్షన్‌కి నువు రియాక్టు చేస్తావు నీకు తెలియకుండానే. తిరవాత ఏ డైరెక్టరో, ప్రొడ్యూసరో, ఆ సినిమా చూస్తూ ఉంటే, నీ మీద దృష్టిపడుతుంది. ఆ లావుపాటి అతను ఎవరు చెప్మా. డైలాగు లేకపోయినా అంత చక్కగా నటిస్తున్నాడు! అనుకుంటాడు. వరహాలూ దాన్నే 'స్టీలింగ్ ఎ సీన్' అంటారు. అప్పుడేమవుతుంది తెలుసా? తెల్లారేసరికి మీద టెలిఫోను మీద అంబీలమీద వాకబు చేసేస్తాడు. నిన్ను బుక్ చేస్తాడు. అంతే, ఆదే మొదలు-సెల తిరిగేసరికి నువు పెద్ద స్టారవి అయిపోతావు. అప్పుడు నిన్ను చూసి, కథలు రాస్తారన్నమాట" అన్నాడు.

"అప్పుడు రౌడీ యేసాలు ఎయ్యొచ్చుగనా" అన్నాడు వరహాలు హుషారుగా.

"ఒక్క రౌడీ ఏమిటి. అన్నిమైన వేషాలూ వసియ్యొచ్చు. హీరో విలన్, హాస్యగాడు, వెయ్యొచ్చు. నీకు సరదాగా ఉంటే, సాధించలేనా అనుకుంటే హీరోయిన్ గూడా వెయ్యొచ్చు. నీ పలుకు వేదం, అవుతుంది. నువ్వు బాక్సాఫీస్ పిచికవి అయినపుడు నీ మాటకి అడ్డెక్కడ, నీకీర్తికి ఒడ్డెక్కడ..."

వరహాలుకి ఇదేం నచ్చలేదు.

"అయ్యన్నీ నాకు తెల్దుగాని, నాకు రౌడీయేసం కావాల. రౌడీ అంటే మంచోడన్నమాట. ఒకరన్నా నలుగురు ఎదవ రౌడీలున్నారనుకో. ఆ నాయాళ్లు, ఓ పడుచు తిన్నంగ ఎల్తుంటే, దాన్ని అటకాయించి, అపాల రొడకేసాకేత్తారనుకో, అప్పుడు మంచోడు...అసలు అందరూ రౌడీ ఎదు అనుకుంటూ ఉండాలన్నమాట. అప్పుడు మంచి రౌడీ ఏంసేత్తాడంటే"

"తెలుసు లేవోయ్. ఆ నలుగురినీ పట్టు చావమోది, ఆ పిల్లని తల్లీ అంటాడు అ తేగా. ఎప్పుడూ ఉన్నదేగా మన పాట" అన్నాడు ఆనందం విసురుగా విసుగ్గా.

వరహాలు చిన్నబుచ్చుకున్నాడు. "అల కరవొత్తే నేనేటిసెప్పేది బాబూ. నేను అలాటి ఏసం ఏత్తే సూడాలని మా సిట్టి మనసు. అందుకే గందావచ్చింది" అన్నాడు

ఆనందం మాటాడలేదు.

వరహాలు రెండుసార్లు పలకరించి, కోపం వచ్చిందని గ్రహించి, నోరుమూసుకున్నాడు......

లావుగా పొడుగ్గా ఉన్న వరహాలు కొస్త బొద్దుగా ఓ మోస్తరు పొడుగ్గా ఉన్న 'భవిష్యత్కళానా' ఆనందరావూ చెట్టపటా వేసుకు స్టూడియో గేటుదగ్గర కొచ్చేసరికి, 'కాబోలనుకునే హాస్యగాడో'కడు పకాలున నవ్వి 'తేగాబడ్డా అని' మళ్ళీ పకాలున నవ్వాడు.

★ సెరిబ్రల్ సినేమియా ★

వరహాలు చిన్న బుచ్చుకున్నాడు. ఆనందం మాత్రం పట్టలేక, 'హాకా' అన్నాడు ఆ హాస్యగాణ్ణిచూచి.

గేటవతలదూరాన ఓ జూనియర్ ప్రొడ్యూసరు కనబడ్డాడు. ఆయన్ని చూడగానే ఆనందానికి ప్రాణంలేచొచ్చింది. ఆనందరావు కథని సినిమాతీస్తానని, కథ వీల్లేకపోతే, ఒక డాక్యుమెంటరీ అయినా తీసిపారేసి గవర్నమెంటువాళ్ళకి అమ్మిపారేస్తానని ఆయన బెదిరిస్తూ వచ్చాడు.

"నమస్కారం అండి" అన్నాడు ఆనందం. అంటూనే, చొరవగా, 'గేటుదాటి లోపలకి ఎదురేగాడు. అతని వెంటనే వరహాలూ చొచ్చుకెళ్ళిపోయాడు.

"జ్యాప్రొ" గారుస్టుడియో రోడ్డుప్రక్కన ఓ చెట్టుకింద ఆగి ఉసూరుమన్నారు. శుభసూచకం అనుకున్నాడు ఆనందరావు— ఆయన ఆగడంచూసి. అనుకోడం, ఆయన పక్కన చేరడం, తన కథ సంగతి అడగడం ఆయన ప్రతిభ పొగడడం క్షణాలమీద జరిగిపోయాయి.

"ఆ ఏమియ్యా నీ సొద. ఇపుడు కాదు నీ కథ" అన్నాడాయన విసుగ్గా.

ఆనందం అపార్థం చేసుకున్నాడు. పొగడ్త డోసు చాల లేదని, తన దుస్థితి ఆవేదన 'టెక్నికలర్' లో చిత్రించ లేకపోయాననీ అనుకున్నాడు. అనుకుని మళ్ళీ పుంజుకున్నాడు.

"అన్నీ విచిత్రమైన పాత్రలండి "విచిత్రమైన కాంబినేషన్ అండి. మంచి మెలోడ్రామా ఉందండి మీరుతప్ప ఇంకోడు న్యాయం చెయ్యలేడు."

వరహాలుకి ఓపిక తగ్గుతోంది. అవతల వేషం పోతుందని బాధ.

"ఆనందం! ఎల్లాగా?" అన్నాడు మెల్లిగా.

"ఉండవయ్యా నువ్వూ నీ సొదాను." అన్నాడానందం.

జూనియర్ ప్రొడ్యూసర్ ఒక్కసారి మొట్టగిసలా తన్నుకున్నాడు. ఉత్సాహ అభినయసూచకంగా "నమస్తే నమస్తే" అంటూ చేతులు ఎగరేశాడు. స్టుడియోలోంచే వస్తున్న ఓ కారుని చూసి.

ఆ కారులో ఓ ప్రొడ్యూసరున్నాడు. అతని చేతులో పలుకుబడి, దానిక్రింద స్టార్ వాల్యూగల హీరో హీరోయిన్ విలన్‌లూ ఉన్నారు.

వాళ్లలో ఏ ముగ్గురి—కనీసం ఏ ఇద్దరి లేదా ఒకరి సంతకం ఉన్న కాంట్రాక్టు సంపాదించినా, డిస్ట్రిబ్యూటరు సులభంగా పెట్టుబడి ఇస్తాడు. పెట్టుబడి మినహా ఉత్సాహం, ఉబలాటం, ఉద్రేకం మొదలైన ఇతర హంగులన్నీ ఉన్న 'జ్యాప్రొ' గారికి హఠాత్తుగా ఈ ఊహ తోచింది. గిరాకీఉన్న 'స్టార్స్' సులభంగా దొరకరు చేతి డబ్బు లేనప్పుడు కాస్త పలుకుబడిఉన్నవాళ్లి సిఫార్సులు కావాలి ఆ క్షణానికి ఇంకో 'జ్యాప్రొ'కి కూడా అలాటిఊహే తోచినట్లు ఈయనకి తెలిసింది. అతగాడు, ఈ పెద్ద ప్రొడ్యూసర్ని బ్రతిమాలి బామాలి, సిఫార్సు సంపాదించడానికి శపథంపట్టి, ఆయన ఇంటిదగ్గర కాసుకు కూర్చున్నాడట. అందుకని, ఈయన్ని దారిలోనే అటకాయించి, ఆ సిఫార్సువరం ఇస్తానని ఒట్టేయించుకోవడానికి ఈయన తహ తహ లాడుతున్నాడు. స్టుడియోలోనే చూశాడు గాని, అక్కడ ఇంకా నలుగురున్నందువల్ల, దూరం ఆలోచించి, కొంచెం ఇవతలగా దారి కాశాడు.

కారు ఆగింది "నమస్తే" అన్నాడు జ్యాప్రొ మళ్లా-తనకోసం కారు ఆపినందుకు మురిసిపోతూ. కారులో ఆయన ఊహలు మరో పంథాలో నడుస్తున్నాయి. కారు ఆపి డ్రైవరు పరిగెత్తాడు వెనక్కి. కారులోనివారు కూర్చునే 'నవరసాలూ' అభినయించేస్తున్నారు. తలక్రిందులై పోతున్నారు.

"మీతో ఒక్క అర్జెంటు సంగతి మనవి చెయ్యాలి..." అంటూ పాఠం మొదలు పెట్టాడు'జ్యాప్రొ' కారులోకితల దూర్చి...

"...అన్నీ విచిత్రమైన విశిష్టమైన కారెక్టర్సండి బాక్సాఫీస్ కావడం గారంటీ...మీరు ఆయిద్దర్నీ గనక ఒప్పించి కాంట్రాక్టు రాయిస్తారా... మేలు మరిచిపోను...మీరు చెబితే వాళ్లు కాదనరు..."

కారులో ఆయన విన్నేస్థితిలో లేడు. అద్దంలోంచి వెనక్కి చూస్తున్నాడు 'డ్రైవ'రొస్తూనే. ఉండుండి హఠాత్తుగా తలవంచి ఆలోచన అభినయించాడు

'జ్యాప్రొ' ఆతృతగా చూస్తున్నాడు 'పండా కాయా' అని.

"చూడండి. ఓ ఉపకారం చేస్తారూ" అన్నాడు కారులో ఆయన మళ్లా ఓ సారి వెనక్కి చూసి.

"జ్యాప్రొ" ఎగిరి గంతేసి ఎంతమాట అన్నాడు రెండుసార్లు. అవశ్యం చెప్పండి అన్నాడు.

"ఏం లేదు. ఒక్క సిగరెట్టుఉంటే అర్జంటుగా ఇవ్వండి. మా డ్రైవరు ఇంకా రావటం లేదు."

జ్యాప్రొ కొయ్యబారిపోయాడు. సిగరెట్లు తనదగిర లేదన్న సంగతి గుర్తొచ్చి నీరుగారి పోయాడు.

ఒక్క సిగరెట్ మీద ఆధారపడిఉంది తన అదృష్టంఅంతా వెనక్కితిరిగి రెండడుగులు వేశాడు. నాలుగడుగులు అవతల నించున్న ఆనందం, ఏదో గిరాకీ అనుకున్నాడు. సినేరియో చూపించమన్నాడండీ అంటూ దస్త్రం ఇవ్వబోయాడు ఆశగా.

"సినేరియో కాదు. నా బొంద సిగరెట్టుంటే తగలెయ్యండి. మీరూ మీ వెధవ సినేరియోలూనూ" అన్నాడు 'జ్యాప్రొ' ఉద్రేకంతో వణికిపోతూ.

"మీరిలా అంటారనుకోలేదండి. అసలు చూడకుండానే వెధవా బోడీ అని పేర్లు పెడితే ఎలా?...అన్నీ విశిష్టమైన పాత్రలు. చక్కటి మెలోడ్రామా ఉంటుందండి."

"సిగరెట్టుండీ సిగరెట్టుండా కొంపలు మునిగిపోతున్నాయి ఆయన అసలే తిక్క మనిషి" అన్నాడు జ్యాప్రో మండిపడుతూ.

"సిగరెట్లు లేవండి. ఐపోయాయి ఇందాకే ఒకటుంటే ..."

జుట్టు పీక్కోవాలని 'జ్యాప్రో' హృదయం ఘోషించింది. ఒక్క సిగరెట్టువల్ల తన సముజ్వల భవిష్యత్తు చల్లారిపోతుంది...సిగరెట్టోయ్ అనుకున్నాడు పళ్లుగిట కరచుకుని. ఆడ్రైవరు ఈలోగా తెచ్చేస్తే తన అవసరం ఉండదు. కారు వెళ్లిపోతుంది. తన ఛాన్సు పోతుంది.

ఇంకో రెండడుగుల అవతలఉన్న వరహాలు వంక చూశాడు.

వరహాలు బీడీకాలుస్తున్నాడు సాలోచనగా.

విధి దుర్విధీ, గతి దుర్గతీ గింం తథిగిణాం అనుకుని మతి దాదాపు పోగొట్టుకుని 'జ్యాప్రో' మళ్లా కారువంక తిరిగాడు. బిక్కమొహంపెట్టిన డ్రైవరు కారు స్టార్టు చేస్తున్నాడు. లోపలున్న ప్రొడ్యూసరు గారి కోపంతో కారు భగ్గున మండుతోంది.

"ఆయిద్దరికీ చెప్పి ఒప్పిస్తారుగా... మిమ్మల్నే నమ్ముకున్నాను" అన్నాడు జ్యాప్రో.

"అవ్వే అదక్కడ కుదురుతుందండీ. డబ్బుతోపని మీరే చూసుకోండి." అని జవాబొచ్చింది.

'జ్యాప్రో' 'ఇసీ' అనుకున్నాడు అతనికి వైరాగ్యం వచ్చేస్తోంది.

అవతల విచారంగా నిల్చున్న ఆనందం ఇంకొక్క ప్రయత్నం చేశాడు. "చూశారూ మంచి క్యారెక్టర్స్ చూపిస్తే డబ్బులేకపోయినా కొండమీది కోతులు దిగొస్తాయండి. నాదగ్గిర అలాంటి ఎరలు అద్భుతమైనవి..."

"అబ్బాయ్ లాభంలేదు. అదేం కుదరదు. ఇది డబ్బుతో పని. ఇంకెక్కడైనా చూసుకో" అన్నాడు జ్యాప్రో. అని విసురుగా వెళ్ళిపోయాడు.

ఆనందరావుకి ఏడుపు రాబోయింది. అవతల దిమ్మెడీఅంత మొహం చేసుకు నిల్చున్న వరహాలు నెమ్మదిగా భయంతో సమీపించాడు.

"బాబూ...ఎల్లారా సూటింగ్ కి. అల్లు మళ్లా ఇంకెవళ్లనైనా తీసుకుంటారేమో" అన్నాడు.

"నువ్వెళ్లవోయ్ నాప్రాణంతియ్యక. ఇద్ది

★ సెరిబ్రల్ సినేమియా ★

డబ్బుతో పని. ఎవర్తైపడితే వాళ్ళని తీసుకోరు. నువ్వెపోయి చూసుకో" అన్నాడు ఆనందం మహా హుషారుగా.

వరహాలుకి ఏం పాలుపోలేదు. ఎటూ కాలాడలేదు. అంతలావు అంతెపొడుగు మనిషీ చిక్కచచ్చిపోయి గోళ్ళు కొరుక్కుంటూ నిలబడిపోయాడు. కదిలినా మానినా ఆనందానికి ఇంకా కోపం వస్తుందని భయం. సిగ్గుతో అభిమానంతో కుమిలిపోతూ ఉన్న ఆనందరావుకు, మామూలుగానే కోపం వచ్చేసింది; అతన్ని ఓదార్చడానికి.

"పో వయ్యా పో... నా దగ్గరెందుకు భయం? ఇక్కడ ఎవరికవరవుతారు. ఈ లోకంలో దయకీ ప్రేమకీ తావులేదు. నీదారి నీదే. పతివ్రత వేషాలెయ్యకు. నాకు ఒళ్ళు మంట" అన్నాడు.

వరహాలు దీనంగా ఒకసారి చూసి, తలవంచుకుని నెమ్మదిగా సెట్స్ వేపు బయల్దేరాడు. చెట్టుమీద కాకి ఆనందం మీద రెట్టవేసింది. తలపైకెత్తి చూశాడు ఆనందం. 42 వాద్యాల నౌషాద్ సంగీతం చెవిలో హోరెత్తింది. చక్కని సన్నివేశం చిత్రించవచ్చుననుకున్నాడు.

తలవంచుకు వెళ్ళిపోతున్న వరహాలు, చక్కని హీరోయిన్ కావచ్చు...

ఆనందరావు ఆ సన్నివేశానికి నాయకత్వం వహించవచ్చు....

ప్రేమ తెకిసికొట్టిన సందర్భం అన్నమాట... పో పో... నా దగ్గర నీకు భయమెందుకు? ఈ లోకంలో దయకీ ప్రేమకీ తావులేదు. నీదారి నీదే. పతివ్రత వేషాలెయ్యక అవతలికిపో" అంటాడు హీరో.

పరిదీనవదన అయిన, సుందరి తలవంచుకుని, దుఃఖపడుతూ నెమ్మదిగా వెళ్ళిపోతుంది. నలభై రెండు వాద్యాల సంగీతం భూనభోంతరాలని అదరగొట్టేస్తుంది. గుండె రాయిచేసుకున్న హీరో ఆనందరావు, ప్రపంచాన్ని చూడలేక, తపించి తలపైకెత్తి ఆకాశం వంక చూస్తాడు... డిస్టెంట్ లాంగ్ షాట్...

గాజుల గలగలలు వినబడగానే, ఆనందరావు సినీలోకం లోంచి, భూలోకం లోకి దిగివచ్చాడు.

వర్తమాన తార ఒకామె కంటికి కానింది. ఆనందానికి తెలిసిన అమ్మాయి. సుబ్బులూ అని పిలుస్తాడు. "కాదు కామినీ" అనాలి అంటుంది నవ్వుతూ.

"ఏమిటి చెట్టు కొమ్మలవంక అంత శ్రద్ధగా చూస్తున్నారు ఛాన్సు ఇవ్వకపోతే ఈ కొమ్మకి ఉరేసుకుంటానని ప్రొడ్యూసర్లని బెదిరిద్దామనా?" అంది కామిని.

"తొందరపడానికి డబ్బెక్కడ తేను?... నేను గొప్పవాణ్ణయేలోగా నువ్వు పెద్ద స్టార్ వి అయిపోతే, ఈ చెట్టెక్కి దూకేసి"

"అయితే పల్లూగ్రంటూరానే సిద్ధపరచుకోండి. నెల తిరక్కుండానే నేను మీరన్నంతదాన్ని అవుతాను. నాకు అమృతమ్మ దొరికింది. ఒట్టు" అంది.

"ఎప్పుడూ? ఎలా? ఎక్కడా?" అన్నాడు ఆనందం కళ్ళు పెద్దవి చేసి.

"ఈ ఊళ్ళో చేరేలెండి. ఇంక చూస్కోండి అదృష్టం ఎలా తిరుగుతుందో" అన్నది కామిని.

అమృతమ్మ గార్డియన్ గా ఉన్న వాళ్ళందరికీ అదృష్టం చప్పున పడుతుందనీ అతి త్వరగా తారాపథంలో కారెక్కి ఊరేగవచ్చుననీ ఆ పిల్ల శ్రేయోభిలాషి ఎవరో గట్టిగా నచ్చజెప్పి, అందుకు ప్రత్యక్ష నిదర్శనాలు చూపించాడు.

కామినికి ఆ బాపతు బంధువు లెవరూ లేరు. ఉంటే, సిరి వరిస్తుందని ఆశ. అందుకని వెతికి వెతికి, మనవరాళ్ళెవ్వరూ లేక అవస్థపడుతున్న ఓ అమృతమ్మని మాట్లాడి కుదుర్చుకుంది.

"చాలా మంచిది" అన్నాడు ఆనందరావు మందహాసం చేస్తూ. మాసి మాసి గట్టిగా నవ్వి పోశన చేయడానికి మనసొప్ప లేదు అతనికి.

"అమాయకత్వం వల్ల నీ అందం మరింత శోభిస్తోంది సుబ్బులూ" అన్నాడు కొత్త ఆశ.

(58-వ పేజీ చూడండి)

[సమయం సాయంత్రం 5-30. అదొక డ్రాయింగురూమ్ తెర లేవగానే ప్రవేశం గిరిజ. 15 ఏళ్లు వయస్సు. స్కూలు నుంచి విసురుగా విసుగ్గా ప్రవేశించి టేబిలుమీద పుస్తకాలను పడేసి నిట్టూర్పుతో బొమముడితో కుర్చీలో కూలబడు తుంది ప్రవేశం ఇందిరమ్మ, గిరిజతల్లి, 40 ఏళ్లుంటాయి. కూతురు వాలకం చూచి ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి:—]

ఇందిరమ్మ : అదేమిటే తల్లీ! ఏమయిందే?

గిరిజ : ఏమీలేదూ.

ఇంది : కాఫీ తాగరాదుటమ్మా ముందు, తలనొప్పిగా వుంటే.

గిరిజ : అబ్బ వుండవే, వస్తుంటే.

ఇంది : అదేమిటే చోద్యం!

గిరిజ : (నిట్టూర్పుతో తల్లి వంక చూస్తుంది.)

(ప్రవేశం సూర్యం. గిరిజ అన్న. 18 ఏళ్ల వయస్సు. కోపంతో ముఖం కందగడ్డలావుంటుంది. ప్రవేశించి తల్లీ చెల్లెళ్ళని పరీక్షగా చూస్తూ నిలబడతాడు.)

ఇంది : చెప్పరాదుటే తల్లీ!

సూర్యం : ఏముంది చెప్పటానికి. (కుర్చీలో కూర్చుని) చెప్పమంటావా?

గిరిజ : (తలెత్తి సాలోచనంగా అన్న ముఖంలోకి చూస్తుంది.)

ఇంది : ఏమిటో చెప్పరాదుటోయ్ మహా!

సూర్యం : మన పక్కింట్లోకి వారం రోజులకిందట వచ్చిన శర్మగారున్నారే-

గిరిజ : గారు కూడా దేనికి?

సూర్యం: గాడో గాడో. ఏదో. ఆయన్ని నేను రోజూ పరీక్షగా చూస్తున్నా గదా. గిరిజ వస్తున్నా వెళ్తున్నా ఎందుకో అలా దానివంక మొహంవాచినట్టు చూస్తుంటాడు. వెధవమాపులూ ఆయనానూ. ఆ పొట్ట సైకిలు దిగి...నిజంగా మొహం వాయగొట్టా మనిపిస్తుంది కాని -

ఇంది : ఛీ నోర్మూయ్యి... పెద్దా పిన్నా లేకుండా.

సూర్యం : కాకపోతే ఎందుకు అలా చూట్టం నా చెల్లెల్ని? ఏవో వోమాటు కాదు, ఎప్పుడూ దేబిరికొట్టు మొఖం పెట్టుకొని.

ఇంది : (చెంపన చెయ్యి పెట్టుకొని) ధా...ఆయనఅలాటివాడల్లే కనుపించడురా.

గిరిజ : మరెలాటివాడేం? ఈ యన్ని గురించి రోజూ ధాకుక్కని దాకుక్కని పోవాల్సొస్తున్నది స్కూలుకి.

సూర్యం : ఎప్పుడో ఆయనకు సగం పాఠం నా దగ్గర్నుంచీ బాకీ వుంది.

గిరిజ : నాలాటి కూతుళ్ళు లేరా ఆయనకు?

సూర్యం : లేకేం వున్నదిగా రాద నేను దాని వెంటపడతానుండు టిట్ ఫర్ టాట్!

బి. ఉమామహేశ్వరశర్మ

ఇంది : ఛా! వెధవా నోర్మూయ్యి.

సూర్యం : లేకపోతే ఏమిటే అన్నీ ల్లొచ్చినయ్యి. ఏమిటాయన ప్రవర్తన?

గిరిజ : (అవమానంగా దుఃఖంతో రెండు చేతుల్లో ముఖం దాచుకొంటుంది టేబిల్ మీద.)

ఇంది : కొదురా. వుండు, నీ దుడుకుతనం నువ్వూనూ. మీ నాన్నగారొచ్చే వేళయింది. చెప్పిచూదాం. ఏమంటారో.

గిరిజ : ఎవరితోనన్నా చెప్పు. అయిన బుద్ధిని మార్చగల మేమిటి?

శాస్త్రి : (ఇందిరమ్మ భర్త ప్రవేశిస్తూ ఏమిట్రా! ఆ ధాంధూంలు. ఆఁ?

సూర్యం : (మౌనంగా తలవంచుకొని తండ్రిముఖంలోకి చూస్తాడు.)

గిరిజ : (నిట్టూర్పుస్తూ లేస్తుంది.)

ఇంది : లేస్తా వెందుకు కూర్చోవే (భర్తతో) అసలు కంగారూ ఇదండీ. మ పక్కింటి శర్మగారూ, ఎప్పుడూ మన గిరి వంక అదేపనిగా మొహంవాపిరిగా చూస్తూ టాడుట...

శాస్త్రి : ఓహో. (కూతురితో) పిచి దానా. అందుకేనా అంత ఇదిగావున్నావ్ (కొడుకుతో) ఏరా! అందుకేనా నీకం పౌరుషం పొడుచుకొచ్చింది?

సూర్యం : (నేలవంక చూస్తూ) ఔన

శాస్త్రి : ఊహూ. సరేకాని నువ్వెన్ని మాట్లు గరల్ స్టూడెంట్స్ వంక చూడలేదూ నిజం చెప్పు.

సూర్యం : (తలెత్తి బొమముడితో ఎప్పుడైనా ఓమాటైతే...

శాస్త్రి : ఓహో! ఓ మాటైతే సభ్యతా పదిమాట్లైతే అసభ్యతా నా?...ఆఁ!

సూర్యం : (పెడముఖంగా) ఏమనా


(56-వ పేజీ చూడండి)



★

జూపిటర్‌వారి
హింది చిత్రం
"నయా
అద్మీ"లో
బొంబాయి
నర్తకి హెలెన్

★








రఘువీర్ చిత్రనికేతన్ వారి 'పారిజాత శక్తి'లో ఆశామధుర్



"జి. పి. సిప్పీ నిర్మించిన శ్రీమతి 420"లో మీనా షోరీ



ఇటీవల విడుదలఅయిన రాజశ్రీవారి 'జయం మనదే'లో అక్. నాగేశ్వరరావు, అంజలి.

బొంబాయి సినిమా లేఖ

చలనచిత్రసీమలోవారి ప్రతిష్ఠకు కళంకం అని చెప్పకోతగ్గ సంఘటన ఒకటి మొన్న తెలియవచ్చింది. ఇటువంటివి ఇంకా అడపా తడపా జరుగుతూ ఉండడం శోచనీయం...

ఎగువ బొంబాయి సెకండరీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శ్రీ ఎ ఎ ఇనాందార్, ఆయనతోటి ఉపాధ్యాయులు కొందరు కలసి, క్రిందటినెల చెంబూర్‌లో రాజ్ కపూర్ స్టూడియోకి వెళ్ళారు. ఆ సంఘం ఈమధ్యనే కొన్ని సహాయ కార్యక్రమాలకు నిధి పోగుచేసే నిమిత్తం రాజ్ కపూర్ సంస్థ చలనచిత్రాలు రెండు ఉచితంగా సంపాదించి ప్రదర్శించారు. ఈ సహాయానికి కృతజ్ఞత తెలిపే నిమిత్తం ఈ సంఘం కార్యవర్గం రాజ్ కపూర్ నర్గీసలకు విందు చేయ నిశ్చయించుకున్నారట. ఘనులుగా పేరుమోగనివారు, లిమోజిన్ కారులేనివారు, మామూలుగా ఇటువంటి సందర్భాలలో తెరతారల దర్శనం సంపాదించడానికి పడే అవస్థలన్నీ పడి, ఈసీమలో మర్యాదలన్నీ చవిచూసి, మొత్తానికి రాజ్ కపూర్‌ను కలుసుకోగలిగారు. భారతీయ ఆధ్యాత్మిక సంపద, సోవియట్ రష్యా, బౌద్ధమత ప్రశస్తి, ఆపైన మన సాంస్కృతిక విభవం మొదలైన విషయాలపై అభిప్రాయాలు విన్న తరువాత ఉపాధ్యాయులు తాను వచ్చిన పని వివరించారు. రాజ్ కపూర్ అంగీకరించారు

ఉపాధ్యాయబృందంపరమ సంతోషంతో తిరిగి వచ్చి, విందుకు సన్నాహాలు చేసుకున్నారు. ఫలానా తేదీన రాజ్ కపూర్ నర్గీస్‌లు తాము చేసే విందుకు రాబోతున్న సంగతి గుర్తుగా వ్రాసుకోవలసిందని రాజ్ కార్యదర్శికి జ్ఞాపకంచేసి, ఆపైన, మళ్ళీ, ఉత్తరాలద్వారాకూడా ఆ ఏర్పాటు ఖాయపరచుకొన్నారు. విందు ఇంక రెండు రోజులుండనగా మళ్లా ఓఇద్దరు ప్రతినిధులను పంపి, రాజ్ తప్పక రాగలడని మాట తీసుకున్నారు.

తీరా విందురోజున, గౌరవ అతిథులు ఇద్దరూ గైరుహాజరయ్యారు. విందు ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ సభ్యులు 35 మందీ ఆరోజున తాజ్ మహల్ హోటల్‌లో వేచి వేచి విసుగెత్తి వెళ్ళిపోయారు. ఆతరవాత కనుక్కుంటే వారికి తెలియవచ్చిన కోగట్టా—రాజ్


కపూర్ ఆరోజున ఖాండ్లా వెళ్ళారు. నర్గీస్ జూహూ వెళ్ళింది.

*　　*　　*

తార మీనా షోరీ తనభర్త రూప్. కె. షోరీని వదలిపెట్టి పాకిస్తాన్‌కు తరలి వెళ్ళిపోయినట్లు తెలుస్తున్నది. షోరీ ఈమెకు నాలుగవ భర్త. సొహ్రాబ్ మోడీ చారిత్రక చిత్రం 'సికందర్' లో తొలిసారిగా వెండితెరమీద కనబడ్డ మీనా అప్పటినుంచిక్రమంగా మంచి నటిగా పేరు సంపాదించి పైకి వచ్చింది. చిన్నప్పుడే మీనా తల్లితండ్రులు గతించారు. ఆ వయసులో కొన్నాళ్ళు ఒకరింట నౌకరీకూడా చేసి పొట్ట గడుపుకున్నట్లు ఆమె చెబుతుంది. తరువాత, ఆమె శ్రేయోభిలాషి ఒకరు, లాహోరు తీసుకువెళ్ళారు. అక్కడినించి బొంబాయి వచ్చి, సినిమాలలో చేరడానికి ప్రయత్నించింది మీనా. ఎన్నో అవస్థలుపడి, మొత్తంమీద అవకాశం సంపాదించింది. తన ప్రతిభ ఋజువు చేసుకొని తారాపథం ఆరోహించింది! ఒక విశేషం ఏమిటంటే, మీనా షోరీకి అక్షర జ్ఞానం లేదు. సంతకం చెయ్యడం చేతకాదు. అయితే, చిత్రకళలో ఆమెకు మంచి ప్రతిభ ఉంది. వాళ్ళింట్లో టెలిఫోన్ గైడులో పేర్లు గుర్తుపట్టడానికి ఈ విద్యే ఆమెకి తోడ్పడేది. ఒక్కొక్కరి పేరు చదివించుకుని, ఆ పేరుకి ఎదురుగా పేరుగల ఆసామి బొమ్మను చక్కగా వేసుకుంటుంది. కావలసినప్పుడల్లా ఆ బొమ్మసాయంతో నెంబరు తెలుసుకుని, ఫోను వాడుతుంది. ఆఖరికి చాకలికి బట్టలు వేసినపుడూ అంతే, ఏ రకం బట్టలకి బొమ్మలు వేసి, గుర్తు వ్రాసు



చందపిక్చర్స్ వారి 'సౌభాగ్యవతి'లో రంగారావు



"ఝనక్ ఝనక్" నృత్యదర్శకుడు శ్రీ గోపీకృష్ణ ఇటీవల మద్రాసు వచ్చినసందర్భంలో కథక్‌నృత్యప్రదర్శనా లిచ్చారు. ఈయన రిపబ్లిక్ పిక్చర్స తొలిచిత్రానికి నృత్యదర్శకుడుగా పనిచేస్తారు. ఈచిత్రం దర్శకుడు శ్రీ బి. ఎస్. రంగా, శ్రీ గోపీకృష్ణ, నిర్మాత శ్రీ సి. సీతారాం

కుంటుంది ఈ సంగతి, ఆమె అమాయకత్వం, మంచితనం చూసి లోకువ కట్టిన చిత్రనిర్మాత ఒకసారి ఆమెకి పెద్ద టోకరా ఇచ్చాడట. కల్లబొల్లికబుర్లు నాలుగు చెప్పి, ఒక కాగితంమీద ఆమె చేత వేలుముద్ర వేయించుకున్నాడు. ఆ తరవాత, ఆమె తన చిత్రంలో నటించినందుకు రావలసిన డబ్బు ఇవ్వమంటే, ఇచ్చాను పొమ్మన్నాడు. అదేమిటయ్యా అంటే, అంతక్రితం వేలుముద్ర వేయించుకున్న కాగితం చూపించాడు. ఆమెకి రావలసిన పైకం అంతా అందినట్లుగా అందుమీద వ్రాసిఉంది!

మీనా ఇప్పటికి నాలుగుసార్లు పెళ్ళి చేసుకుంది. ఆమె మొదటి భర్త అల్ నజీర్. నాలుగో భర్త దర్శకనిర్మాత రూప్. కె. షోరీ మిగతా ఇద్దరి పేర్లూ జ్ఞాపకంలేవని మీనాయే అంటుంది. మీనా ఒక చిత్రంలో నటించే నిమిత్తం పాకిస్తాన్ వెళ్ళింది. అందచందాలు, ఆకర్షణగల తార కాబట్టి, అక్కడ తారలు తక్కువగా ఉన్నారు కాబట్టి, పాకిస్తాన్‌లో ఈమెకు చాలా చిత్రాలలో నటించే అవకాశం ఉంది. అందువల్ల బహుశా అక్కడే స్థిరపడవచ్చును.

*　　*　　*

సునహారేదిన్, షెహనాయ్, శాంతి, ఖిచ్డీ, సర్గం ప్రభృతి చిత్రాలలో నటించి ఒకనాడు బాక్సాఫీస్ తారగా వెలిగిన రెహానా కూడా, ఇక్కడ మూటా ముల్లె సర్దుకుని, తల్లి షాజహాన్ బేగంను వెంటబెట్టుకుని పాకిస్తాన్‌కు ప్రయాణమై వెళ్ళిపోయింది. రెహానాను పైకి తెచ్చిన వ్యక్తి పి. ఎల్. సంతోషి. ఆమె నటించిన చిత్రాలకు ఆయనే దర్శకుడుగా పని చేశారు.

*　　*　　*

జూపిటర్ పిక్చర్స వారి "నయా ఆద్మీ" సిప్పీ ఫిలింస్ వారి "శ్రీమతి 420" మొన్న ఇక్కడ విడుదల అయ్యాయి.

అంజలీదేవి, రామారావు, నాగేంద్రరావు, జమున, రాజసులోచన బొంబాయి నటులు అన్వర్ హుసేన్, గోప్ ఇందులో పాల్గొన్నారు. రాగిణి, సాలెన్‌ల నృత్యాలతో, మంచి సంగీతంతో, పదునైన సంభాషణలతో, ఈ చిత్రం ఆకర్షవంతంగా రూపొందింది. కథ నడిపడంలో, దర్శకుడు సి. పి. దిక్షిత్ మంచి చాకచక్యం ప్రదర్శించారు. నిజానికి, ప్రతిభావంతమైన దర్శకత్వం ఈ చిత్రానికి ఒక భూషణ విశేషం అని చెప్పవచ్చు. అన్నీ బాగా నేసినా, ఛాయాగ్రహణం బాగా దెబ్బతింది. ముఖ్య



అహమదాబాద్‌లో ఇటీవల సినిమాతారల క్రికెట్ మాచ్ జరిగింది. ఫలహారాల వేళ కబుర్లు చెప్పుకుంటున్న త్రయం రాజకపూర్, దిలీప్, నర్గీస్.

భూమిక ("వేలకారి")ను నిర్వహించిన అంజలీదేవి నటన ఉత్తమంగా ఒప్పింది

జి. పి. సిప్పీ నిర్మించిన "శ్రీమతి 420" హాస్యరసప్రధాన చిత్రం. స్వైరవిహారులైన పురుషులను హేళనచేసే ఈ చిత్రంలో "నాయక" భూమికను మీనాషోరీ అత్యంత చైతన్యస్ఫూర్తితో నిర్వహించింది 'స్వేచ్ఛావిహారి'గా జానీవాకర్ నటన మాత్రం చాలా నిరుత్సాహకరంగా ఉంది ఎక్కడా కొత్తదనం లేదు. జానీవాకర్‌కు పోటీదారుగా ఓంప్రకాశ్ నటన కూడా ఏమీ ఒప్పలేదు. అసలు, ఆ భూమికకు ఓంప్రకాశ్ విగ్రహం గాని, తరహా గాని తగినవి కావు. ఓ. పి. నయ్యార్ కూర్చిన సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ.

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి)

* * *

లండన్‌లో భారత చలన చిత్రోత్సవాలు

లండన్‌లో ఇటీవల వారంరోజులు జరిగిన భారతచలనచిత్రప్రదర్శనోత్సవంలో ఫిలింస్తాన్ వారి చిత్రం ''జాగృతి'' ఉత్తమ చిత్రంగా ఎన్నికయింది

లండన్‌లో స్కాలా థియేటర్‌లో ఈ ఉత్సవం జరిగింది. రోజుకు సగటున 600 మంది వివిధ చిత్రాలను ఎన్నిక చేస్తూ ఓట్లు వేశారు. ఈ ఎన్నిక ఫలితాలు: ఉత్తమ చిత్రం జాగృతి. దర్శకత్వం - శ్రీ సొహ్రాబ్ మోడీ (మీర్జా గాలిబ్), కథ- శ్రీ సలీల్ చౌదరి (దో బిఘా జమీన్) సంగీతం: శ్రీ సి. రామచంద్ర (అనార్కలీ), నటుడు-శ్రీ భరత్ భూషణ్ (మీర్జా గాలిబ్) నటి వైజయంతిమాల (నాగిన్)

* *

"పథేర్ పాంచాలి"

మానవుల సుఖదుఃఖాలను చిత్రించిన వానిలో అత్యుత్తమ చిత్రంగా "పథేర్ పాంచాలీ" అనే బెంగాలీ చలన చిత్రానికి కాన్స్ చలన చిత్రోత్సవ సంఘం బహుమతి ఇచ్చింది

ఈ చిత్రం డిస్ట్రిబ్యూటర్ శ్రీ హితేన్ చౌదరి సంతోషం వెలిబుచ్చుతూ, దర్శకుడు శ్రీ సత్యజిత్ రాయ్ ప్రతిభకు తామంతా గర్విస్తున్నామన్నారు.

ఏప్రిల్ 9వ తేదీ సంచిక 32వ పుటలో చిత్రం క్రింద "గ్రేస్ కెలీ, ఆమె భర్త మొనాకో ప్రభువు మూడవ రెయినర్" అని వివరింపబడింది. అది 'స్వాన్' అనే చిత్రంలోనిది. గ్రేస్ కెల్లీ పక్కనున్నవాడు, నటుడు అలెక్ గిన్నెస్ అని గుర్తించ ప్రార్థన.

పుష్కరం-ప్రభాకరం

ఆఫీసు పనిలో పూర్తిగా నిమగ్నుడు కావటంవల్ల మధ్యాహ్నం మూడు గంటలు దాటినా కాఫీకి బయలుదేరలేదు ప్రభాకరం. కాని కడుపులో కొంచెం కలవరం బయలుదేరగానే టైముకోసం ఎదురుగానున్న గోడగడియారం చూశాడు. దాని ప్రకారం టైం పదకొండు గంటల పదిహేను నిముషాలుమాత్రం అయ్యింది. అక్కడితో రెండు ముళ్ళూ సమ్మె చేశాయి అతనికి నవ్వొచ్చింది. పాపం! అది ఎంత కాలంనించి ఈ ఆఫీసులో పడివుందో! దాని బాగోగులు చూసే ఆఫీసరే లేడు అయినా ఆఫీసరుకు ఇందులో టైము చూసుకోవలసిన అగత్యం ఏం వుంది గనుక!- షుమారు ఏ నాల్గుగంటలకో షికారువచ్చినట్లు వచ్చి, తనకొరకు ప్రత్యేకించబడిన గదిలో కూర్చొని ఏవో నాల్గు సంతకాలు చేసిపోతూ ఉంటాడు.

"ఏమోయ్! పనిలో మునిగి, నిద్రాహారాలు మాని వాయుభక్షణ చేస్తావా? ఏమిటి?" అని ప్రక్కసీటులోఉన్న తోటి గుమస్తా మధు ప్రశ్నించగానే,

"టైం తెలియలేదు; ఎవరేనా అడిగితే ఇప్పుడే కాఫీ త్రాగటానికి వెళ్ళానని చెప్పు!" అని బయలుదేరాడు ప్రభాకరం.

"మరేం ఫర్వాలేదు - నెమ్మదిగా కాఫీ త్రాగి రా. ఈ గడియారాన్ని నమ్ముకుంటే తిన్నగా తీసుకువెళ్ళి గోదావరిలో ముంచుతుంది. దాని ఉపయోగం మన మేనేజరు గారికి మాత్రమే. దాన్ని పుష్కరం ఎగ్జిబిషన్‌లో పెట్టి - వచ్చిన డబ్బుతో అయినా బాగుచేయించాలి" అని ఓ చెణుకు విసిరాడు మధు.

"దాని ఉపయోగం మన మేనేజరుగారికి మాత్రమే!" అనగానే చుట్టూఉన్న గుమస్తాలంతా నవ్వారు. దానికి కారణం ఉంది.

వెనక ఒకసారి మేనేజరు గడియారం ఆగిపోయిన సంగతి గుర్తించకుండా, మధుని- సరిగ్గా పదకొండు గంటలకి వచ్చినా-"పదిహేను నిముషాలు లేటుగా వచ్చావు. లేటు మార్కు చేస్తాను" అన్నాడు.

"నా వాచీలో సరిగ్గా పదకొండుగంటలు అయ్యింది. ఇది రేడియో టైమ్ ప్రకారం తిరుగుతోంది" అన్నాడు మధు. అందరిలోకి ధైర్యంగా మాట్లాడేవాడు మధు ఒక్కడే.

"రేడియో టైమ్-రైల్వే టైమ్ ఎవరిక్కావాలి-ఆఫీసు టైం ప్రకారం మార్చుకో. అందరూ కాస్త ముందు రావటంలా?' అని- ఇంకా కోపం తీరక ఆఫీసరుతో రిపోర్టు చేశాడు. ఆఫీసరు మధుని పిలిపించి: "ఏమోయ్ ఆలస్యంగా రావటమే కాకుండా, మేనేజరుని ఎదిరిస్తావా?" అని

రాజవరపు పార్థసారథి

అడిగాడు. అప్పుడు మధు "ఒక్క నిమి-తమరు ఒకసారి హాలులోకి దయచెయ్యండి" అని వినయపూర్వకంగా కోరి, ఆఫీసరుని తీసుకువచ్చి గడియారం చూపెట్టాడు.

ఆఫీసరు నవ్వుతున్నాడు.

"ఇది ఏ రాత్రో ఆగిపోయి వుంటుందండి. అది చూడకుండా అనవసరంగా నన్ను అంటే ఎల్లాగ?" అన్నాడు. మేనేజరు కోపంతో బంట్రోతు సన్యాసిని పిలిచి-కీ ఇవ్వమన్నాడు. గడియారం ముళ్ళు బాగా కదలటం మొదలెట్టాయి...రెండో రోజున సరిగా అదే టైము దగ్గర ఆగిపోయింది. మధు మేనేజరుకు చూపించి "మన గడియారంలో ప్రత్యేకత చూశారా?" అన్నాడు. ఆ రోజునించీ మధు అంటే లోపల కొంచెం మంటగా ఉన్నా పైకి ఏమనడానికి జంకుతాడు.

అసలు మధు దగ్గర వున్న విశేషమే అది. ఎంత పనివున్నా కంగారు పడడు. ఇంట్లో ఏమీ లోటు లేనట్లు హాయిగా కబుర్లు చెబుతాడు. ప్రపంచంలో కల్లా సుఖంగావున్న వాడిలా వుంటాడు. మరి తను అల్లాగ కాడు ప్రతిదానికీ బాధపడతాడు. ఎంత ప్రయత్నించినా తనస్వభావం మార్చుకోలేకపోతున్నాడు.

ఇల్లాగ ఆలోచిస్తూ-దగ్గరలోవున్న హోటలులో కాఫీ త్రాగుతుండగా - "హల్లో!" అని ఎవరో భుజంమీద చెయ్యి వెయ్యటముతో వెనక్కు తిరిగాడు. ఫుల్‌సూట్‌లో

తన మిత్రుడు సత్యం. కళలప్రశ్నలు విన తర్వాత-అమెరికా రిసెర్చి ఇన్‌స్టిట్యూట్లో సీటు వచ్చినట్లూ-ప్రభుత్వం పంపుతున్నట్లూ-వచ్చేనెల మొదటివారంలో ప్రయాణం అనీ చెప్పాడు. ఇద్దరు విడిపోతుండగా - సత్యం అన్నాడు "ప్రభాకరం! అన్నట్టు వొక విషయం జ్ఞాపకం వచ్చింది. రేపు వచ్చే గోదావరి పుష్కరాలకు మా-అమ్మ వస్తానంటోంది. నువ్వున్నావుగా! శ్రమ అనుకోకపోతే పుష్కరాలకి మీ ఇంటికి పంపుతాను, నాకు ప్రయాణం వుంది. ఆమెకు తోడు ఎవరూ ఉండరు; అందుకు. లేకపోతే నీకు ఈ శ్రమ ఇవ్వను."

"ఓ! అంతకంటేనా! తప్పకుండా పంపు" అన్నాడు ప్రభాకరం.

తిరిగి ఆఫీసుకి వచ్చేసరికి "నీకు ఉత్తరాలు వచ్చాయి" అని రెండుకవర్లూ, వొక కార్డు ఇచ్చాడు మధు. ప్రభాకరం ఆశ్చర్యపోయాడు. తను ఉద్యోగంలో చేరి రెండు సంవత్సరాలు దాటినా-మచ్చుకి ఒక ఉత్తరముకూడా ఆఫీసుకి రాలేదు. తనూ వ్రాయటము మానుకున్నాడు. ఎప్పుడైనా వస్తే ముఖ్యులదగ్గరనుంచి ఇంటికే వచ్చేవి. తరుచు ప్రతివాళ్ళు ప్రత్యక్షంగా కలుసుకుంటున్నప్పుడు-పరోక్షంగా ఉత్తరాలువ్రాయవలసిన అవసరం ఏమిటి? మొదట కార్డు చదువుదామని ఉపక్రమించాడు. ఎవరు వ్రాశారోగాని కార్డువిలువ పూర్తిగా వినియోగించుకున్నారు. ఉత్తరం చూస్తే విజయనగరం నుంచి వచ్చింది. తనకు తెలిసినంతమటుకు విజయనగరంలో ఎవరూ లేరు. ఎడ్రసు సరిగ్గా తనదే. చదవడం మొదలెట్టాడు.

"చి॥ ప్రభాకరం అల్లుడిని దీవించి మీ అత్తయ్య వ్రాయునది—

క్షేమం. అచట నీవు, అమ్మాయి కులాసాగా ఉన్నారని తలచెదను. మీ అమ్మపోయిన సంగతి తెలుసుకొని చాలా విచారించినాను. మీ నాన్న పోయినదగ్గరనించీ-జాగ్రత్తగా కంటికి రెప్పలా కాపాడుతూ పెంచుతూ వచ్చింది ఆమెకూడా పోవటం నీ దురదృష్టం. నీ చిన్నతనంలో నన్ను చూశావు. బహుశా, అంత గుర్తుండకపోవచ్చు. అయినానూ వచ్చి పోతుం టేనే బంధుత్వాలు. మీ నాన్న పెదతండ్రి—మా నాన్న తోడిఅల్లుళ్ళు. చిన్నప్పుడు మీ నాన్న—మేము అంతా అనుకొనేవాళ్ళం. నీకు వివాహం అవటం—ఉద్యోగంలో చేరటం-మొదలయిన విశేషాలు-వ్యాపారరీత్యా మీ రాజమండ్రి వచ్చిన పన్నయ్యద్వారా తెలుసుకొన్నాను. నిన్ను చూడాలని వుంది. కొత్తకాపురం కష్టమే. గోదావరి పుష్కరాలు ఇక బారమేగా వుంటు. తప్పకుండా వస్తాను.

గ్రహించవలెను,
సత్తెమ్మ వ్రాలు"

ఎవరో ఈ సత్తెమ్మ మొదట అర్థం కాలేదు. తరువాత బాగా ఆలోచించగా అమ్మ ఏదోసందర్భంలో అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి. "విజయనగరంలో సత్తెమ్మ అని ఉంది. ఆస్తేమానూ డబ్బు కావలిస్తే-మీ నాన్న దగ్గరకి వచ్చి తీసుకుపోయేది. పరమ కిరాతకురాలు. సుమారు వెయ్యి రూపాయలవరకూ బాకీవుంది. మీ పెదనాన్న "దానికి డబ్బు ఇవ్వవద్దు" అంటే—మీ నాన్నకు, పెదనాన్నకు దెబ్బలాట పెట్టింది అదే!—అన్నదమ్ములకి, తండ్రి కొడుకులకి గృహాంలోనే కలహాలుపెట్టి ఆనందిస్తుంది. దాని కళ్ళుపడిన కాపురం ఒక్కటే బాగుపడలేదు. ఎప్పుడేనా అలాంటివాళ్లు నీ జీవితంలో తటస్థపడితే - చాలా జాగ్రత్తగా ఉండు."

దాని స్వభావం ఆ వుత్తరం చదివితేనే తెలుస్తుంది-అనుకున్నాడు.

తరువాత ఒకకవరు విప్పాడు. అది తన పెదతండ్రి కొడుకు సుబ్రహ్మణ్యందగ్గరనించి వచ్చింది. వాడు చాలదూరంగా రైల్వేలో పనిచేస్తున్నాడు. చిన్నప్పుడు ఇద్దరూ ఒక కంచంలోతిని, ఒకేచోట చదువుకునేవారు. గోదావరిపుష్కరాలకి వస్తానని వ్రాశాడు. ఎన్నిసార్లు రమ్మనివ్రాసినా శెలవు దొరకదు అనేవాడు. పోనీ పుష్కరాల ధర్మమా అని అయినా కలుసుకోవచ్చు.

★ పుష్కరం - ప్రభాకరం ★

ఇంకో కవరు విప్పాడు. అది తన అక్కయ్య శ్యామల వ్రాసింది.

"చి॥ ప్రభాకరం తమ్ముడిని దీవించి వ్రాయునది—

ఇచట అంతా క్షేమం. అచట నీవు, వదినె కులాసాగా ఉన్నారని తలుస్తాను. ఈమధ్య నీదగ్గరనించి అసలు ఉత్తరములు లేవు. మీ బావగారిని వ్రాయమంటె — ఆయనకు శ్రద్ధ తక్కువ. మిమ్మల్ని చూసి చాలా కాలమయింది. గోదావరి పుష్కరాలకి వద్దామని వుంది. మళ్లీ పుష్కరాలకి ఎల్లాగ ఉంటామో? "డబ్బు దండుగ ఎందుకూ?" అని మీ బావగారు అంటున్నారు. నువ్వు రాజమండ్రిలో ఉంటున్నావు గనుక, పల్లెటూరిలో రాజమండ్రికీ, గోదావరికి దూరంగా ఉంటే — చూసేదీలేదు, "మీ తమ్ముడు తీసుకువెళ్తే నా అభ్యంతరం లేదు" అంటున్నారు. గనుక, నువ్వు ఒక యాభైరూపాయలు పంపవలెను. పుష్కరాలకి నేను, పిల్లలూ వస్తాము. బావకు తప్పకుండా ఉత్తరము వ్రాయవలెను.

నీ అక్కయ్య
శ్యామల."

ఒక పెద్దనిట్టూర్పువిడిచి, అబ్బ! నాన్నగారుంటే అక్కయ్యకు అన్ని ముచ్చట్లు తీరేవి. పాపం! కాపరానికి వెళ్లిన తరువాత ఎప్పుడూ డబ్బు అడగనేలేదు. బావ చాలా మంచివాడు. డబ్బున్నవాళ్లే అయినా, అంత ప్రేమగా, అత్తవారిని డబ్బు అడగనివాళ్లు ఎవరు ఉంటారు. ఇప్పుడేనా డబ్బు పంపకపోతే - తన బ్రతుకు నిష్ప్రయోజనం. కాని డబ్బు యొక్కడిది? వచ్చేజీతమే దిక్కు. "మళ్ళీ పుష్కరాలకి ఎల్లాగ ఉంటామో" ఆమాటలు ములుకుల్లా గుచ్చుకుంటున్నాయి. ఎల్లాగ అయినా పంపాలి అనుకున్నాడు. మతిపోయినట్లయింది. ప్రొద్దుట ఆఫీసుకు వచ్చేటప్పుడు "బొగ్గులు అయిపోయాయి. కొన్ని సరకులు నిండుకున్నాయి. సాయంత్రం పెందరాళే రండి!" అన్న పద్మమాటలు జ్ఞప్తికి వచ్చాయి.

సాయంత్రం కాగానే ఆఫీసునించి ఇంటికి బయలుదేరాడు. బుర్రలో ఆలోచనలు తిరుగుతున్నాయి. ఇంటికి సరుకులు తీసుకువెళ్లాలి. బొగ్గులు లేకపోతే వంట ఎల్లాగ చేస్తుంది? ఇంకా పది రోజులు గడిస్తేనే కాని జీతాలు అందవు. ఈ పట్టణంలో డబ్బు అప్పు ఎవరు ఇస్తారు? ఏదేనా వస్తువు తాకట్టు పెడితేనేగాని-మనిషి విలువనుబట్టి ఎవరూ ఇవ్వరు. తాకట్టు అనగానే పద్మ వంటినిండా నగలలో చిరునవ్వు నవ్వుతూ ఒక మెరపులా మెరిసింది. ఛ! అంత నీచపు పనికి వడిగట్టను. పాపం! అవసర మొచ్చినప్పుడు మధు సహాయం చేస్తున్నాడు. మొన్ననేగా పదిహేను రూపాయిలు అతని దగ్గర పుచ్చుకుంట. అతనికి మాత్రం ఎక్కడినించి వస్తుంది?

తన చేతివాచీ ఇచ్చి అమ్మి పెట్టమన్న వాచీడీలరు రత్నం మెదడులో మెదిలాడు. అదృష్టం వుంటే ఈ పాటికి అమ్మి ఉండవచ్చు. అసలు డబ్బు లేకపోవటంవల్ల మరో దారి లేక—పద్మ ముచ్చటతో కొని పెట్టిన వాచీ అమ్మడానికిచ్చాడు. వాచీ లేక [illegible] గోడ గడియారం [illegible] గతి పట్టింది. కాని అమ్మక తప్పదు. తిన్నగా రత్నం వాచి హాస్పిటల్ దగ్గరకి బయలుదేరాడు. ఆలోచనలు ఒకదానివెంట మరొకటి తరంగాల్లా వస్తున్నాయి.

ఆదేం ఖర్మమోగాని — తను రాజమండ్రిలో కాపురంపెట్టిన దగ్గరనుంచి, అతిథిలేకుండా (చుట్టం) ఒక్కపూటకూడా భోజనం చెయ్యలేదు. రాజమండ్రికి అతి ప్రాముఖ్యత వుందికదూ ?-వాణిజ్యకేంద్రం. ఏదోపనిమీదవచ్చి "కులాసాగా ఉన్నావా! చూడటానికి వచ్చాను." అని భోజనం చేసిపోతూ వుంటారు. కావలసినవాడు ఒక్కడు కాడు. తన చుట్టాలపేరు, తండ్రిపేరు, తల్లిపేరు చెప్పి, "మీది ఎలాంటి కుటుంబం! మీ నాన్న ఎంతటి మహానుభావులు." అని ఏదో పొగిడి భోంచేసి వెళ్లిపోతారు. ఎప్పటికప్పుడు కఠినంగా, నిర్మొహమాటంగా ప్రవర్తించాలని అనుకుంటాడు. కాస్త భోజనం అయినా చెయ్యమనకుండా ఎలా వుండగలడు. అనడం తడవు వాళ్లు తిష్టవేస్తారు.

పెళ్ళి అయిన కొత్తకాపురం. చక్కగా పద్మ తనూ, హాయిగా రోజులు గడుపుతూ, తీయని తలపులతో, ఏదో లోకాలోకి తేలిపోదాం అనుకున్నాడు. గొప్పవాళ్ళకి మల్లే "హనీ-మూన్"కి ఎక్కడికీ పోకపోయినా- ఉన్నచోట అయినా అనుభవిద్దామని అనుకున్నాడు. తనకీ భార్యకీ అయితే వచ్చే జీతం సరిపోగా, ఇంకా మిగులుతుంది కూడా. కాని చుట్టాలమూలంగా, ఏదో పెద్ద కుటుంబం వున్నవాడిలా అప్పులు చేస్తూ బాధపడవలసివస్తోంది.

అల్లంతదూరంలో ఏదోగుంపు కనబడింది. చూస్తే అది నాలుగురోడ్ల జంక్షన్. ఒక మోటారు, సిటీబస్ కూడా ఆగిపోయాయి. ఏదో ప్రమాదం జరిగింది. అయినా ఇంత జనసమ్మర్దంగల ఇరుకు రోడ్డమీద అంత వేగంగా నడపటం ఏం పొగరు? అనుకుంటూ వెళ్ళేసరికి ఒక బట్టతల ఆసామీ, గిరజాల జుట్టూ గళ్ళలుంగీ గల మరొక ఆసామీ హోరాహోరీ పోట్లాడుకుంటున్నారు. కొంతమంది విడదీస్తున్నారు. విడదీసినకొద్దీ పుంజుల్లా ఎగిరెగిరి పడుతున్నారు. కొంతమంది నవ్వుతున్నారు. కేవలం కాలి బొటన వేళ్ళపై నుంచొని, ఇంకొకటి. భుజంమీద చెయ్యివేసి ఆతురతగా చూస్తున్న ఓ ఆసామిని—

"ఈ గలభాకు కారణం ఏమిటి?" అని అడిగాడు ప్రభాకరం.

"ఆ! ఏమీ లేదండి. అదిగో ఆ బట్టతలాయన అంటాడు ఫలానా తారీఖునించి గోదావరి పుష్కరాలు మొదలు అని. గిరజాల జుట్టువాడు అంటాడు. "ఛ! అది తప్పు—

పంచాంగ ప్రకారం ఈ తారీఖునించి-" అని నీ పంచాంగం తప్పు అంటే నీదే తప్పు అనీ - అది వ్రాసినవాడికేం తెలుసు. అంటే అది వ్రాసినవాడి కేం తెలుసు అనీ-చివరికి పంచాంగకర్తలని దూషిస్తూ - కొట్టుకోడం లోకి దిగారు" అన్నాడు.

"హుం! పుష్కరాల ప్రచారం" అనుకొని కనుదిరిగాడు. వాచీషాపు దగ్గరకు వెళ్ళగానే రత్నం అన్నాడు,

"ఎవరూ రాలేదండి. మీకు అంతగా డబ్బు అవసరముంటే నలభైరూపాయలు ఇస్తాను, ఇచ్చేయండి. అంతకంటే ఎక్కువ రాదు కూడా. కొన్ని పార్టులు అరిగి పోయాయి." అన్నాడు. అందర్లోకి నమ్మకస్తుడు కదా అని ఇచ్చాడు పార్టులు అరిగి పోయాయట. నూటఇరవై రూపాయలు ఖరీదైన వాచీకి, నలభైరూపాయలు ఇస్తాడా? ఎప్పుడూ వాచీ రిపేరుకికూడా ఇవ్వలేదు. పార్టులు రిప్లేస్ చేసివాచేస్తాడు. "అక్కర్లేదు?" అని వాచి తీసుకున్నాడు. తన ఆఫీసులో రత్నానికి ఒక ఉపకారం చెయ్యవలసివుంటే చేశాడు. ఆమాత్రం అభిమానముయినా లేదు. వ్యాపారలక్షణం. పోగొట్టుకో లేదు, అనుకొని తిన్నగా ఇంటికి వచ్చేశాడు.

"పద్మ! ఏమంటుందో. సరుకులు కూడా లేవాలి. పెందరాళే రమ్మంది." అని భయంగా అడుగులు వేసుకుంటూ వచ్చాడు. పద్మ తను అనుకున్నట్టు లేదు. సంతోషంగా గుమ్మందగ్గర ఎదురుచూస్తోంది. ప్రభాకరానికి కోపంవచ్చింది. ఇంట్లో ఏమీ లేక పోయినా, తను డబ్బుకి ఇంత ఇబ్బంది పడుతున్నా ఏమీ పట్టనట్లు-చక్కగా చీర సింగారించుకొని, తల్లో పువ్వులు తురుము కొని ఎదురుచూస్తోంది. వెంటనే తనను తాను నిందించుకున్నాడు. "సంతోషంగా ఉన్న భార్యను సంతోషపెట్టడంపోయి— కోపం తెచ్చుకోడానికి కారణం డబ్బులేక పోవడంకదా?" అనుకున్నాడు. తిన్నగా వెళ్ళి పడకకుర్చీలో జార్లబడి "ఏమిటి సంగతి?" అని అడిగాడు.

పద్మ ప్లాస్కులో కాఫీ పట్టుకువచ్చి "ఇదేమిటి పెందరాళె రావటం?" అని "దానికేంగాని— మీకో మంచి విషయం చెప్పనా?" "ఏమిటి?" అని ఆత్రంగా అడిగాడు. "ఈవేళ మాఅక్కయ్య సులోచన దగ్గరనించి ఉత్తరం వచ్చింది!" "ఏమని?- కాంపతీసి పుష్కరాలకి వస్తానని వ్రాసిందా?" "ఏం! రాకూడదా? అయినా మీకు ఎల్లాగ తెలిసింది?" "ఇదిగో" అని జేబులో ఉత్తరాలు మూడు ఇచ్చాడు ప్రభాకరం. ఆమె చదవటం మొదలెట్టింది.

అతను ఆలోచించడం మొదలెట్టాడు— సులోచన పేరు ఎత్తగానే ప్రభాకరం ఏకోలోకంలోకి పోయాడు. పాతస్మృతులు జ్ఞప్తికి వచ్చాయి. సులోచన కళ్ళల్లోకి చూస్తే—కదలనిలోతునీళ్ళలోకి తొంగిచూసి నట్లుంటుంది. ఆమె కళ్ళకేసి చూస్తుంటే యుగాలు గడిచిపోతాయి ఆమె అందం అంతా అక్కడే ఉంది. దానికి తగినట్లు మంచి అంగసౌష్ఠవం. పద్మకంటె అయిదు సంవత్సరాలు పెద్ద. ఇద్దరుపిల్లల్ని కన్నా కన్నెపడుచులా ఉంటుంది. చలాకీగాను, శుభ్రంగాను ఉంటుంది. కాని మగడుమాత్రం "ముష్టిఘాతంబులన్—బాహు దండంబులనే" అంటూ ఉంటాడు. ముఖంలో కళలేకపోయినా—కండలు గల మనిషే. తనకంటూ వయసే—మేష్టరీ గనక ప్రయివేట్లవలన సంపాదిస్తాడు. ఆమె ఎంత చలాకీగా హుషారుగా ఉంటుందో అతనంత నెమ్మది. భగవంతుడు ఎల్లాగ పరిపెట్టాడో- ఆమె, తనకి పద్మతో పెళ్ళిఅయిన కొత్తలో ఎన్నో వేళాకోళాలు ఆడేది. ఆమె కళ్ళతో తనకేసి చూస్తుంటే—ఎందుకో అప్పుడు సిగ్గుచేత బుర్రవంచుకు నేవాడు. "ఛ ఇవేం ఆలోచనలు—పాడు ఆలోచనలు—అనుకున్నాడు:

"అయితే మా అక్కయ్య రావడం మీకు ఇష్టంలేదా?" అని అడిగింది పద్మ.

"ఛ; ఛ; అల్లాగ అంటానా—కాని ఖర్చు ఎల్లాగ భరించడం?"

"మీరు తలచుకొంటే అదెంతపని!"

"ఆ ఆ!! అప్పటనూ తలచుకొంటునే ఉన్నా—దమ్మిడీ కూడా ఎక్కడా అప్పు పుట్టటంలేదు వచ్చేరాబడి కనబడదు."

"సరేగాని భోజనానికి లేవండి."

"భోజనమా?— బొగులు, సరుకులు లేవన్నావుగా!"

"బాగుంది! ఏమీ లేకపోతే! కాళ్ళు చాచుకుని కూర్చుంటానా!"

భోజనం చేసి కిళ్ళీ వేసుకుందామని జంక్షన్ దగ్గర పల్లయ్య కిళ్ళీబడ్డీ దగ్గరకు వెళ్ళాడు. ఆశ్చర్యం! ఎంతమార్పు! పల్లయ్య కిళ్ళీ కొట్టు పాలింతలు పెడల్పు చేశాడు. సోడాలకి డ్రింకులకి వేరు, చుట్టలు చుట్టడానికి ప్రత్యేకం బడ్డీ, సిగరెట్లకి బీడీలకి వేరు, కిళ్ళీలకి వేరు—నాలుగు భాగాలుగా చేసి పెద్దదుకాణంలా తయారుచేశాడు. ట్యూబ్‌లైట్లూ రంగురంగుల దీపాలూ అమర్చాడు. చూడటానికి కన్నులపండువుగా ఉంది.

"ఏమిటోయ్ ఇదంతా?" అని అడిగాడు ప్రభాకరం. "పుష్కరాలూ వస్తుంటేనండీ- చుట్టాల కుర్రాళ్లు వచ్చారు. ఉత్తినేకూర్చోపెట్టడ మెందుకు నాలుగు డబ్బులువచ్చే రోజులు— వాళ్ళని కొట్టులో పెట్టాను" అన్నాడు పల్లయ్య.

తనకంటె పల్లయ్య తెలివైనట్టు మెరుగు. బంధువులని పిల్చాడు. వాళ్ళని ఉపయోగించుకొని, తిండిపెట్టి,తద్వారా డబ్బు సంపాదిస్తున్నాడు. తను ఉన్న కొంపకూడా అమ్మి చదువుకి ఖర్చుపెట్టాడు. కాని ఏం లాభం. డిగ్రీ పేరు చివర తగిలించుకోడానికైనా అర్హతలేని ఉద్యోగం. అడబ్బు పెట్టి వ్యాపారం చేసుకున్నా బాగుండేది.

ఇంటికి వచ్చి పడుకున్నాడు. కాని నిద్రపట్టలేదు. పుష్కరాలకి ఏ విధంగా ప్రభుత్వం డబ్బు ఖర్చు పెట్టుతున్నదీ, ఏర్పాట్లు జరుగుతున్నవీ తలలో మెదిలాయి. ఆరోగ్యశాఖ, రక్షణశాఖ, అంతటపాలా శాఖలలో అదనంగా సిబ్బందిని వినియోగించి పనులకు ఆటంకం కలగకుండా శ్రద్ధ తీసుకుంటున్నారు. పుణ్యక్షేత్రాలు దర్శించడం కేవలం పుణ్యం వస్తుందనికాదు. ఆ ప్రయాణాల్లో బాధలుపడి కొంత అనుభవం సంపాదించి, తోటిమానవులపై కరుణాభావ సౌహార్ద్రంలో మెలుగుతారని. పుణ్యం అని పేరు చెబితేగాని రారు పల్లెజనం. ఈ గోదావరి పుష్కరాలకి దేశం నలుమూలలనించీ వస్తారు. డబ్బు చాలా ఖర్చుపెడతారు. చివరకు పిడతల్లో దాచుకొన్న డబ్బుకూడా ఖర్చుపెట్టి ఇళ్లకుపోయేటప్పుడు నీరసంగా పోతారు. ప్రతి పన్నెండు సంవత్సరాలకు గోదావరి పుష్కరాలు నదిపొడుగునా జరుగుతాయి- తూర్పుగోదావరిలో రాజమండ్రి ప్రసిద్ధి.

పుష్కరాలమాట దేవుడెరుగు. రాజమండ్రిలో ప్రతివస్తువూ ప్రియం అయిపోతాయి. గిరాకీ హెచ్చిపోతుంది. ఇళ్ల అద్దెలు పెరిగిపోతాయి. జీవించడం కూడా దుస్సహంగా ఉంటుంది - మాములుగా, సామాన్యంగా నివసించేవారికి ఇల్లాగ ఎంత మంది బాధపడుతున్నారో— అక్కయ్యకి డబ్బుపంపడం ఎల్లాగ? సుబ్రహ్మణ్యం వస్తాడు. సత్యంతల్లి వస్తుంది. డబ్బుంటె బాగా గౌరవించవచ్చు. ఇప్పుడు దమ్మిడీ లేదు. ఇల్లాగ ఊరుకుంటే అభాసుకూడా జరుగుతుంది.

మర్నాడు ప్రొద్దుటే మధు ఇంటికి వచ్చాడు ప్రభాకరం. మధు తన పిల్లాడిని వళ్లో కూర్చోపెట్టుకుని కబుర్లుచెప్పుకుంటూ కాఫీ త్రాగుతున్నాడు. ఆ దృశ్యం చూసి "ఎంత అదృష్టం?" అనుకున్నాడు. ప్రభాకరాన్ని చూసి "రా! మీఅన్నయ్యకూడా కాస్త కాఫీఇయ్యి!" అన్నాడు భార్యతో మధు.

★ పుష్కరం - ప్రభాకరం ★

"వద్దు; ఇప్పుడే త్రాగివచ్చాను," అని- ఇచ్చినకాఫీ త్రాగుతూ.

"ఓ ఇరవైరూపాయిలు కావాలి: ఉంటే ఇద్దు;" అని అడిగాడు ప్రభాకరం.

మార్చేమని, మారుగింటికివెళ్ళి—కొంత సేపటికి తిరిగివచ్చి, "ఇదిగో, కొంచం జాగ్రత్తగా ఖర్చుపెట్టు" అన్నాడు మధు.

"ఏం చెయ్యను? చుట్టాలబాధ ఎక్కువగా ఉంది. పుష్కరాలకి ఖర్చు ఎల్లాగో తెలియటంలేదు" అన్నాడు ప్రభాకరం.

"మొహమాట పడితే మొదటికే మోసం! నిర్మొహమాటంగా చెప్పెయ్యి, నేను చాలా ఇబ్బందిపడుతున్నానని - అల్లాగ చెప్పలేక పోతే— నీతరఫువాళ్ళు వస్తే మీ ఆవిడను సాధించమను. మీ ఆవిడతరఫువాళ్లు వస్తే నువ్వు సాధించడం మొదలెట్టు – ఆ దెబ్బతో పారిపోతారు" అన్నాడు వేళాకోళానికి మధు.

"ఛ! అవేం! మాటలండీ!" అంది మధు భార్య.

"పోనీ: ఆ పద్ధతి బాగోకపోతే - పుష్కరాలకి ఎక్కడికేనా దూరంగా పారిపో!" అన్నాడు — హాస్యానికి మధు.

అంతా నవ్వుకున్నారు. డబ్బు అప్పిచ్చి ఆదుకొన్నందుకు కృతజ్ఞత తెల్పి – ఇంటికి బయలుదేరాడు. మధు ఆఖరున అన్నమాటలు హాస్యానికే అయినా - మంచి సలహాఇచ్చినట్లు తోచింది ప్రభాకరానికి. ఎక్కడికైనా పారిపోవటంకన్నా గత్యంతరం కనబడలేదు. అవును! పుష్కరాలకి మామగారి ఇంటికి వెళ్తే—? పండగలకి కూడా ఎప్పుడూ శలవు దొరక్క వెళ్లడానికే పడలేదు. ఇప్పుడు ఏకోనిష్ఠంగా శలవుపెట్టి — పుష్కరాలకి అక్కడకువెళ్లడం మంచిదని నిర్ణయించుకొని, నిర్ధారణకు వచ్చాడు. ఓ ఎత్తు వేశాడు. ఆ విషయంలో కొంచం ముందుగ్గా పనిచేసింది బుర్ర. తిన్నగా ఆఫీసరు ఇంటికి వెళ్లి — ఇంటికి తిరిగివచ్చాడు.

"ఏమండీ: రోజూ ఈపాటికి వంట అవకపోతే గంపుకతి సేవారు. ఈ వేళ ఆఫీసుకు వెళ్లకేమిటి? అని అడిగింది పద్మ.

"శలవు పెట్టాను!"

"ఏం!"

"పుష్కరాలు నాల్గురోజులూ, మీ పుట్టింటివద్దగర గడుపుదామని."

"శలవు ఎన్నాళ్లు పెట్టారు! జ్వరం వచ్చినా శలవుదొరకదని ఆఫీసుకి వెళ్లేవారే?"

"ముందు ఓ నాలుగు రోజులు మాత్రం పెట్టాను. అక్కడినుంచి పొడిగించవచ్చు - ఇక్కడవుంటే ఎల్లాగ — చుట్టాలువాళ్లు వస్తారు."

"బాగానే వుంది—అందరూ పుష్కరాలకి పోలేదు డబ్బు ఖర్చుపెట్టుకుని వస్తారు- మనం దూరంగా పోతున్నాం," అని "పుష్కరాలకి అన్నదానం చేస్తే చెప్పలేనంత పుణ్యం వస్తుంది" అంది పద్మ.

తన అక్కయ్యవాళ్లు వస్తారు. పుష్కరాలకి రాజమండ్రిలో గడపాలని ఉన్నా - పుట్టింటికి అనడంతో అడ్డు పెట్టకుండా ప్రయాణం కట్టేసింది. ఇద్దరూ ప్రయాణం అయ్యారు.

* * *

ఎప్పుడూ మానకుండా ఆఫీసుకు సరియైన టైముకు వచ్చే ప్రభాకరం—ఆ రోజు ఆఫీసుకు రాకపోయేటప్పటికి అందరూ ఆశ్చర్యపోయారు. అందరిలోకీ మధు ఎక్కువగా బాధపడ్డాడు, ఆప్తమిత్రుడు కావటం వల్ల. సాయంత్రం ఆఫీసు వదలగానే తిన్నగా ప్రభాకరం ఇంటికివెళ్ళి కారణం తెలుసుకోవాలి అనుకున్నాడు.

మధ్యాహ్నం ఆఫీసరు రాగానే "ఈ రోజు ప్రభాకరం—ఆఫీసుకు రాలేదు— శలవు చీటికూడా పంపలేదు" అని రిపోర్టు చేశాడు మేనేజరు.

"నేనే శలవు ఇచ్చాను. ప్రొద్దుటే మా ఇంటికి వచ్చాడు. పాపం! వాళ్ల మామగారికి సీరియస్ గా ఉందిట—చావు బ్రతుకుల మధ్య ఉన్నాడట—వెంటనే వెళ్లాలి అంటే శలవు ఇచ్చాను—" అన్నాడు ఆఫీసరు.

ఆ సంగతి తెలుసుకొని మధు "పాపం! అతనికి అన్నీ కష్టాలే" అని లోపల సానుభూతి తెల్పాడు.

* * *

ముందు తెలియపర్చకుండా, అల్లుడూ అమ్మాయి బండి దిగటంతో రమణయ్యగారు కంగారుపడ్డారు. రమణయ్యగారు ఆ వూరికి మోతుబరి; బాగా డబ్బున్న రైతు.

"ఏమోయ్! కులాసాగా వున్నారా?"

"ఆఁ!"

"ఉద్యోగం బాగా వుందా? గొడవలు ఏమీ లేవుకదా?"

"గొడవలు ఏమీ లేవు. శలవు దొరికితే— నాల్గురోజులు విశ్రాంతి తీసుకోవచ్చని-" అన్నాడు ప్రభాకరం.

"మంచిపని చేశావు. శలవు పెట్టికూడా అక్కడెందుకు?—అవునుగాని రాజమండ్రిలో పుష్కరానికి ఏర్పాట్లు ఏమన్నా జరుగుతున్నాయా?"

"హుఁ. రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరం తప్పదన్నట్లు" అనుకుని—"ఏవో జరుగుతున్నాయిలెండి" అన్నాడు ప్రభాకరం.

లోపలికివెళ్లి కూతురువల్లవల్ల అసలు సంగతి, డబ్బుకి ఇబ్బందిపడుతున్నారని తెలిసి-నవ్వుకున్నాడు రమణయ్యగారు.

"పోనీ డబ్బు కావాలని వ్రాస్తే పంపనూ! అయినా అతనికి అదో పట్టుదల - నేను ఇస్తే డబ్బు పుచ్చుకోడు—పోనీలే. కట్నం ఎల్లాగూ పుచ్చుకోలేదు-ఆనక—ఓ వెయ్యి రూపాయలు ఇస్తాను. అవి బేంకులో వేసుకుని, అవసరమొంటే తీసుకుని ఖర్చుపెట్టుకోండి. ఇబ్బంది పడక," అన్నాడు రమణయ్యగారు.

బయటకు వచ్చి—"ఏమోయ్, ప్రభాకరం— పుష్కరాలు ఎల్లుండినుంచేకదా. రేపు ప్రయాణం పెట్టుకున్నాం. రాజమండ్రి వెళ్లి మళ్ళీ వద్దాం. మా అందరికీ సంతర్పణ చేస్తే చాలాపుణ్యం" అన్నాడు రమణయ్యగారు.

"అల్లాగే వెళ్దాం!—ఎంత మాట!" అన్నాడు ప్రభాకరం.

* * *

ఆరాత్రి పద్మను అడిగాడు "ఎల్లాగ?" అని.

"పుష్కరాలకు అయ్యే ఖర్చు నేను పెట్టుకుంటా గాని—ఈ వందరూపాయలు తీసుకుని ముందు మీ అక్కయ్యగారిక్కి టెలిగ్రామ మనిఆర్డరు చెయ్యండి, వెంటనే రమ్మని" అంది పద్మ.

* * *

శలవు పెట్టిన మూడోరోజుకి రాజమండ్రి వచ్చేశాడు ప్రభాకరం. ఆరోజు బజారులో తనూ, మామగారూ కలసి వెళ్తూండగా, ఆఫీసరుగారు, మధు, బంట్రోతు సన్యాసి ఎదురుపడ్డారు.

"మీ మామగారికి ఎల్లాగ వుంది?" అని ఇంగ్లీషులో అడిగాడు ఆఫీసరు.


"కులాసాగానే వున్నారు. అసలు జబ్బు ఏమీ లేదు. ఎవరో కిట్టనివాళ్లు వ్రాశారంట, ఆ వుత్తరం—మమ్మల్ని కంగారుపెట్టడానికి" అని జవాబు చెప్పాడు ప్రభాకరం

ఆఫీసరు ఇంగ్లీషులో అడిగినందుకు, గోదావరి మహాతల్లికి మనస్ఫూర్తిగా నమస్కారం చేశాడు. (రమణయ్యగారు ఇంగ్లీషురాని మహానుభావుడు)

తరువాత మధుకి జరిగిన సంగతి యావత్తు ఏమీ దాపరికం లేకుండా చెప్పాడు.

"నీకు గోదావరిలో స్నానం చేసుకుని-పుణ్యం కట్టుకోనే వ్రాత వ్రాసివుంటే— విధివ్రాత ఎవరు తప్పిస్తారు. నువ్వు ఎంత దూరం పోయినా మళ్లీ దగ్గరకు రప్పించింది. ఆ మహాతల్లి" అన్నాడు మధు.

అప్పటినుంచీ ఎప్పుడేనా చుట్టాలెక్కువగా వచ్చినట్లు చెప్పవలసివస్తే-"పుష్కరం - ప్రభాకరం" అని నవ్వుతాడు. మధు ప్రభాకరం తలవంచుకొంటాడు. ★


'ఓహా! లైఫ్‌బాయ్ సబ్బుతో
ఇప్పుడు స్నానం చేయుటఅవుసరం'
-అది సంతృప్తి కరమైన
శుభ్రతాభావమును కలిగించును!
LIFEBUOY
SOAP
LIFEBUOY
SOAP

వనితాలోకం

పిల్లల పరీక్షలు

ఇల్లిందల సరస్వతీదేవి

ఎవరిపిల్లలు కంటికి కనుపించినా "పరీక్షలయినాయా? ఫలితాలు తెలిశాయా? ప్యాసయినావా? అని ప్రశ్నించే సీజను ఇది. ఈ కాలములో పిల్లలను పిల్లలు పలుకరించినా, పెద్దలు పిల్లలను పలుకరించినా, పెద్దవాళ్ళు పెద్దవాళ్ళను పలుకరించినా పిల్లల పరీక్షలనుగురించే. శేషప్ప కళ్ళనీళ్లు తుడుచుకుంటూ వచ్చి చెప్పాడు. తన స్నేహితుడు శ్రీనివాస్ పరీక్ష పోయిందట. ఇంటికివస్తే తల్లీ తండ్రీ కోపము చేస్తారని కాలువలోపడి మునిగిపోయాడట. రెండో నాటికి శవము ఒడ్డుకు కొట్టుకొని వచ్చిందట, జనము కాలువ ఒడ్డున మూగారట. తల్లి చనిపోయిన పిల్లవాడిమీదపడి 'నాయనా, ఇంత అఘాయిత్యం చేస్తావనుకోలేదురా! పరీక్ష పోతే ముఖం చూపవద్దని బుద్ధి తక్కువయి అన్నానురా! కోపము తెచ్చుకొని బాగా చదువుకుంటావని ఆమాట అన్నానుగాని ప్రాణం తీసుకుంటావనుకోలేదు బాబూ!' అని ఏడుస్తున్నదట. శేషప్ప ఆ పిల్లవాడి మంచితనాన్ని తలచుకొని వెక్కి వె[illegible]స్తున్నాడు.

తల కొట్టుకొంటూ ఏవ తప్పిదా[illegible] ఆ తల్లి ఒప్పుకొని రాళ్లు కరగిపోయేటట్లు ఎంత విలపించినా ఆలకించేవారెవరు? ఆ పిల్లవాడి ప్రాణాన్ని తిరిగి తీసుకొనిరాగలిగినదీ, ఆ మాతృమూర్తి దుఃఖాన్ని ఉపశమింపచేయగలిగినదీ ఏదైనా ఉన్నదా?

మార్చి ఏప్రిల్ జంటమాసాలు విద్యార్థులకు ఆందోళన కలిగించేవి. మార్చి నెలారంభమునుండీ ఒక్కొక్క తరగతికీ ప్రారంభమయి, ఏప్రిల్ మాసాంతమువరకూ, ఇంచుమించుగా పాఠశాలలన్నిటిలోనూ, కళాశాలలలోనూ పరీక్షలు ముగిసిపోతాయి. కష్టపడి చదివిన విద్యార్థిగణము ఆందోళనలో పరీక్షా ఫలితాలకు ఎదురుచూస్తూ ఉంటారు. మెట్రికునుండి పై తరగతులఫలితాలు వెలువడటానికి కొంతకాలము పట్టుతుంది; కాని చిన్న తరగతుల పరీక్షాఫలితాలు పాఠశాలలు మూయబడక పూర్వమే తెలుస్తాయి.

పరీక్షలలో ఉత్తీర్ణులయిన విద్యార్థులు తల్లిదండ్రుల మెప్పులకూ సంతోషానికీ పాత్రులవుతారు; బంధుమిత్రుల ప్రశంసలకూ అభినందనాలకూ నోచుకుంటారు; సెలవులలో ఆనందముగా కాలము గడుపగలుగుతారు; ఉత్సాహముతో పురోగమించగలుగుతారు.

కాని—ప్రతి తరగతిలోనూ పరీక్షకు హాజరయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కాలేరు, కొంతమంది దిగబడిపోవటము సంభవిస్తూ ఉంటుంది. ఈవిధముగా దిగబడిన విద్యార్థులందరి పరిస్థితులూ ఒక్కమాదిరిగా ఉండవు; శ్రద్ధగా చదువనివారూ, చదివినా తలకెక్కనివారూ, విషయము చక్కగా తెలిసినా సమయానికి వ్రాయలేనివారూ, పరీక్షాకాలానికి జబ్బుపడినవారూ అనేకరకాలుగా ఉంటారు. పరీక్షలో ఉత్తీర్ణులుకానివారికి మరొకసారి పరీక్ష నడప

టము కొన్ని పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ ఆచారము. ఈ పరీక్షలలోకూడా ఉత్తీర్ణులు కానివారిని అదే తరగతిలో నిలిపివేయటము మామూలు. ఈపద్ధతులు కూడా ఇటీవల ఆచరణలోకి వచ్చినవే. పరీక్షాపత్రాలు పైపైనచూసి మార్కులు వేయటము, ఉదారహృదయముతో పరీక్షాపత్రాలను విలువకట్టటము ఇటీవల ప్రవేశపెట్టబడిన పద్ధతులు. ఇంత ఔదార్యము కనబరచినా ఉత్తీర్ణులు కాలేని విద్యార్థులకొరకు తిరిగి పరీక్షలు పెట్టటముకూడా మామూలాచారమే.

పరీక్ష తప్పిపోయిన విద్యార్థులలో తల్లిదండ్రులచేత అవమానముగాని, తిట్లుగాని పొందనివారు తక్కువసంఖ్యలో ఉంటారు. "పరీక్ష తప్పిపోయావుకదా! శ్రద్ధగా చదువుకొమ్మని ఎంతచెప్పినా విన్నావా? ఒక్క సంవత్సరము నష్టమయిపోవటమే కాకుండా ఎంతడబ్బు ఖర్చయినదనీ! వాళ్ళపిల్లలుచూడు! ఇంతవరకూ ఒక్క క్లాసులోనయినా తప్పిపోలేదు. నీమాదిరిగా ఒక్కొక్క తరగతిలో రెండూ మూడు సంవత్సరాలు నిలిచిపోయిన పిల్లలు ఎవరయినా ఉన్నారా? ఇంక నీకు చదువెందుకు? అంట్లగిన్నెలు తోముటమో గొడ్లను మేపటమో చేద్దువుగాని..." అన్న ధోరణిలో చీవాట్లు తినేవాళ్ళు కూడా ఉంటారు. తప్పిపోయిన విద్యార్థులు పరీక్ష పోవటమువల్ల కలిగిన విచారముతోపాటు ఈ చీవాట్లతో మరింత క్రుంగిపోతారు. ఇవే మరికొన్ని సందర్భాలలో విద్యార్థులు ఇళ్లనుంచి వెళ్లిపోవటానికీ, ప్రాణత్యాగము చేయటానికీ హేతువు లవుతాయి.

చేసే ప్రయత్నాలు ఎట్లావున్నా, కోరికలు సఫలము కావాలని ప్రతివ్యక్తీ కోరుకోవటము సహజము. దురదృష్టవశముచేత ఆ కోరికలు ఫలించకపోవటము తటస్థించితే నిరాశ నిస్పృహాలు మనిషిని ఆవరించుకొని క్రుంగదీస్తాయి. ఈ స్థితిలో అభిమానము దెబ్బ తినటమే తటస్థించితే మనసు బండబారటము కానీ, ప్రాణాలను త్యజించాలన్న తెగింపుగానీ పుట్టటము అసహజము కాదు. దీనికి చిన్నతనము తోడయితే మరి చెప్పనవసరములేదు. ప్రతివిద్యార్థీ పరీక్షకై తాకొంతవరకు తయారయినదీ ఆలోచించుకోకుండా ఉత్తీర్ణుడు కావలెనని కోరుకోవటమూ ఫలితాలను ఎదుర్కొనలేకపోవటమూ తటస్థించుచున్నది. గుండెదిటవులేని విద్యార్థులు అఘాయిత్యాలకు పాల్పడటము జరుగుచున్నది. అయితే యీ విషయాలు స్థూలదృష్ట్యా ఆలోచించినంతసేపూ మన దృష్టికి కొత్తవిషయాలు గోచరించవు. కాని-ఈ అంశాలు మనస్తత్వశాస్త్రదృష్ట్యా సూక్ష్మముగా పరిశీలించి-పరిశోధించి సమర్థించవలసినవి.

★ పిల్లల పరీక్షలు ★

ప్రతివ్యక్తికీ ఆత్మగౌరవమన్నది ఉంటుంది. ఇది పుట్టుకతో కలిగి-వ్యక్తితో పాటు వృద్ధిచెందుతుంది. ఈ విషయము ఎరుగని తల్లిదండ్రులుగాని ఉపాధ్యాయులుగానీ సామాన్యముగా ఉండరు. కాని తోటి బిడ్డలతో మాటలలోగాని, నడకలోగానీ, చదువులోగానీ వెనుకబడినబిడ్డను 'నీకు ఏమీ రాదు. ఆ పిల్ల చూడు. ఎంత చురుకైనదో!' అని తటాలున అంటారు. నిజానికి ఈ బిడ్డ వెనుకబడిపోవటమూ, మిగతావారందరూ అన్నివిషయాలలో అభివృద్ధి చెందుతూ ఉండటమూ తల్లిదండ్రులకు బాధాకరమైన విషయాలే; తమ బిడ్డ అందరి బిడ్డలతో సమానముగా అభివృద్ధిచెందాలని వారు ఆశించటము సహజమే. ఈ పరిస్థితులలో సూక్ష్మముగా కనబడే కొన్ని అంశాలు అనేక ప్రమాదాలకు అవకాశమిస్తున్నాయి. వాస్తవముగా ఆబిడ్డ అభ్యుదయాన్ని కాంక్షించే తలిదండ్రులు 'నీకేమీ రాదు ఆబిడ్డ చూడు-ఎటా ఉన్నదో' అని అనరు; ఆ విధముగా అన్నందువల్ల తనకేమీ చేతకాదన్న నిరుత్సాహముతో బిడ్డ తన భవిత్వాన్ని పాడుచేసుకొంటుందని గ్రహించగలుగుతారు. కనుక ఈ సందర్భాలలో ఏవిధముగానయినా వారి-బిడ్డలో అభ్యుదయకరమైన ఉత్సాహాన్ని రేకెత్తించటానికి తల్లిదండ్రులు ప్రయత్నించటము కాంక్షింపతగినది.

ఈ పరిస్థితులు ఉపాధ్యాయులకుకూడా ఎదుర్కొంటాయి. చదువులో 'వెనుకబడిన విద్యార్థిని నీది వట్టి మట్టిబుర్ర. నీ వీ తరగతిలోనే స్థిరముగా ఉండిపోతావు. ఆ పిల్లవాడు చూడు. అన్నిటిలో ప్రథముడుగా వచ్చాడు' అని అనటము తటస్థించినట్లయితే ఆ విద్యార్థిలో ఉపాధ్యాయుడు ఆశించిన మార్పు కలుగదు. ఒకవేళ కలిగినా అది తాత్కాలికమైనది కాని స్థిరమైనది కాదు. దీనికంటె, బిడ్డలో ఉన్న లోపాన్ని ఎత్తి చూపించకుండా, ఆ ప్రశంస ఎత్తకుండా, కర్తవ్యాన్నిమాత్రమే ప్రబోధించటము అధికముగా లాభించగలదు. తన అభివృద్ధికి భంగము వాటిల్లినదని తెలిసికొన్న విద్యార్థికి, ఎదుటివారి అభివృద్ధిని కంటితో చూసి భరించుకొనే ఓరిమీ, హృదయవైశాల్యమూ ఉండటము అసహజము కాదుగాని అరుదు. ఈ భావానికి అవకాశము లేకుండా ఎదుటివారి అభివృద్ధి మాత్రమే ఆదర్శముగా పెట్టుకొని ఈ బిడ్డ పురోగమించటానికి తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహమిచ్చి ఒకమార్గాన్ని చూపినట్లయితే లాభించగలదని శిశుతత్వశాస్త్రజ్ఞులు అనేక ప్రయోగాలు చేసి నిర్ణయించారు.

పరీక్షలలో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఆవిషయము మనసులోకి రాకుండా తల్లిదండ్రులుగాని ఉపాధ్యాయులుగాని మెలగటము సామాన్యము కాదు; కాని బిడ్డపురోగమనానికి దోహదము చేయవలసిన బాధ్యత వారిపైన ఉన్నది కనుక విధిగా సాధ్యమైనంతవరకూ కృషిచేసి తీరవలసినదే తల్లిదండ్రులు తాము జాగ్రత్తగా బిడ్డపట్ల మెలగటమే కాకుండా, ఈ బిడ్డను కొంతకాలము తోడి విద్యార్థులతోనూ మిత్రులతోనూ కలియకుండా చేయాలి. తల్లిదండ్రులు తమ సాన్నిధ్యములోనే బిడ్డలను ఉంచుకొని వినోదకరమయినవీ, ఉత్సాహకరమైనవీ వింతలూ విశేషాలూ చూపుతూ కాలక్షేపము చేయించవలసి ఉంటుంది. ఈ సందర్భములో ఉపాధ్యాయుల బాధ్యతకూడా ప్రయాసతోకూడినదే. ప్రోగ్రెస్ కార్డుమీద పరీక్షలో విద్యార్థి ఉత్తీర్ణుడు కాలేదని (Failed) వ్రాయకపోవటము అన్నిటికంటె ప్రధానమైనది. ఈ విధముగా వ్రాసినందువల్ల ఇతర విద్యార్థులకూ తనకూ గల వ్యత్యాసాన్ని గమనించి నిరుత్సాహముతో క్రుంగిపోయే విద్యార్థి మనసు గాయపడుతుంది. వ్యథపడుతుంది. తిరిగి ఆ తరగతిలో ఉండవలసిరావటమువల్ల మనసు చిన్నపోతుంది. క్రిందితరగతినుండి ఆతరగతికివచ్చిన విద్యార్థిబృందముతో సహజముగా మెలగలేకపోవటము సంభవిస్తుంది. ప్రతినిమిషమూ తనకు కలిగిన అపజయము వెంటాడటమువల్ల క్రుంగిన మనసులతో ఆ విద్యార్థులు కుమిలిపోతూ ఉంటారు. నలుగురిలో న్యూనతగా భావిస్తారు కనుక ఈ శ్రేణికి చెందిన విద్యార్థుల నందరినీ కారణము వ్యక్తపరచకుండా ఆ పాఠశాలలో మరొకశాఖకు పంపడము మంచిది. లేనిపక్షమున ఈ శ్రేణికి చెందిన అన్ని పాఠశాలలలోని విద్యార్థులనూ ఒక ప్రత్యేకపాఠశాలకు పంపే ఏర్పాటుచేయాలి. వీరినందరినీ వెంట తీసుకొనివెళ్ళి ఉపాధ్యాయులు సెలవులలో సహజ వికాస కేంద్రాలలో సేవచేయించాలి, దేశ పర్యటన చేయాలి.

ఈ సమస్యలు నిర్బంధవిద్య ఉన్న దేశాలలో లేవు. మనదేశములో ప్రాథమిక తరగతులలో మాత్రమే విద్యార్థులను ఫేల్ చేయటములేదు. కాని విదేశాలలో మెట్రిక్ తరగతివరకూ విద్యార్థులు అపజయమన్నది ఎరుగరు. ఏకోవిధముగా ప్రతిసంవత్సరమూ పైతరగతికి పంపబడుతూనే ఉంటారు. పాఠశాలవిద్య ముగిసేనాటివరకూ విద్యార్థి ప్రోగ్రెస్ కార్డుమీద వ్రాసియిస్తారు.

కళాశాలలో విద్యార్థులు చేరటానికి పరీక్షలు ఉంటాయి అవి ప్రవేశపరీక్షలు. వాటిలో ఉత్తీర్ణులయినవారికే కళాశాలలలో ప్రవేశము లభిస్తుంది. కళాశాలలలో నేకాక, సాంకేతికవిద్యాశిక్షణాలయాలలోను, ఇతర విద్యాసంస్థలలోను ప్రవేశముకోరిన విద్యార్థులు ఆయా సంస్థల ప్రవేశపరీక్షలలో ఉత్తీర్ణులు కావలసిఉంటుంది.

హైదరాబాదురాష్ట్రములో ప్రాథమిక విద్యలో ఇన్ఫెంటు తరగతి కాక నాలుగు తరగతులు ఉంటాయి. సెకండరీవిద్యలో ఆదిగువ తరగతులనుకూడా కలుపుకొని, అక్కడినుండి 5,6, 7, 8, 9, 10 క్లాసులని వ్యవహరిస్తారు. ఈ పదవక్లాసు సెకండరీవిద్యలో చివరిది. ఆంధ్ర,మదరాసు ప్రాంతాలలో ఇన్ఫెంటు తరగతి ప్రాథమికవిద్యలో లేదు. దానినే మొదటిక్లాసుగా వ్యవహరించి అయిదు క్లాసులుగా ప్రాథమికవిద్యలో విభజన చేశారు అటుతర్వాత సెకండరీవిద్యలో మొదటిఫారమునుండి ఆరవఫారమువరకు తరగతు లుంటాయి. ఆరవది తుదితరగతిగా లెక్కింపబడుతుంది

ఫ్రాన్సు దేశములో తరగతులను లెక్కించటము మనదేశములో ఉన్నట్లు ఉండదు. పైలుపెట్టేల తరగతులను క్రిందిదానిని మూడవ తరగతి అనీ, పైదానిని మొదటి తరగతీ అన్నట్లుగా మెట్రిక్ తో సమానమైన తరగతిని మొదటిఫారము అంటారు. క్రిందికి పోయినకొద్దీ సంఖ్య పెరుగుతుంది. సెకండరీవిద్య ఐదవఫారముతో ఆరంభమయి, మొదటి ఫారముతో పూర్తి అవుతుంది. తరగతులను ఏ పేరుతో వ్యవహరించినా వాటి విలువలు మారవు. కాని పేరు ప్రభావము బిడ్డల మనసుమీద అమోఘముగా పనిచేస్తుంది. గనుక ఆదేశములో ఈ విధానము కనిపెట్టబడినది.

ఈకాలపు విద్యార్థిగణములో పరీక్షలలో ఉత్తీర్ణులు కానివారిలో కుండెడటవు లేని వాళ్లు ఆత్మహత్య చేసుకొంటున్నారు. ధైర్యమూ సాహసమూ గలవారు కొందరు ఉపాధ్యాయులమీద తిరుగుబాటుచేసి విప్లవాన్ని బయలుదేరతీస్తున్నారు. క్రమముగా చదివి పరీక్షలలో వ్రాయలేని విద్యార్థులు సులభమైనమార్గాలనూ న్యాయవిరుద్ధమైన మార్గాలనూ అవలంబించాలని చూస్తున్నారు. విద్యాశాఖ వీటిని ఎదుర్కొనటానికి క్రొత్తమార్గాలను అన్వేషించటమో, విద్యార్థులను సముద్ధరించటమో చేయవలసి ఉన్నది. ★

బాలసాహితి:

పిల్లల మీద అధికారం

బాలాకాలం క్రితం బుందేల్ రాజ్యంలో ఒక మహారణ్యం ఉంటుండేది. ఆ అరణ్యంలో ఒక బూరుగు చెట్టుమీద ఒక పిచికయ్యా, ఒక పిచికమ్మా కాపరం చేస్తుండేవి. వాళ్ళకు ఇద్దరు చిన్నారి పొన్నారి పాపాయీలు కలిగారు. ఆ పాపాయీల్తో పిచికయ్యా, పిచికమ్మా ఆనందంగా కాలం వెళ్ళబుస్తుండేవారు.

ఇలా ఉంటుండగా ఒకసారి ఆ అడవికి కార్చిచ్చు తగిలి 'భగ-భగ' మని కాలిపోసాగింది. గొప్ప గొప్ప మర్రి వెల్లుకూడ కాలి బూడిదఅయిపోతున్నవి. ఆ మంటలు నాలుకలు చాచుకుంటూ బూరుగు చెట్టువేపు రానారంభించినవి. అప్పుడా పిచికయ్య చచ్చిపోతానేమో అన్న భయంకొద్ది పిచికమ్మకూ, పాపాయీలకూ చెప్పకుండా రివ్వున ఎగిరి దూరంగా పారిపోయాడు. పాపం పిచికమ్మకు మాటాడ్డానికైనా అవకాశం లేకపోయింది. కాని పిచికయ్యలా తాను పారిపోలేకపోయింది. ఆ యిద్దరి పాపాయీలకు యింకా రెక్కలు రాలేదు. ఆ ముద్దుముఖాలు చూసి ఆ పిచికమ్మ వాటితోపాటే చచ్చిపోదామని గూటిదగ్గర ఉండిపోయింది. అయితే అదృష్టవశాత్తూ ఆ కార్చిచ్చు బూరుగు చెట్టుదగ్గరకు రాకముందే ఆరిపోయింది తమ ఆపదను దాటించినందుకు పిచికమ్మ దేవుణ్ణి వెయ్యివిధాల ప్రార్థించింది.

కార్చిచ్చు బాగా ఆరిపోయాక పిచికయ్య గూటిదగ్గరకు వచ్చాడు. అది చూసి పిచికమ్మకు పట్టరాని కోపం వచ్చి పిచికయ్యతో యిలా అన్నది—

"నువ్వెందుకు యిక్కడ కొచ్చావు?"

"నాయింటికి నే నొచ్చాను నువ్వెవర్తవు అడగడానికి?" అని పిచికయ్య రోషంతో అన్నాడు.

కు. జానకిరామ్ పట్నాయక్

"చాల్చాలు! నీ యిల్లు అని చెప్పడానికి సిగ్గు వేయ లేదూ? కార్చిచ్చు వచ్చి నీ యింటినీ, నీ భార్యాపిల్లల్నీ కాల్చి బూడిద చేయబోయే సమయంలో దయ లేకుండా నీ ప్రాణాలు కాపాడుకోవటానికి పారిపోయావు! మేము చచ్చినా యింతేకదా? ఏదో దేవుడు కాపాడాడు గాబట్టి బతికిపోయాం!..ఇకమీద నీకూ మాకూ సంబంధం లేదు! నీ యిష్టం వచ్చిన చోటికి ఫో!" అని పిచికమ్మ తూలనాడింది.

అందుకు పిచికయ్య వికటంగా నవ్వి, మీసం మెలిబెట్టి ఇలా అన్నాడు—

"శభాష్! నీతివాక్యాలు మహా బాగా చెబుతున్నావే? నోర్ముయ్! నేను మగవాణ్ణి! ఏం చేయడానికి నాకు అధికారం ఉంది! ఈ యిల్లు నాది! ఈ పిల్లలు నా పిల్లలు!... ఎటు పోతావో నువ్వే పో!"

"సరి సరి!......యీ పిల్లలు నీ పిల్లలు ఎలానవుతారు?... వాళ్ళను కన్నది నేను! పోషించింది నేను! ప్రాణాపాయసమయంలో కాపాడింది నేను!...యింతా చేస్తే వీళ్లు నా పిల్లలు కారూ?...కార్చిచ్చు వచ్చి వీళ్ళను కాల్చివేయబోయే సమయంలో నువ్వెందుకు వీళ్ళను వదిలి పారిపోయావు? వీళ్ళు ఆ మంటల్లో పడి పిలపిల తన్నుకొని, కాలి, బూడిద అయిపోతారన్న జ్ఞానం అప్పట్లో నీ కెందుకు లేకపోయింది? వీళ్లు నీ పిల్లలే అయితే కాపాడ్డానికి ఎందుకు ఉండిపోయావు కావు?...చాల్చాలు! అంతా చల్లబడిపోయింది గనక యిప్పుడు నీ మగతనం, నీ అధికారం చలాయించడానికొచ్చావ్?...వెళ్లు వెళ్ళు!... నీ కిక్కడ ఏమీ లేదు!" అని పిచికమ్మ వాదించింది. కాని పిచికయ్య వినలేదు. తిన్నగా ఆ రాజ్యం రాజుగారిదగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

రాజు పిచికమ్మను పిలిపించాడు. ఇద్దరి వాదోపవాదాలూ విన్నాడు. చివరకు ఎలా న్యాయపరిష్కారం చేశాడంటే—"పిల్లలమీద అధికారం మగవానిదే కాని ఆడదానికి లేదు! కనక పిచికమ్మ, పిచికయ్య చెప్పినట్టుగా వినాలి."

★ పిల్లలమీద అధికారం ★

ఈ పరిష్కారం పిచికమ్మ విని చాలా దుఃఖించింది. కాని పల్లెత్తు మాట అనలేదు. రాజుగారి నిర్ణయాన్ని ఒక రాగిరేకుమీద వ్రాయించి, రాజుగారి సంతకం తీసుకొని, దాన్ని తిన్నగా రాజభవనంలో మారుమూలను దాచిపెట్టి వెళ్ళిపోవచ్చింది. తరువాత ఆ పిచికమ్మ తలబద్దలు కొట్టుకొని చచ్చిపోయింది.

మరుచటి జన్మలో పిచికమ్మ ఒక గొల్లవారింట ఆడపిల్లగా జన్మించింది. ఆ పిల్ల పేరు నక్కు! నక్కుకు పూర్వజన్మలోని విషయాలన్నీ జ్ఞాపకం ఉన్నాయ్! పదిహేనో సంవత్సరం వచ్చేసరికి నక్కు తన యింట్లో ఉన్న ఎద్దుల్ని తోలుకొని అడవికి తీసుకుపోయి మేపుకొని వస్తుండేది!

అదే అడవికి ఆ రాజుగారి ఆవులూ, దూడలూ మేతకు వస్తుండేవి. ఒకనాడు నక్కు, రాజుగారి దూడల్ని తన ఎద్దుల్తోసహా ఇంటికి తోలుకొని వెళ్ళిపోయింది! ఆ విషయం పశువులకాపర్లు రాజుగారితో ఫిర్యాదుచేశారు. రాజుగారు వెంటనే నక్కును పిలిపించి ఇలా అడిగారు—

"నువ్వు మా దూడల్ని ఎందుకు తోలుకుపోయావు?"

ఆ ప్రశ్న విని నక్కు నవ్వి "రాజా! పిల్లలమీద మగవానిది కదా అధికారం! అందుకని ఆ దూడల్ని మా ఎద్దులదగ్గర కట్టివేశాను!" అన్నది.

గతంలో జరిగినదంతా రాజు అప్పుడే మర్చిపోయాడు. అందువల్ల ఆశ్చర్యపోతూ "అదెలా గవుతుంది? నీ కెవరు చెప్పారు పిల్లలమీద మగవానిదే అధికారంఅని?" అంటూ ప్రశ్నించాడు.

వెంటనే నక్కు తాను పిచికమ్మగా ఉండి దాచిఉంచిన రాగిరేకును నౌకర్లద్వారా తెప్పించి రాజుకు చూపించి "ఇదిగో! మీరే న్యాయపరిష్కారం చేశారు పిల్లలమీద మగవానిదే అధికారం అని!" అన్నది నవ్వుతూ.

పాపం రాజు తన సంతకంతో ఉన్న తీర్పును చూసి మాటాడలేకపోయాడు. లోలోపలమాత్రం తన పరాజయానికి ఉడికిపోయాడు. ఎలాగైనా నక్కును పెండ్లాడి ప్రతీకారం తీర్చుకుందామని నిశ్చయించుకొన్నాడు. అప్పటికి మరేమీ అనకుండా నక్కును పంపించివేశాడు.

తరువాత కొన్నాళ్ళకు నక్కు తండ్రి చనిపోయాడు. ఆ సమయం చూసుకొని రాజు, నక్కును తనకిచ్చి పెండ్లిచేయాల్సిందిగా నక్కు తల్లికి కబురంపించాడు. దానికి నక్కు తల్లి ఒప్పుకోలేదు. కులాచారానికి వ్యతిరేకంగా తాను వివాహం చేయజాలనని ఖచ్చితంగా రాజుకు చెప్పివేసింది. రాజుకు కోపం వచ్చింది. జబర్దస్తీగా అతను నక్కును పెండ్లిచేసుకున్నాడు. తరువాత నక్కుతో గర్వంగా యిలా అన్నాడు—

"చూసావా మగవాని అధికారం అంటే ఎలాంటిదో?"

అందుకు నక్కు కోపపడి "అవును! మీలాంటి మగమహారాజుల అధికారం మాలాంటి పేదవారిమీదా, ఆడవారిమీదా కాక మరెవరిమీద ఉంటుంది? మీతో సమానులయిన మగవారిపట్ల మీ బలం చూపించి, మీ అధికారం నిలబెట్టుకుంటే అప్పుడు మీ మాట చెల్లినట్టు!" అన్నది.

ఆ మాటలు రాజుకు బాణపు ములుకుల్లా తగిలాయ్! పౌరుషంతో యిలా అన్నాడు—

"సరే! అదీ చేసి చూపిస్తాను!" అని వెంటనే గుర్రంమీద బయల్దేరిపోయాడు!

అలా గుర్రంమీద వెళ్ళగా వెళ్ళగా అతనికి ఒక ఎడారి రాజ్యం కనిపించింది. ఆ ఎడారి రాజుకు, దేవకాంతల్ని ధిక్కరించే అందంగల కుమార్తె ఉన్నదని అతనికి తెలిసింది. ఆ అమ్మాయిని తనకిచ్చి వివాహం చేయవలసిందిగా రాజు కబురంపించాడు. అందుకా ఎడారి రాజు ఏమన్నాడంటే—"నాకేమీ అభ్యంతరం లేదు. కాని ఒక్కమరతున్నది. అది ఏమనగా-ఎవరైతే ఒక దొన్నెడు నీటిలో స్నానం చేస్తారో వారే నా కుమార్తెను వివాహమాడ్డానికి అర్హులు! అలా చేయలేనివారు ముక్కుకు గవ్వ కట్టుకొని ఆజన్మాంతం నూనెగానుగ తిప్పాలి! దీని కిష్టపడితే రావొచ్చు!"

ఆవేశంలో ఉన్న రాజు ముందూ వెనకా ఆలోచించకుండా "సరే!" అని ఒప్పుకున్నాడు. కాని తీరా ఆకుదొన్నెలో ఉన్న నీరు చూసేసరికి తెల్లబోయాడు! ఓడిపోయాడు! ముక్కుకు గవ్వ కట్టుకొని నూనెగానుగ తిప్పుతున్నాడు!

ఈ సంగతి సక్కూకు తెలిసింది. వెంటనే ఆమె మగవేషం వేసుకొని, భర్త కత్తిని పట్టుకొని, గుర్రంమీద ఆ ఎడారిరాజ్యం చేరుకున్నది. ఆ రాజు నిర్ణయించిన షరతు విన్నది. తనకు పూర్వజన్మ వృత్తాంతం తెలుసు గనుక దేవుణ్ణి ప్రార్థించి, తక్షణం పిచికమ్మగా మారిపోయింది! ఆ అకుదొన్న నీళ్లలో శుభ్రంగా స్నానంచేసి తిరుగా మామూలు మగవేషంలోనికి వచ్చేసింది! ఆ ఎడారిరాజు అది చూసి ఆశ్చర్యపోయి వెంటనే తన కుమార్తెనిచ్చి వివాహం చేయబోయాడు! కాని సక్కూ ఒప్పుకో లేదు. ఎందుకు ఒప్పుకుంటుంది? అసల్లో తను ఆడది! ఎలా ఆ ఎడారి రాజు కుమార్తెను వివాహమాడుతుంది?...అందుకని సక్కూ యిలా అన్నది—

"మా వంశంలో మగవారికి బదులు కత్తికి వివాహం చేస్తారు. మీరు ఆదేవిధంగా మీ అమ్మాయికి మా కత్తినిచ్చి వివాహం చేయండి!"

ఎడారిరాజు దానికి సమ్మతించి అతివైభవంగా కుమార్తెకూ, కత్తికీ వివాహం చేశాడు!

తరువాత సక్కూ గానుగ తిప్పుతున్న భర్త దగ్గరకు వెళ్లి గొంతు మార్చి యిలా అన్నది—

"మీకు పౌరుషం లేదు! కనుక మీకు మీసం ఉండరాదు!" అని ఒక పక్క మీసం కత్తిరించివేసి ఆ మీసాన్నీ, ముక్కుకు కట్టినగవ్వను విప్పి ఆ గవ్వనూ తన దగ్గర ఉంచుకొని "మీ రాజ్యం వెళ్లిపోండి" అని విడిపించి వేసింది.

మర్నాడు ఆ మగవేషంలో సక్కూ, ఎడారిరాజు కుమార్తె, కొంత సైన్యమూ బయల్దేరినారు. సక్కూ గుర్రంమీద ముందు పోతున్నది. వెనకగా పల్లకీలో ఎడారిరాజు కుమార్తె వస్తున్నది. వాళ్ల వెనుక సైన్యం వస్తున్నది. అందరికన్నా వెనకగా రాజు తల వంచుకొని వస్తున్నాడు.

ఆనాటి రాత్రి అంతా ఒక అడవిలో బస చేశారు. సగంరాత్రి గడిచాక సక్కూ, తన గుర్రం వదిలిపెట్టి, ఇంకో గుర్రంమీద ముందుగా పట్నం పారిపోయింది. తన మగవేషం తీసి, మామూలు రూపంతో అంతఃపురంలో ఉన్నది.

ఇక్కడ అడవిలో! తెల్లవారే సరికి రాకుమారుని వేషంలో ఉన్న సక్కూ కనిపించలేదు. అదే సమయమనుకొని వెనకనుంచి వస్తున్న రాజు, సక్కూ వదిలివేసిన గుర్రం మీద బయలుదేరి ఎడారిరాజు కుమార్తె పల్లకీ ముందు నడుస్తున్నాడు. అందరూ అతడే రాకుమారుడనుకొన్నారు!

రాజు నరాసరి తనపట్నం చేరుకున్నాడు. అంతఃపురంలోనికి వెళ్లేసరికి సక్కూ, తలవంచుకొని, ఎదురుగా పోయి అతని పాదాలకు నమస్కరించింది. ఆమె వేపు రాజు దర్జాగా చూసి "చూశావా నీ వన్నట్టు నాతో సమానుడైనవారి మీదా, మగవారి మీదా నా అధికారం చూపించి, ఎడారిరాజు కుమార్తెను ఎలా వివాహమాడుకొచ్చానో! ఇప్పుడు చెప్పు అధికారం ఎవరి సొత్తో?" అన్నాడు.

సక్కూ లేచి నిల్చుని, రాజు ముఖంలోకి చూసింది! రాజుగారి మీసాలు రెండువేపులా తుడిచి పెట్టబడి ఉన్నాయ్!

వెంటనే సక్కూ చెంగులో ముడివేసి ఉంచిన సగం మీసం, గవ్వా, రాజు ఎదుట ఉంచుతూ, చిరునవ్వుతో "మహారాజా! పౌరుష చిహ్నం అయిన మీసాన్ని పోగొట్టుకొని, ముక్కుకు గవ్వ కట్టుకొని గానుగ తిప్పుతూ, సిగ్గులేక, ఆడవాళ్ళ ఎదట యిలా డాబులు కొట్టగలిగినవారు ఎంతయినా అధికారం ఉంచుకొగలరు!" అంటూ తన పూర్వపు పిచికమ్మ రూపం ఎత్తి, కిటికీగుండా 'తుర్రు'న పారిపోయింది!

(బుందేల్ రాజ్యంలోని జానపదగాథ)

"ఇట్లు..."

ఒక 'సత్రైకాలపు' అమ్మాయికి బస్తీనించి ఆమె భర్త, పాతిక రూపాయలకి చెక్కు పంపించాడు. చిన్న తమ్ముడిని వెంటబెట్టుకుని ఆ పడుచు బ్యాంకుకి వెళ్లి చెక్కు చూపించి 'ఏం చెయ్యాలని అడిగింది.

"దానికేముందమ్మా. ఉత్తరాల క్రింద చేసినట్టే, ఆ చెక్కు వెనకాతలవైపు సంతకం చేసి ఇయ్యి" అన్నాడు కాషియర్.

ఆ పిల్ల తమ్ముడితో కలిసి కొంతసేపు ఆలోచించి, చివరకి సంతకం చేసి చెక్కు కాషియర్ కి ఇచ్చింది.

దానిమీద, "ఇట్లు మీ చరణదాసి సుబ్బులు" అని వ్రాసిఉంది.



జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకాప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. దానికి అంతు కనుక్కొని హతమార్చాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికాప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ళవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా మరికొందరితో సహా సముద్రంలో పడిపోతాడు. సముద్రంలో పడికొట్టుకుపోతూ కొంతసేపటికి ప్రొఫెసర్ అరోనా, కాన్సిల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు. భోంచేసి అందరూ హాయిగా నిద్రపోతారు.

అనువాదం: "వినాయక"

9 నెడ్‌లాండ్ కోపం

ఆ తరవాత నేనెంతసేపు నిద్దరపోయానో చెప్పలేనుగాని మొత్తంమీద చాలాసేపే నిద్దరపోయి ఉండవచ్చును. ఆ నిద్రలో నా బడలిక అంతా తీరిపోయింది. నేను నిద్రలేచి చూచేసరికి నెడ్‌లాండు, కౌన్సెలు ఇంకా గుర్రుపెట్టి నిద్రపోతూనే ఉన్నారు.

ఆ గదిలో వస్తువులన్నీ అలాగే ఉన్నాయి. వాటిలో ఎక్కడా ఏవిధమైన మార్పు కనిపించలేదు. ఆ ఖైదలాగే పట్టి ఖైదులాగే ఉండిపోయింది. మేమంతా ఖైదీలుగానే ఉండిపోయాము. అంతా నిద్రపోయిన తరవాత ఒక జలాంతర్గామి నౌఖరు వచ్చి మేము భోజనం చేసిన ప్రదేశం అంతా శుభ్రం చేశాడు. మా పరిస్థితిలో ఇక అంతకంటె పెద్ద మార్పేమీ వచ్చే

సూచన లేవీ కనిపించలేదు. నా కదంతా కేవలం యావజ్జీవకారాగారంలా కనిపించింది. ఇది తలుచుకునేసరికి నా గుండెమీద ఏదో ఒక పెద్ద రాతిబండ మోపినట్లయింది. అదీగాక ఆ గదిలో నింపిన ప్రాణవాయువు అదేపనిగా పీల్చడం వల్ల కూడా నా గుండె బాగా బరువెక్కింది.

కొంతసేపటికి మా గదిలో కొత్తగా గాలి ప్రవేశపెట్టవలసిన అవసరం ఏర్పడింది. జలాంతర్గామికి కూడా ఈ ఆవశ్యకత ఏర్పడి ఉండవచ్చును. జలాంతర్గామికి గాలి సప్లయి లేకుండా కాలక్షేపం కావడం చాలా కష్టం. దానికెప్పటికీ ఏవైనా కొత్త కొత్త రసాయన పరిణామాలద్వారా గాలి సంపాదించుకొంటున్నాడా? లేక ఎప్పుడైనా పైకివచ్చి తనకు కావలసిన గాలి అంతా ఎక్కడో ఒక్కచోట నిలవ చేసుకుంటున్నాడా? బహుశః అలాంటిదే జరుగుతూ ఉండవచ్చునని అనుకొన్నాను.

అలాగ ఆ విషయాన్ని గురించి మథనపడుతుండగా హఠాత్తుగా పరిశుభ్రమైన గాలి పీల్చినట్లయింది. ఆ గాలి సముద్రపు గాలే! అందులో మరి అనుమాన మేమీ లేదు! ఆ గాలి పీల్చడంతో నా ప్రాణం లేచివచ్చినట్లయింది. జలాంతర్గామి బాగా పైకి తేలి ఉంటుందనీ అందువల్లనే ఆ సముద్రపుగాలి గది లోపలికి వచ్చి ఉంటుందనీ అనుకున్నాను. నాలుగువైపులా బాగా పరకాయించి చూచాను. నా ఊహ నిజమే అయింది.

సముద్రపుగాలి లోపలికి వినరికొట్టేసరికి నా పక్కనేపడి నిద్రపోతున్న వాళ్లిద్దరు కూడా మేల్కొన్నారు. వాళ్లిద్దరు కళ్లు నులుముకొని, ఒళ్లు విరుచుకొని మెల్లిగా లేచి నిలబడ్డారు.

"మీకు బాగా నిద్రపట్టిందా?" అని ప్రశ్నించాడు కౌన్సిల్ ఎంతో మర్యాదగా.

"ఓ! బాగా నిద్రపోయాను. మరి నీ మాట?" అన్నాను నెడ్ లాండ్‌తో.

"నాకూ బాగానే నిద్రపట్టింది. ప్రస్తుతం మనం సముద్రపు గాలి పీలుస్తున్నట్టున్నామే!"

అతడన్న మాటలో అనుమాన మేమీ లేదు. తరవాత నిద్రపోయిన పిమ్మట జరిగిన వింతలన్నీ అతనికి చెప్పాను.

"మనం అబ్రహామ్ లింకన్‌లో ఉన్నప్పుడు ఆ తిమింగిలం బుస కొట్టినట్టుగా చప్పుడు చేస్తున్నదని అనుకొన్నాము. అయితే అది అంతా గాలి పీల్చుకోవడమే అయి వుంటుంది." అన్నాడు నెడ్ లాండ్.

"అవును! నిజమే!" అన్నాను.

"ఇప్పుడు టైమెంత అయివుంటుందో తెలియడం లేదే! బహుశః చిన్నతుట్టయి ఉండాలి!"

బాలగేయం:

పిలుపు

'శారదా చిరంజీవిని'

నీ మోమున నవ్వు లట్లు
నిండె లోకమున కాంతులు
కలువపూవు లెట్లు చూడు
కలకలమని నవ్వెడినో...

తరగలలో చిరుమీనులు
తరళకాంతులీని సుధా
కరుని కరమ్ములతోడను
చెరలాటము లాడుచుండె.

కాపుకన్నె లెటుల చూడు
కమ్మని చిరుగొంతులతో
ఏవో తీయనిపాటలు
ఎంతో హాయిగ పాడిరి.

రావయ్యా! రావమ్మా!
అబ్బాయీ! అమ్మాయీ!
చందమామతోడ నీవు
సరదాగా ఆటలాడ!

అదుగదుగో చందమామ
ఆకాశపు వీథుల్లో
అందంగా నవ్వుకుంటూ
ఆనుకొనగ పిలుస్తోంది—

చల్లని తన చేతులతో
సైగల రమ్మంటోంది.
అబ్బాయీ!- అమ్మాయీ!-
రావయ్యా!- రావమ్మా!—

తారలెల్ల నీకోసం
తారి తారి చూస్తున్నవి.
నీలాకాశపు పథమున
నిక్కి నిక్కి నిలుచున్నవి.

హాయియైన యీ వెన్నెల
ఆటలకూ పాటలకూ
పరుగులకూ ఉరకలకూ
పసందైన కాలంకద!—

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

"ఏమో! మనం అధమం 24 గంటలేనా గుర్రుపట్టి నిద్రపోయి ఉంటాం. ఎంత లేదన్నా పొద్దున్న ఫలహారాల వేళైనా అయిఉంటుంది."

"ఏమో! ఏటయిమైనా ఆ వచ్చే వాడెవడో పెందరాళే వచ్చి మన కింత పారేసిపోతే బాగుండును!"

"అవును! నిజమే! నాకూ అలాగే అనిపిస్తూంది! తినడానికి ఏదో ఒకటి పట్టుకువస్తే బాగుండును" అన్నాడు కౌన్సెల్.

"నామట్టుకు నాకు ఫలహారము, భోజనము వచ్చినా అభ్యంతరం లేదు! ఇందులో ఉన్నవాళ్లెవళ్లో మనకు భోజనం పెట్టితీరాలి!" అన్నాడు నెడ్ లాండ్.

అప్పైన శేశం దుకున్నాను. "నెడ్ లాండ్! ఊరికే తొందర పడితే లాభమేమిటి? కొంత సేపు ఓపికపట్టాలి మరి! ఆ ఇద్దరు మనకు తిండైనా పెట్టకుండా చంపి వెయ్యరు గదా! మనల్ని చంపివేసే సంకల్పమే ఉంటే నిన్న మన కెందుకు భోజనం పెడతారు?"

"ఏమో మనం బాగా బలిసే దాకా మేపి ఆపైన మన భరతం పడతారేమో!" అన్నాడు నెడ్.

"అబ్బే అలాగనడం సబబు కాదు! వీళ్లు మనుషుల్ని తినేసే జాపతు కానేకాదు!" అన్నాను. దానికి నెడ్ ఇలాగ సమాధానం ఇచ్చాడు:

"అప్పుడే ఇల్లలకగానే పండు గయిందా? వాళ్ళకి చాలా కాలం నించి తాజా మాంసం దొరకడం లేదేమో! అదే నిజమయితే మనం అంతా నక్కుళ్లా ఉన్నామని ఉవ్విళ్లూరుతున్నారేమో! ఎవరు చెప్ప గలరు?"

"నెడ్! ఇలాంటి అవకతవకలో చాలన్నీ కట్టిపెట్టెయ్. మనల్ని ఆదరించి ఆశ్రయమిచ్చిన వాళ్ళ మీద కళ్లెర్ర జేస్తే ప్రయోజనం ఏమిటి? దాని వల్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారవుతుంది! అంతే!" అన్నాను.

"ఏమైనా సరే! నాకిప్పుడు చాలా ఆకలిగా ఉంది! అయితే ఏం లాభం! ఇంతవరకు ఏమి ఆశ కనబడడం లేదు!" అన్నాడు నెడ్.

"నెడ్ లాండ్! ఇదిగో! నేను చెప్పేది జాగ్రత్తగా విను! మన మీ ఓడనియమాల కన్నిటికీ కట్టుబడి ఉండాలి. అందరు భోజనాలకు లేచే వేళకి ముందే మనకి ఆకలవుతూంటేమో మరి, వాళ్లేం చేస్తారు?"

"అది నిజమే కావచ్చును!" అన్నాడు కౌన్సెల్.

దానితో నెడ్ లాండ్ ఒళ్లు మండిపోయింది. "నీ కేం? నీకెక్కడా ఆకలీ దప్పిక ఉన్నట్టు కనబడవు! ప్రాణంపోతూన్నా సరే, ఎక్కడా చెక్కు చెదరకుండా అలాగే కూర్చుంటావు!" అన్నాడు.

"నెడ్ లాండ్! ఊరికే భోజనం రాలేదని అంగలార్చినంత మాత్రం లాభమేమిటి?"

దానిమీద నెడ్ లాండ్ బాగా రుసరుసలాడుతూ దురుసుగా ఇలాగన్నాడు:

"ఊరికే అంగలార్చితే లాభం లేని మాట నిజమే! అయితే నా మనస్సులో ఉన్నమాట కాస్తా అనేస్తున్నాను! జాగ్రత్తగా వినండి! వీళ్లు నన్నిలాగ ఎంత కాలం దాకా ఖైదులో పెడతారో తెలియదుగాని నేనిదంతా ఎంతో కాలం దాకా సహించలేను! అయితే ప్రొఫెసర్! ఇంకా చాలా కాలం దాకా మనం ఈ ఖైదులోనే పడి చావాలా?" దానిపైన నేను "ఈ విషయంలో నీకెంత తెలుసునో నాకూ అంతే తెలుసును! నేను మాత్రం ఏమి చెప్పగలను." అన్నాను.


"అయినా మీకెలా గనిపిస్తుందో చెప్పండి!" అని మళ్లీ రెట్టించాడు నెడ్ లాండ్. దానికి నేనిలాగ చెప్పాను.

"ఈ ఓడలోకి రాగానే మనకొక అత్యంత రహస్యమైన విషయం తెలిసింది. ఆ రహస్యం అత్యంత ముఖ్యమైనదైతే మొత్తం మీద మన అందరిపనీ అయిపోయిందన్నమాటే! లేకపోతే మనల నందరినీ మళ్లీ మనుషుల్లో పడేస్తారని ఆశించవచ్చును."

"లేకపోతే మనల నందరినీ ఓడ కళాసులుగా మార్చినా మార్చవచ్చును" అన్నాడు కౌన్సెల్.

"లేకపోతే అబ్రహామ్ లింకన్ కన్నా పెద్ద యుద్ధనౌక ఏదైనా ఎదురుపడితే దీన్ని ముంచివెయ్యవచ్చును. అప్పుడు దీనితోబాటు మన గతికూడా అధోగతే అవుతుంది!" అన్నాడు నెడ్. దానిపైన నేనిలాగన్నాను.

"నెడ్ లాండ్! నువ్వు చెప్పింది చాలా సబబుగా ఉంది! అయితే మన కింతవరకు అలాంటి పరిస్థితి పట్టలేదు. అందుచేత దాన్ని గురించి ఇప్పుడు తల బద్దలుకొట్టుకోవడం మూలాన ప్రయోజన



ఎలుగులతో చెలగాటం

ఫోటో: కె. బుషీవరు—హైదరాబాదు.

మిమీ లేదు! కనక ప్రస్తుతానికి పరిస్థితులన్నీ జాగ్రత్తగా గమనించడం కంటె మనం చెయ్యగలిగిం దేమీ లేదు."

కాని నెడ్‌లాండ్ తా బట్టిన కుందేటికి మూడే కాళ్ళని కూర్చున్నాడు:

"కాని అలాగ మాట్లాడ కూరుకోవడానికి వీలులేదు! మనజాగ్రత్త మనం పడాలి!" అన్నాడు.

"అయితే! ఏం జెయ్యమంటావు?"

"తప్పించుకు పారిపోవాలి!"

"మనం సామాన్యమైన జైళ్లో నించి తప్పించుకుపోవడమే ప్రాణాంతకం! అందులోను ఈ సాగరగర్భ కారాగారంలో నించి తప్పించుకు పారిపోవడం అంటే ఇక వేరే చెప్పనే అక్కరలేదు! అది ఎప్పటికీ జరిగేపనికాదు!" అన్నాను. ఆపైన కొన్సెలు నెడ్‌లాండ్‌తో ఇలాగన్నాడు:

"ఇదిగో! నెడ్! మన ప్రొఫెసర్ చెప్పినదానిలో తేడా ఏమిఉంది చెప్పు! నీవు కెనడాలో పుట్టిన వ్యక్తివి! నీలాంటివాళ్ళెలాంటి పరిస్థితులలోను చెక్కుచెదరకుండా అతి ధైర్యంగా నిలబడాలి!"

ఈ మాటలు విని నెడ్‌లాండ్ బాగా విసుక్కున్నాడు. కాని కొంత సేపటిదాకా ఏమీ అనకుండా మాట్లాడకూరుకున్నాడు. ఈ పరిస్థితులలో పారిపోవడం అంతటి తెలివి తక్కువపని అదే కాని మరేదీలేదు! కాని నెడ్‌లాండ్ నాళాలలో కొంత ప్రేంచిరక్తంకూడా మిళితమై ఉంది. అత డిచ్చిన సమాధానంలో ఆ ధోరణే ప్రత్యక్షమైంది.

కొంతసేపటికి నెమ్మదిగా ఇలాగన్నాడు: "అయితే ప్రొఫెసర్! జైలులో నించి తప్పించుకోలేనివా

ల్లేమి చెయ్యాలో మీకు తెలియదన్న మాట!"

"అబ్బే! నా కేమీ తెలియదే!"

"ఎలాగో అలాగ ఈ ఖైదులోనే ఉండిపోవడానికి ప్రయత్నించాలి!"

"నిజమే! సముద్రం అట్టడుగున పడి ఉండడంకన్న ఇందులో ఉండడమే మంచిది!" అన్నాడు కౌన్సెల్.

"సరేగాని ఈ జలాంతర్గామి అధికారులందరినీ సముద్రంలోకి విసిరివేస్తే?" అన్నాడు నెడ్.

"అయితే నిజంగా ఈ జలాంతర్గామిని మనం స్వాధీనం చేసుకోగలమనే ఆలోచిస్తున్నావా?"

"ఔను! అలాగే అనుకుంటున్నాను! ఎందుకు స్వాధీనం చేసుకోలేము?"

"అది ఎన్నటికీ జరిగేపనిగాదు!"

దానికి నెడ్ లాండ్ ఇలాగ సమాధానం చెప్పాడు:

"ఎందుకు కాదు? ఎప్పుడైనా హఠాత్తుగా ఏదైనా అదృష్టం కలిసి రావచ్చును. అప్పుడు కూడా చేతులు ముడుచుకుని కూర్చోవడం ఎందుకు? జలాంతర్గామిలో ఇరవై మందిదాకా ఉన్నా ఇద్దరు ఫ్రెంచి వాళ్లు, ఒక కెనడావాసినీ వాళ్ల కెదురుగా నిలబడ్డారంటే - అందరు తోక ముడిచి పరుగుచ్చుకుంటారు. దీనికి అనుమాన మేమీ లేదు!"

నెడ్ చెప్పినదాన్ని గురించి వాదోపవాదాలు పెంచడంకంటె అతడు చెప్పినవి చెప్పినట్లుగానే అంగీకరించడమే మంచిదని అనిపించింది. అందుచేత నేను నెమ్మదిగా ఇలా గన్నాను:

"సరే! అలాంటి పరిస్థితులు వచ్చేదాకా మాట్లాడ కూరుకోవడమే మంచిది. అంతవరకు నువ్వు లేనిపోని గందరగోళం లేవదీయనని మాత్రం మాట ఇవ్వాలి."

"అలాగే ఎక్కడా తొణక్కుండా అతిజాగ్రత్తగా కాలక్షేపం చేస్తాను. సరిగదా!" అన్నాడు నెడ్ లాండ్.

"సరేగాని మరి మాట తప్ప కూడదు సుమా!" అన్నాను.

అటుపిమ్మట మా సంభాషణ ఆగిపోయింది. ఎవరికి వారే ఏవేవో ఆలోచించుకోవడం మొదలుపెట్టారు. నెడ్ లాండ్ గట్టిగా మాట ఇచ్చినా అతని విషయంలో నా కంతగా నమ్మిక కలగలేదు. అదీగాక మా కనుకూలమైన పరిస్థితులేర్పడగలవని కూడా అనిపించలేదు. ఆ జలాంతర్గామి అంత జాగ్రత్తగా నడిచిపోతూవున్నదంటే దానిలో ఎంతో మంది నావికులుండాలి. తీరా సమయం వచ్చేసరికి వాళ్ళంతా ఏకమై నిలబడితే మే మిక చెయ్యగలిగినది ఏమీ ఉండదు! అదీగాక మొట్టమొదటగా మా కందరికీ పూర్తిగా స్వేచ్ఛ ఉండాలి గదా! ఆ స్వేచ్ఛ లేనప్పుడిక ఎన్ని గాలిమేడలు కడితే మాత్రం ఏమిలాభం! కనకనే నాకీ ఖైదులోనించి తప్పించుకొని బయటపడే మార్గమేమీ కనబడలేదు! ఇంకొక విషయం. జలాంతర్గామి అధికారి కేమైనా ఒక అత్యంత రహస్యమైన విషయం అతి గుప్తంగా దాచవలసిన అవశ్యకత ఏర్పడి ఉండవచ్చును. అతడా పరిస్థితులలో ఓడలో కూడా మా కే విధంగాను స్వేచ్ఛ కలిగించకపోవచ్చును. ఆ మహానుభావుడు మమ్మల్ని అందరినీ కట్టకట్టి సముద్రంలోకి విసిరివేయించినా ఆశ్చర్యపడవలసిన దేమీలేదు! లేకపోతే ఎక్కడో ఒక చోట భూమిమీద విడిచిపెట్టినా విడిచిపెట్టవచ్చును. ఏది జరిగినా జరగవచ్చును.

అయితే నెడ్ లాండ్ పరిస్థితి కొంతవరకు నా కర్థం కాకపోలేదు. అప్పుడప్పుడతనిలో కొంత విసుగుదల, చికాకు బయలుదేరుతూండేవి. ధోరణి చూస్తే బోనులో పెట్టిన పులిలా కనిపించేవాడు. అప్పుడప్పుడు పిడికిలితో గోడమీద కొట్టడం కూడా జరిగేది! అలాగ ఎంతసేపు గడిచినా మా కెక్కడా భోజనాలు కనబడలేదు. నిజంగా వాళ్లకు మా యెడల సద్భావమే ఉంటే ఇంతవరకు భోజనం పంపించకపోవడానికి కారణమేమైఉండాలి?

నెడ్ లాండ్ కడుపు దహించుకుపోయింది! అతడిక ఆకలికి సహించలేక ఏదైనా అఘాయిత్యం పనిచేస్తాడేమోనని చాలా భయపడ్డాను.

అలాగలాగ రెండు గంటలు గడిచిపోయాయి నెడ్ లాండ్ అగ్గివేసిన గుగ్గిలంలా మండిపడిపోతున్నాడు. అయితే ఏం లాభం? మా పరిస్థితి అంతకంతకూ బాగా భయంకరంగా తయారయింది.

క్రమంగా నాలో ఆశాకిరణాలన్నీ అంతరించిపోయాయి నేను ఓడ కెప్టెన్‌తో మాట్లాడినప్పుడు కొంత ఆశ బయలుదేరిన మాట నిజమేగాని ఇప్పుడది అంతా పూర్తిగా నశించుకుపోయింది.

మమ్మల్ని ఇలాగే ఆకలితో మలమలా మాడ్చి చంపివెయ్యాలనే కాబోలు ఆ కెప్టెన్ ఊహ! ఆ ఆలోచనతో నాబుర్ర అంతా బాగా వేడెక్కిపోయింది. కౌన్సెల్ మాత్రం ఎక్కడా తొణక్కు బెదరకుండా అలాగే

★ సెరిబ్రల్ సినేమియా ★

(26-వ పేజీ తరువాయి)

"మీరు బలేగా మాట్లాడతారు. ఇక్కడ వర్ణించకపోతే, అవన్నీ డైలాగులుగా రాసి ఎవరికన్నా చూపించరాదూ"? అంటూ కిల కిల నవ్వింది కామిని.

"నువ్వు భలేగా నటిస్తావు—లోపల నకనక ఆకలేస్తున్నా ఎంత మామూలుగా ఉన్నావు?"

"మీకేమన్నా ఆకలేస్తోందా. చెప్పండి. డబ్బులిస్తా" అంటూ చీర రొండినున్న బొందు నుంచి తీసింది కామిని.

"అదేవిటి డబ్బులూ. పల్లెటూరి నుంచీ వచ్చావు"

"ఓస్...భానుగా తిరిగేవాళ్లు వట్టువ తిరిగే ఎరకల బుట్టలవాటికోసం తీసిపోలేదు లెండి. ఎంత కావాలి చెప్పండి. నా దగ్గర అరణా లున్నాయి" అంది.

"అబ్బే నాకేం వద్దు ఊరికనే అన్నా."

"పోనియ్యి నాదగ్గర మొహమాట మేమిటి. చేప తీసుకుని కాఫీతాగు...కష్టార్జితంటే. అన్యాయం డబ్బు కాదు" అంది కామిని.

ఆనందం ఆమెవంక చూశాడు. కామిని కళ్లు సూటిగా వాడిగా నిష్కల్మషంగా అతనివంక చూశాయి.

తక్కున నవ్వింది. "మీరు చాలా మంచి వారు. నేను పెద్ద స్టారునై, చాలా డబ్బు సంపాదిస్తే..." అంటూ చేప అతనిజేబులో వదేసి చరచర నడిచి వెళ్ళిపోయింది కామినీ కుమారి.

"నువ్వు లిచ్చిన డబ్బులు" అని గొణుక్కున్నాడు ఆనందరావు కదలలేక, మెదలలేక.

"నువ్వు లిచ్చిన డబ్బులు..." చక్కని పేరు. మంచి కథ అల్లవచ్చు. చక్కని సినేరియో రాయొచ్చు. ప్రఖ్యాతమైన పిక్చరు తియ్యొచ్చు...ఆనందరావుకి మతి పోయింది. అర్జెంటుగా సినిమా తియ్యాలనుకున్నాడు...అంతకన్న ముందు కథ రాయాలిగా......సినేరియో, పాట స్టుడియో కాంటీన్కి వెళ్ళి కాఫీతాగేడు గబ గబ.

* * *

గబగబ, హుషారుగా తిరిగేసి ఇచ్చే రూపాయి అప్పు సంపాదించాడు. దస్తా కాగితాలూ, పెట్టె సిగరెట్లు కొనుక్కొని, ఇంటికి బయలుదేరాడు. సందు మొగలో కిళ్లీకొట్టుబడ్డీకి బాకీ అర్థరూపాయి చెల్లించి, స్వేచ్ఛగా గాలిపీల్చి, చకచక గదికి వెళ్ళి కథ వ్రాయడం మొదలుపెట్టి సాయంత్రం దీపాల వేళకి ముగించి అవతలపారేశాడు.

* * *

ఇంటాయన విశ్వనాథంగారు తొంగిచూశాడు. "ఏమిటి బాబూ తెగరాసేస్తున్నావు" అన్నాడు నవ్వుతూ.

"కథండి అద్భుతమైన కథ. అత్యద్భుతమైన పాత్రలండి ... చూస్తారా చెప్పనా..." అన్నాడు ఆనందరావు.

"నాకెందుకోయ్ వీనాడూ ఈ గోల! పోనివాళ్లే. నా సిఫార్సు ఇచ్చావా?"

"లేదండి - పొద్దున ఒక కథ పట్టుకు బయలుదేరాను, దారిలో ఇది తోచింది. సరే ఇది రాసిచూపిద్దామని వెనక్కొచ్చేశా" అన్నాడు ఆనందం.

విశ్వనాథంగారు నవ్వి వెళ్ళిపోయారు.

ఆనందం తల దువ్వుకుని, కాగితాలుచేత పట్టుకుని బయలుదేరాడు.

గంటలో గబగబ తిరిగొచ్చాడు. అతను కలుసుకున్న ఆసామి విచారం వెలిబుచ్చాడు. అర్నెల్ల తరవాత కనబడితే తప్పకుండా ఆలోచిస్తానని హామీ ఇచ్చాడు. అప్పటికి కాస్త కాఫీ కూడా ఇచ్చాడు. నాయనా! ... ఆయన వ్యాపార దక్షుడు కాడు. ... కాని వాళ్లకివి రోజులు కావు...

ఆయనమీద కొండంత ఆశ పెట్టుకు వెళ్ళిన ఆనందరావు బోలెడు జాలిపడి కన్నీరు కారుస్తూ - ఇంటికి వచ్చి, సిఫార్సు ఉత్తరం ఇచ్చిన విశ్వనాథం గారికి ఆముక్క కాస్త చెప్పి తలవాల్చి నిల్చున్నాడు.

"ఫరవా లేదు లేవోయ్ నేను కనుక్కుంటా లే...నాకు ఈ ఫీల్డ్లో ప్రవేశం లేకపోయినా, తెలిసినవాళ్లు కొందరున్నారు కనుక్కుంటా లే భయపడకు" అన్నాడాయన.

* * *

ఆనందరావు, గుమ్మంలోకొచ్చేసరికి వరహాలు కనబడ్డాడు. మెట్లదగ్గర నిల్చున్నాడు విచారంగా మీసాలు దువ్వుకుంటూ.

ఆనందానికి తనమీద కలిగిన జాలి యావత్తూ, వాత్సల్యం అయిపోయి, వరహాలు మీదికి మళ్ళింది.

"ఏం వరహాలూ అలా ఉన్నావ్. దా లోపలికి. వేషం ఇవ్వలేదా?" అన్నాడు ఆనందం ఆప్యాయంగా.

ఆనందం కోపం తగ్గినందుకు వరహాలు మురిసిపోయి లోపలికొచ్చాడు.

"లేదుబాబూ. దొంగలసీను షూటింగయిందండి. రాడీవేషం అసలు లేదన్నారు. పోనీ, దొంగోడి వేషమేనా ఇమ్మంటే వేదు పొమ్మన్నారండి. కావలిస్తే లావుపాటి పోలీసోడి రోలుచ్చుకోమన్నారండి."

"ఏడవకపోయారు. లావుకాపోతే, సన్నపాటి వాడి వేషం నీకెలా యిస్తారు." అన్నాడానందం నవ్వుతూ.

"అసలది కాదండి, దొంగోడి వేషం అయితే డైలాగు లేకపోయినా కొంత యాక్షన్ చెయ్యొచ్చు. ఇదేటేది బొమ్మలా నిల్చునేది. అదిసరే వేషం లేకపోడం పాలక యేలాకోలం గూడా ఆడారండి. నేనంట...లావంటూ..."

"కాదు మరి" అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

"మరంటూ...నాకు దొంగోడి వేషం ఇస్తే కెలం పెట్టింగు అవలే పట్టదంట."

"పోన్లే అదేపోయింది. ఇలాంటి వాటికి బాధపడ చెయ్యకు నీకు మంచి వేషం నే నిప్పిస్తా" అన్నాడు ఆనందం.

"నాకు రాడీవేషం కావాల. మంచోడన్న మాట. దారంట ఎల్తే ఓ యాడపడుచుని పలుకురు ఎదవనాయాల్లు అల్లరి పెడుతా రనుకో..."

"మరే మరే అప్పుడు నువ్వు వాళ్లని బాదగొడతావు."

"అద్గదీ...మళ్ళా మాత్రానికి నేను కాడీ లాగే ఉంటా...!"

కూర్చున్నాడు. నెడ్ లాండ్ అట్టుడికిన ట్టుడికి పోతున్నాడు. అంతలో మూ కొక ధ్వని వినిపించింది. తలుపులు తెరుస్తున్న చప్పుడే అది! వెంటనే తలుపులు తెరుచుకున్నాయి. జలాంతర్గామి నాఖురు నెమ్మదిగా లోపలికి వచ్చాడు.

అంతలోనే నెడ్ లాండ్ అమాంతంగా ఆ నాఖురుమీదికురికి గట్టిగా అతని గొంతుకు పట్టుకున్నాడు! ఆ నాఖురుకు ఊపిరి ఆడలేదు.

కౌన్సిల్ ఆ నిర్భాగ్యుణ్ణి విడిపించబోయాడు. నేను కూడా కౌన్సిలుకు సాయపడుతున్నాను. అంతలోనే అతిగంభీరంగా నాకు ఫ్రెంచి భాష వాక్యాలు వినిపించాయి. ఆ మాటలు విని నేను నిర్ఘాంతపోయాను! నాకు వినిపించిన వాక్యాలివి!

"నెడ్ లాండ్! కొంచెం తగ్గు! ఇదుగో ప్రొఫెసర్! నేను చెప్పే మాటలు శ్రద్ధగా విను!"

—ఇంకా ఉంది.

★ సెరిబ్రల్ సినేమియా ★

"అలాగే ఉందుగాని, తందుగాని...తద అలా వెళ్ళొద్దాం" అన్నాడానందం.

* * *

రోడ్లని అరగతీసే వాహనాలకి సర్కారు వారు పన్ను వసూలు చేస్తారట. ఆనందం వాహనం ఆకుజోళ్ళు. సినిమాకంపెనీలు, డైరక్టర్లు, నటీనటులూ ఉండే రోడ్డవెంట తిరిగి తిరిగి అరిగి పోవడంతోపాటు కొన్ని రోడ్లను అరగతీశాయి. గవర్నమెంటువారిది గమనించలేదు. గమనిస్తే చాలామందికి జరిమానా వేసి, పోషించవలసి వస్తుందిగదా అని. లావుపాటి వరహాలు అలాగే రౌడీ వేషం కోసం రొప్పుతూ తిరిగి తిరిగి అలసిపోతున్నాడు.

ఆనందం అద్దెకున్న ఇంటాయన విశ్వనాథంగారుకూడా, ఆనందానికి సహాయం చేయడంకోసం, పాపం మున్పాటలా పని కలిపించుకుని ప్రదక్షిణ ప్రయత్నం సాగిస్తున్నారు. 'సినిమావాళ్ళు మంచి[illegible]' అన్న ఊహ కలిగిందాయనకి క్రమంగా.

* * *

హఠాత్తుగా ఒకరోజున ఆనందరావు ముఖం, చాలారోజులతరవాత తొలిసారిగా ఆనంద పూరితం అయిపోయింది. ఓ కానొకరోజున, స్టూడియో చెట్టుక్రింద అతన్ని అక్కడేదోపొమ్మన్న చిన్న సైజు ప్రొడ్యూసరుకి అర్జంటుగా కథ కావలసొచ్చి ఆనందరావుని తీసుకున్నాడు.

ఆనందరావు పరమానందరావయిపోయి, కొంతసేపు అలాగేవుండి, మళ్ళీ మామూలు యథాస్థితికి వచ్చాడు.

ఈ ప్రొడ్యూసరుకి ఇంకోఅసామి అన్ని విధాలా అడ్డొస్తూ ఒస్తూ, ఒకసారి పరాభవం చేసి అవమానించాడట. ఇపుడు అతగాణ్ణి ఇతగాడు పబ్లిగ్గా అవమానించి శాస్తి చేయదలచాడట.

వరహాలుని పిలిపించాడు. "వేషం ఇస్తా, ఫలానావాణ్ణి పట్టుకుని తంతావా?" అన్నాడు.

"ఛీ. ఛీ. ఎందుకు? నావల్లగాదు అలాటి [illegible]పనులు" అన్నాడు వరహాలు.

జాప్రోగారి ప్రయత్నాలు కలిసిరాలేదు. కిరాయికి రౌడీల్ని వాడుకోవడం అంటే ఆయనకి భయం. ఆలోచించుకోమన్నాడూ వరహాలు ఆలోచించి అదేజవాబిచ్చాడు.

కథ ఈ దశలో ఉండగా జాప్రోగారికి ఆనందరావు తటస్థపడ్డాడు. ఆనందం ఊఁ అంటే వరహాలు సై అంటాడని ఆయనకి తెలిసింది. ఆనందం కథ సినిమా తీస్తానంటే, ఆనందం ఊఁ అంటాడని బాగా తెలుసు.

కాని, తీరా ఆనందాన్ని పిలిచి, కథ తీసుకుంటానని, ప్రకటన చేసి, అసలు సంగతి చెప్పేసరికి అతను ససేమిరా అలా కుదరదనగలిగాడు.

"అతను వట్టి వెర్రిబాగులాడండి. గోవంటి వాడు. ముఖ్యంగా అతి[illegible], ఇలాటి దాంట్లో దింపడం" అన్నాడు.

జాప్రో శతవిధాలా ప్రతిమాలాడాడు. వరహాలు ఖూనీలేం చెయ్యక్కర్లేదన్నాడు. ఊరికే వాడి ఒంటిమీద చెయ్యేసి అవమానిస్తే చాలన్నాడు. ఆపైన ఏమైనా అయితే, తన ప్రాణం అడ్డువేస్తానన్నాడు. చేతికొచ్చిన అవకాశం చెడగొట్టుకోవద్దని కూడా ఆనందాన్ని హెచ్చరించాడు. ఫిలిం ఫీల్డు చరిత్రలో ఇటువంటిపనికి ఇదే తొలి సారి కాదన్నాడు

ఆనందరావు మెల్లిగా, మెల్లిమెల్లిగా, కరిగిపోయాడు. సరే చూదాం అన్నాడు.

అవతలగదిలోనే వరహాలున్నాడు. ఆనందం అక్కడికి వచ్చేసరికి పాతికేళ్ళ కుర్రాడొకడు వరహాలుని "అసిస్టెంట్ డైరెక్టర్" చేసేసి నానాఅవస్థా పెడుతున్నాడు. రేయాన్లాగు, డెకరాన్ షర్టు తొడుక్కున్నాడు ఆకుర్రాడు. ఖరీదైన చలవ కళ్ళజోడు తగిలించడంతో 'డైరెక్టోరియల్ లైను'కి అర్హతసంపాదించేసుకున్నాడు.

వరహాలు మీసాలు రౌడీ వేషానికి చాలవని అతగాడు దబాయిస్తున్నాడు.

ఈ రకంవాళ్లు చాలమందిని ఆనందం ఎరుగును. ఉబలాటంతోపాటు, ఖరీదైన గుడ్డలుకూడా ఉంటే. సినిమా కథా రచన దగ్గర్నించి, ఫిలింప్రింట్లు తియ్యడంవరకూ అన్నీ తెలిసినట్టేనట.

"వరహాలుమాట" అన్నాడు ఆనందం.

"రిహార్సల్సు జరుగుతున్నాయి ఇప్పుడు వీల్లేదు" అన్నాడు అసిస్టెంటు డైరక్టరు.

"నువ్వు డైరెక్షన్ చెయ్యడం నేర్చుకోవ డానికి అతగాడే దొరికాడా!... పంపిం చు" అన్నాడు జాప్రో ఆగది గుమ్మంలోకి వచ్చి.

అసిస్టెంట్ డైరెక్టర్ 'స్టయిలిష్గా విధవమొహం' వేసి, 'ఆల్ రైట్ కట్' అని గొణుక్కున్నాడు.

ఆనందరావు వరహాలు చెయ్యిపట్టుకుని పెరటివేపున ఉన్న చెట్టు దగ్గరికి తీసు కెళ్ళాడు.

రెండు నిముషాలసేపు కర్తవ్యం తేల్చుకోలేక అవస్థపడ్డాడు ఆనందరావు. వరహాలు తనమాట వింటాడు. గోతిలో దూకమంటే కళ్ళు మూసుకు దూకేస్తాడు. అలా దూకితే, ఇపుడు తనకి లాభం. వరహాలుకి దెబ్బ తగలొచ్చు తగులుతుంది. అప్పుడు తను ఆదుకోలేడు. అమాయకుణ్ణి ఇలా వాడుకోవచ్చునా అని బాధపడ్డాడు ఆనందం. మార్గాంతరం లేనపుడు వాడుకోక తప్పదు. దీనివల్ల తనూ, తనవల్ల అతనూకూడా బాగుపడతారు.

ఉత్తిది. వట్టిఅబద్ధం. మోసం. తను టోకరా తింటున్నాడు తింటూ తింటూ, ఆ సంగతి తెలుసుకుంటూ వరహాలుకి టోకరా తినిపిస్తున్నాడు.

"ఏటిబాబూ ఆలోచిస్తున్నారు" అన్నాడు వరహాలు ఉండబట్టలేక.

అక్కడితో ఆనందం ఆలోచనలు అంతమయ్యాయి. మంచో చెడ్డో ఏమయినా సరే అని తెగించాడు.

"చూడు వరహాలూ నువ్వు రేపు ఫలానా వాణ్ణి స్టూడియోలో తన్నాలి. ఎందుకని అడక్కు......"

"ఎందుకు బాబూ ఊరికినే తన్నడం. పోయాసరుగారు కూడా ఇందాక ఇదే చెప్పారు"

వరహాలుకి నచ్చచెప్పడానికి అట్టే సేపు పట్టలేదు ఆనందానికి.

"చూడు వరహాలూ నేను చెప్పిన మనిషి మంచివాడు కాదు. ఆడపిల్లల్ని నానా అవస్థలూ పెడుతున్నాడు. నువ్వు కనక ఇప్పుడు 'మంచి రౌడీలా' వాణ్ణి తన్నితే, ఈ ప్రొడ్యూసరుగారు చూస్తే, వారికినీ యాక్షన్ సంగతి ఇట్టే తెలిసిపోతుంది. అపుడు నీకు ఇట్టేవేషం దొరుకుతుంది. చూసుకో మరి" అన్నాడు గంభీరంగా.

వరహాలుకి ఆనందం చెప్పినమాటల్లో రెండు పాయింట్లూ బుర్రకెక్కాయి

"తన్నినప్పుడు, జాగ్రత్తసుమా. నువ్వు ఆడ వాళ్లను అల్లరి పెడుతున్నావుటగా అందుకు తంతున్నాను అని చెప్పినా అనకూడదు. ఇంకేదేనా వంకపెట్టి తన్నాలి తెలిసిందా" అని హెచ్చరించాడు ఆనందం.

వరహాలు తల ఊపాడు. కథ ఎలా నడ పాలో కూడా [illegible] ఆనందం.

* * *

కథ సగంవరకు సవ్యంగానే నడిచి, బెడిసి కొట్టింది.

ఆనందం, అతన్ని అతకపెట్టిన ప్రొడ్యూసరు, అతని సైనాతీలూ కబుర్లాడుతూ ఉండగా, తన్ను తినదలచిన ఆసామీ సిగరెట్టు

కొంటున్నా ఆలోచిస్తూ ఆ పక్కగానే నడుస్తున్నాడు. ఆ పక్కగానే కూసుకున్న వరహాలు అడ్డబడి తనకి రాడీవేషం ఇచ్చే విషయం ఏమైందన్నాడు. ఆయన నవ్వి ఊరుకున్నాడు. ఆనందందగ్గర తెరిపిదొరకచ్చిన వరహాలు రెట్టించాడు. ఆయన విసుక్కున్నాడు.

"ఏటయ్యా ఇస్తాను ఇవ్వను అని చెప్పరాదు. ఇసుక్కోడం ఎందుకు ఎవడి గొప్పా డిదే. నీ గొప్ప నీ యింటికాడే. జాగర్త మరి" అన్నాడు.

ఆయన మరింత విసుక్కున్నాడు.

"జాగర్త గీగర్త అంటున్నావు ఏం గిరాకీ. ఏంచేస్తావు? తంతావా పెద్ద? ఒళ్లు జాగర్త" అన్నాడు.

"తన్నడం ఏం ఖర్మ యిద్దె అనుకున్నావేటయ్యా. ఇదుగో తంతున్నా ఏంకాత్తావేటి?" అంటూనే వరహాలు ఒక్క చెంప కాయవేశాడు.

జరగాల్సినంత రభసా జరిగింది. ఆయన తిరుగు దెబ్బకొట్టాడు. నలుగుర్ని పిలిచాడు. వచ్చినవాళ్లు వరహాల్ని పాడలేసి చెంపలు వాయగొట్టి బయటికి నెట్టించారు.

వరహాలు బిక్కచచ్చిపోయాడు. కంట నీరు తిరిగింది. వాచిన చెంపలను అరచేతులతో ఒత్తుకుంటూ, కన్నీటి పొరలలోంచి ఆనందం ఉన్న వేపు దీనంగా చూశాడు.

అతని ప్రాణానికి ఎవరూ ఏమీ అడ్డొస్తలేదు.

ఆనందం మొహంచెల్లక, ముందుకువచ్చే ధైర్యంలేక, చెట్టుచాటున తలదాచుకున్నాడు.........జాప్రోగారి మొహం ఓ మోస్తరుగా వికసించింది.

"కొంప మునగలేదుగా. ఎందు కలా ఇదౌతారు?" అన్నాడు ఆనందాన్ని చూసి.

"అబ్బెబ్బె. ఏం లేదండి అన్నాడు ఆనందం నవ్వు తెచ్చుకుని.

* * *

ఆనందం తెచ్చిపెట్టుకున్న ఆనవ్వు ఆకోజు సాయంత్రంవరకూ కిలకిలా పట్టుకు కూర్చుని, తాన్ముని రాలిపోయింది. ఆశ పెట్టిన ప్రొడ్యూసరు, డబ్బు పెడతానని అతన్ని ఆశపెట్టిన డిస్ట్రిబ్యూటరు 'నేను నటిస్తానని' మాట యిచ్చిన నటుడు 'అలాగే' నన్న హీరోయిన్ గార్డియన్, కారులో వచ్చిన ఇంకో యిద్దరూ కలిసి ఆనందం మొహం ముందు అతని కథని తిరగేశారు మరగేశారు. వాతలు పెట్టారు. కథలో కొందరిని చంపారు. చచ్చినవాళ్ళని బ్రతికించారు. కొందరిని పుట్టించి, తపతప చంపారు. చివరికి యావన్మందినీ మళ్ళీ ఆఖర్న బతికించారు.

"ఈ హీరోకి గిరాకీలేదు. ఆ వారా మూర్ఖ హీరోలు ఉంటేనే బాక్సాఫీస్ కోటని జయిస్తాం" అన్నాడు డిస్ట్రిబ్యూటరు.

"మరే నా ఊహా అంతే" అన్నాడు నటుడు.

"అంతేనా!" అన్నాడు ప్రొడ్యూసరు ఆనందంవంక తిరిగి. 'పాయింటే' అన్నాడు ఆనందం బాధగా.

"ఈ హీరోయిన్ ఏర్పాటు బాగులేదండి. ఖరీదైన కాస్ట్యూమ్ వేసుకోడానికి ఒక చాన్సుకూడా ఉన్నట్టులేదు" అన్నాడు హీరోయిన్ గార్డియన్.

"మరే లేనట్టుంది. అయితేనేం డ్రీం సీక్వెన్సు పెడదాం." అన్నాడు ప్రొడ్యూసరు.

"ఏదో ఉద్ధరించినట్టు ఒక్క సీక్వెన్సా."

"దానికేముంది నాలుగైదు పెడదాం. ఒకటి హీరోకల, ఇంకొకటి హీరోయిన్ కల, మరోటి విలన్‌ది, నాలుగోది...."

"ఈ కథలో హీరో చివర్న చచ్చిపోవడం నాకు నచ్చలేదు..." అన్నాడు నటుడు.

"దానివల్ల ఆ పాత్ర మరింత రాణిస్తుందండి. ఒక లక్ష్యంకోసం త్యాగం..."

"నాన్సెన్స్. చివర్న చచ్చే హీరోలన్న ప్రిన్సిపుల్‌కి విరుద్ధం."

"పాయింటేనండి" అన్నాడు ఆనందం నీరసంగా.

* * *

కథమీద కాన్ఫరెన్సు ముగిసింది. టెలిఫోనుమీద ఓ కబురు వచ్చాడు.

స్థూలంగా కథ చెప్పి, హీరో హీరోయిన్లను ఎలా అంతం చెయ్యాలో 'పెద్దలు' ఖరారు చేసేలోగా, మూడు వంతులు కథ సవివరంగా తయారు చేయవలసిందని ఒప్పగించారు.

"మరి నేనో" అన్నాడు ఆనందరావు.

తరవాత మాట్లాడదాం ఉండమన్నాడు ప్రొడ్యూసరుగారు.

అంతా వెళ్లిపోయిన తరవాత, అమ్మయ్య అన్నాడు. ఆర్నెల్లలో తను ఇంకో సినిమా తీయదలచాడనీ, అపుడు గనక ఆనందరావు కనబడితే తప్పకుండా ఎంకరేజ్ చేస్తాడనీ మాట ఇచ్చాడు.

"ఈ కథో?" అన్నాడు ఆనందం.

"ఏ కథ. ఇప్పుడు తయారైనది నీది కాదుగా. అది మేమంతా నిర్మించాం... ఇది డబ్బుతో పని. మీరు బాధపడతారని మేం సాహసించి ఏమీ చెయ్యలేం" అన్నాడు ప్రొడ్యూసరుగారు.

"పాయింటే" అన్నాడు ఆనందరావు. అతనికి ఈసారి బాగా ఏడుపు రాలేదు. పాయింటు తెలుసుకోగలిగాడు కాబట్టి అయినా నీతులుకన్న, చిరాకు, కోపం ఎక్కువ వచ్చాయి. ఒక రకం రోతపుట్టింది.

* * *

"ఛీ" అనుకున్నాడు రోడ్డున పడిపోతూ. అలవాటుకొద్దీ, వరాసగా ఇంకో సినిమా కంపెనీలోకి చొరబడ్డాడు.

"ఏంబాబూ" అంటూ వరహాలు ఎదురవడంతో స్పృహ వచ్చింది. ఆనందానికి. గుండె గతుక్కుమంది వరహాలు ఏమంటాడో ఏం చేస్తాడోనని.

"ఆరికినచ్చిందా బాబూ. రేసం ఇత్తారా మనకి" అని అడిగాడు వరహాలు కొంచెంత ఆశతో.

ఒక క్షణం ఆశ్చర్య పడ్డాడు ఆనందం వరహాలు మంచి మనసుచూసి. ఆప్యాయంగా అతని భుజాన చెయ్యివేసి, "రావరహాలూ, పోదాంపద మన ఊరుకి" అన్నాడు బయటకు నడుస్తూ.

"రేసం ఇవ్వనన్నారా?"

"ఇచ్చినా మనకొద్దు. మనవంటి వాళ్ళకి, నీతి జాతీలేనిచోట చోటులేదు." అన్నాడు ఆనందం కసిగా.

వరహాలు విస్తుపోయి నిల్చున్నాడు.

"ఎవరుబాబూ. మక్కోనా అంత చక్కని మాట అన్నావు."

ఆనందం తుళ్ళిపడి పక్కకి చూశాడు.

కామిని, ఆమె గార్డియన్ అమ్మమ్మ అక్కడ నిల్చున్నారు.

"నువ్వులా" అన్నాడు ఆనందం.

"నా పేరు కామినీదేవి. అది సరేగాని, నువ్విప్పుడన్న మాట ఇంకెప్పుడూ అనబోకు తెలిసిందా?" అంది కామిని.

"ఏం. మధ్య నీకేం?"

"నాకే కావాలి. నేను దీనిమీద ఆశపెట్టుకున్నాను. నది ముందికి అన్నంపెట్టే ఉపాధిని, పదిమంది నమ్ముకున్నదాన్ని, ఎన్నడూ తిట్టకు. నువ్వు ఒరుగుతుందనుకున్న దేదో వచ్చి పడకపోతే, నోటి కొచ్చినట్టు...ఇదుగో, మీవూరికో వంటున్నావు కదూ. నిక్షేపంలావెళ్ళు. వెళ్లేముందు ఒక్కసారి నువ్వు అద్దెకున్న ఇంటి గోడమీద ఏముందో చూడు" అనేసి చరచర వెళ్ళిపోయింది కామిని — వాళ్ల

సెరిబ్రల్ సినేమియా

'అమ్మమ్మ' లెక్కపెట్టుకుని 'రాబోదాం' అంటూ.

"సుబ్బులూ" అన్నాడు ఆనందం...

* * *

వరహాలూ ఆనందం తీసుకుని, ఆలోచిస్తూ బయల్దేరారు.

సూర్యుడు అస్తమిస్తున్నాడు.

ఆనందం ఇంటికి వెళ్ళేసరికి, ఇంటాయన విశ్వనాథంగారు కూడా పుడిగా ఉన్నారు.

వాకిట్లో గోడకి ఓ బోర్డొకటి వ్రేలాడదీసి వుంది.

ఇంటాయన పేరు క్రింద, సినిమా పత్రికలకి అక్కడ ఏమి చేసిపెట్టబడునో రాసి వుంది. అందులో కథలు, పాటలూ వ్రాసిపెట్టబడడం దగ్గరనుంచి నటించి పెట్టబడడం మొదలైన అనేక అంశాలున్నాయి. ఆయన ఫలానా ఫిలింలో బుక్ అయిన వైనం కూడా ఆ బోర్డులో ఇమిడ్చివుంది.

"విటిబాబూ ఈ బోర్డు యవ్వారం?" అన్నాడు వరహాలు కొంచెం ఆశ్చర్యంతో.

"సెరిబ్రల్ సినేమియా" అన్నాడు ఆనందం, ఆ బోర్డుని మళ్లీ మళ్లీ చదువుతూ. బుర్ర గిర్రున తిరిగింది....

సూపర్ ఇంపోజ్. సుడుగు క్లోజప్. అందులో గిర్రున తిరిగే సైలుచక్రాలు ... కట్" అనుకున్నాడు ఆనందరావు.

* * *

"వరహాలూ!" అన్నాడు ఆనందం.

"బాబూ!"

"మనం ఊరికి వెళ్ళొద్దు"

"ఇక్కడే ఉండిపోదాం రా?"

"ఔనురా. నాకుమళ్లీ ఓ మంచిఐడియా వచ్చింది. మళ్లీ కథ రాస్తాను. ఓ ప్రొడ్యూసర్ చూస్తానన్నాడు..."

"మరి నాకు వేషం ఇస్తావా..."

"ఆ ఛాన్స్ నాది."

"వేషం అంటే గాడి వేషం...గుంటక్క వేషం..."

"మరే. నాటానికి గాడిలా ఉంటావు."

"అంతే అంతే...ఓ పనుకు వోక్క్రీ తిన్నంగ ఎల్లాపుంటుంది...అధ వేసినా నలుగురూ రాడీనాయాళ్లు..." ★

దుమారం

(27 వ పేజీ తరువాయి)

గానీ ఆయనసంగతంటే నాకు అరికాలి మంట నెత్తికొస్తున్నది.

శర్మ: (ప్రవేశిస్తూ) శాస్త్రిగారూ! (అందరివంకా చూస్తూ సాలోచనగా నిలబడ్డాడు.)

గిరిజ: (చివాల్న లేచి నిష్క్రమిస్తుంది.)

సూర్యం: (కిసుక్కు కిసుక్కు చురచురా శర్మగారివంక చూస్తూ నిక్కును.)

శాస్త్రి: రండీ కూచోండి నుంచున్నారేం?

శర్మ: (కూర్చుంటూ) క్షమించాలి. అంతా వినపడుతూనే వుంది.

శాస్త్రి: (నవ్వుతూ) ఏదో చిన్నతనం వాళ్ల మొహం ఏదైనా అవాకులనుంటే క్షమిస్తారనుకొంటా.

శర్మ: నాకుమటుకు తెలియదుటండీ. తాతా పురిటిమంచంలో నివాడే గదా.

శాస్త్రి: (నవ్వుతూ) మొత్తానికి సీరియస్ చార్జీలు ఫ్రేముయినాయి.

శర్మ: (నవ్వుతూనే) సమాధానం చెప్పుకోటానికే వచ్చా.

శాస్త్రి: (ఏదో గుర్తుకువచ్చి భార్యకు సంజ్ఞ చేయును.)

శర్మ మాపండి. ఒక్క కోరిక గిరిజను తీసుకరమ్మనండీ ఆ కాఫీలని.

శాస్త్రి: తప్పకుండా (లోనికి) అమ్మా! గిరిజా! కాఫీలని నువ్వే తీసుకరావమ్మా. శర్మగారుకూడా వచ్చారు.

శర్మ: (నవ్వు కుంటాడు.)

ఇంది: (లోనికి పోవును.)

శాస్త్రి: ఆఁ. ఏమిటండీ కబుర్లు?

శర్మ: మీరుమటుకు నన్ను అపార్థం చేసుకోలేదనుకొంటా?

శాస్త్రి: ఆ సంగతలా వుంగండి. మరే మున్నా చెప్పండి.

గిరిజ: (ప్రవేశం. అయిష్టంగా తల వంచుకొని ట్రేలో కాఫీ తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోబోవును.)

శాస్త్రి: అమ్మా! తప్పు కాదూ! అలా కూచో. (కొడుకుతో) ఒరే సూర్యం యిలా రా నువ్వుకూడా.

సూర్యం: (తల వంచుకొని అడుగులో అడుగేసుకొంటూ వచ్చి కూర్చొనును.)

శాస్త్రి: ఏమిట్రా? ఆ బాలకం. ఇంటికి పెద్ద మనిషి వొస్తే?

శర్మ: (నవ్వుతూ) కోప్పడకండీ!

శాస్త్రి: (కాఫీ అందిస్తూ శర్మగారితో) పుచ్చుకోండి

శర్మ: (కప్పు నందుకొని) అమ్మా! గిరిజా! కాస్త తలెత్తమ్మా!

గిరిజ: (ఆశ్చర్యంగా తలెత్తును.)

శర్మ: కోపం వచ్చిందా? ఏమమ్మా!

గిరిజ: (నిట్టూరుస్తూ తలదించుకొనును.)

సూర్యం: (శర్మగారివంక చురచురా చూస్తూ వుండును.)

శాస్త్రి: (సూర్యంతో) శాంతించవోయ్.

శర్మ: ఏమండీ ఇందిరమ్మగారూ మీరు లోపలే వుండిపోయారు.

ఇంది: (వచ్చి నిలబడును.)

శాస్త్రి: (నవ్వుకొంటూంటాడు.)

శర్మ: అయిన కూడా వుడి అంతా వింటూనే వున్నాను.

సూర్యం: (గతుక్కుమని తలెత్తి చూచును.)

శర్మ: అమ్మా గిరిజా! నువ్వేం లేదమ్మా. నిన్ను చూచినప్పుడల్లా, ఐదో ఏట ప్లేటకంపోసిపోయిన నాకూతురు గుర్తుకొస్తుందమ్మా బతికి వుంటే అంతా నీలాగానే వుండేది. (అని కన్నీళ్లని రుమాలుతో తుడుచుకొంటాడు.)

శాస్త్రి: హుఁ. తెలిసిందా? అందరికీ.

గిరిజ: (తలెత్తుతుంది కళ్ళనీళ్లు జలజలా రాల్తాయి. చేతుల్లో మొహం దాచుకొంటుంది)

సూర్యం: (లేచి నమస్కరిస్తూ) బాబాయిగారూ! క్షమించండి ఏదో పేలేను.

శర్మ: పిచ్చివాడా. కూచో! (గిరిజతో) అమ్మా గిరిజా! ఏమిటది పిచ్చి.

శాస్త్రి: ఏమిటమ్మా పూరుకో.

గిరిజ: బాబాయిగారూ! మిమ్మల్ని పాపం చేసికొన్నాను అపరాధం.

శర్మ: అది నీతప్పు కాదు. అపారానికి తానిచ్చినందుకు నాదే నేమో తప్పు.

శాస్త్రి: నో నో నెవర్ మైండ్.

ఇంది: కాగా నేవుంది సౌశీల్యం.

శాస్త్రి: ఏమర్రా మనస్సులు తేలికైనాయా? కాఫీకూడా తాగండి. తేలికపడడమే కాక నేటుపడుతుంది కూడా.

(సూర్యం, గిరిజా నిష్కారిన మొహాలతో కాఫీల నందుకొంటారు.)

శర్మ: సరేకాని ఓనాటి సూర్యం. మా రాధమాటో?


సూర్యం: (కాఫీ తాగుతున్నవాడల్లా గతుక్కుమంటాడు.)

శాస్త్రి: అదేమిటండోయ్!

శర్మ: (సూర్యంతో) అరెరె! సారీ. కాఫీ పుచ్చుకో. భయపడకు. (శాస్త్రితో) మరేం లేదండీ మీ అబ్బాయి తిరుగు ప్రతిజ్ఞ పట్టాడు నామీద. దానిసంగతి కూడా...

(అందరూ నవ్వుకొంటూరు. సూర్యం యిబ్బందిగా ముఖం పెడతాడు తెర వ్రాలును.) ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



ద్వారకా తిరుమల దేవాలయము


ఫొటో: పెరవలి పురుషోత్తం,—ఏలూరు.

దేవీదయాళ్స్

స్టెయిన్‌లెస్ స్టీల్

వెండిలాగ మెరుస్తుంది....

వెండిలాగ మన్నుతుంది....



అయినప్పటికీ

ధర చాలా తక్కువ .....

మెస్సర్సు: దేవీదయాళ్ సేల్సు ప్రైవేట్ లిమిటెడ్

35, మెయిన్ రోడ్డు, రాయపురం, మద్రాసు-13.